సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 111

శుక్రవారం 12-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'





ఎవర్‌గ్రీన్ ఆర్ట్ వర్క్

ఫుల్కారీ కండువాలు, శాలువాలు, దుపట్టాలకు మాత్రమే పరిమితంగా ఉండేది. కానీ నేడు కుర్తాలు, లెహంగాలు, జాకెట్లు, స్టోల్స్, చీరలు, ఫ్రాగ్‌లు, స్కర్ట్‌లు, కఫ్తాన్లు, ఫ్యూజన్ అవుట్‌ఫిట్‌లు, పాదరక్షలు, బెల్ట్‌లు, హెయిర్ బ్యాండ్స్, బ్యాగ్‌లు, పౌచ్‌లు, క్లచ్‌లు, గొడుగుల డిజైన్లలోనూ.. ఫుల్కారీ కళ కనిపిస్తోంది.



ఫుల్కారీ నక్షత్రాలు

మన దేశీయ సంప్రదాయ కళల ప్రాముఖ్యత ఎంతటిదో మనకు తెలిసిందే. పంజాబ్ 'ఫుల్కారీ కళ'కు ప్రసిద్ధి. వారి సంప్రదాయ వేడుకలలో ప్రధానంగా కనిపిస్తుంది. 'పూల కళ'గా పేరొందిన ఈ వర్క్ దుపట్టాలు, చీరలమీదనే కాదు ఆధునిక డ్రెస్సుల మీద, ఇతర యాక్సెసరీస్‌లోనూ కనువిందు చేస్తోంది. నక్షత్రాల్లా మెరిసిపోతూ ఆకర్షణీయంగా కనిపించే ఈ కళ పండగల వేళ మరింత ప్రత్యేకతను చాటుతోంది. ఫ్యాషన్ వేదికల మీదా కనువిందు చేస్తోంది.



● ఇండోవెస్ట్రన్ డ్రెస్సులకీ కళ తెచ్చే ఫుల్కారీ

ఒక్కో ప్రాంతానికి ఒక్కో విశిష్టత ఉన్నట్టే ఒక్కో కళ కూడా తన ప్రత్యేకతను చూపుతుంటుంది. హిందీలో 'ఫూల్' అంటే పువ్వు అని అర్థం. వేదకాలంలోనూ ఈ జానపద కళ మూలాలున్నాయని చెబుతుంటారు. అయితే, 15వ శతాబ్దంలో పంజాబ్‌లోని మహిళల ద్వారా మొదలైందని తెలుస్తుంది. వివాహాలు ఇతర వేడుకలలో మహిళలు ఫుల్కారీలు ధరించడం, బహుమతులు ఇవ్వడం అక్కడి సంప్రదాయం. ఇది పూర్తిగా గృహసంబంధమైన దేశీయ కళ. ఖద్దరు క్లాత్‌పైన రంగు రంగుల సిల్క్, కాటన్ దారాలతో ఎంబ్రాయిడరీ చేస్తారు. రేఖాగణితంలోని జామెట్రీని ఈ డిజైన్లు పోలి ఉంటాయి.



● ఫుల్కారీ ఎంబ్రాయిడరీలో విభిన్న డిజైన్లు

విభిన్న డిజైన్లు

ఈ డిజైన్లలో బాగ్, ఛమాస్, నీలక్, చోప్.. వంటి 52 రకాల ఫుల్కారీలు ఉన్నాయి. అయితే, వీటిలో కొన్ని మాత్రమే ఇప్పుడు వాడుకలో ఉన్నాయి. గతంలో ఈ ఎంబ్రాయిడరీని స్త్రీలు చేతులతో చేసేవారు. ఇప్పుడు యంత్రాలు, ఆధునిక పద్ధతులలో కొత్త వస్తువులను ఉపయోగిస్తున్నారు. ఈ కళ టెక్నిక్స్‌ని చాలా మంది ఆధునిక డిజైనర్లు గ్లోబల్ మార్కెట్‌ను చేరుకోవడానికి ఎంచుకుంటున్నారు.

సంప్రదాయ రంగులు

ఫుల్కారీ కళలో రంగుల వాడకం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సాంప్రదాయకంగా నాలుగు రంగులు మాత్రమే ఉపయోగిస్తారు. కాబోయే వధువులకు ఎరుపు, రోజువారీ వాడకంలో నీలం, నలుపు, ముదురు షేడ్స్ ఉపయోగిస్తారు. ఉత్సాహాన్ని సూచించడానికి ఎరుపు, శక్తి కోసం నారింజ, సంతానోత్పత్తికి ఆకుపచ్చ రంగును వాడతారు.

ప్రకృతితో ప్రేమ

ఫుల్కారీ మూలాంశాలకు ప్రేరణ ప్రకృతియే. తల్లీ కూతుళ్ల అనుబంధం, జంతువులు, పక్షులు, ఉద్యాన వనాలు, బంతి, మల్లెలు, నెమలి, ఆవ పూలు... స్త్రీల భావోద్వేగాలకు అద్దం పడుతున్నాయా అన్నట్టు ఈ కళ సృజనాత్మకతకు అద్దం పడుతుంది.



● యాక్సెసరీస్‌లోనూ ఫుల్కారీ వర్క్



● ఫుల్కారీ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన దుపట్టా



ఆరోగ్యంలో మునగండి!

ఆషాడంలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోతాం. మునగాకు తినాలని కూడా చెప్పారు పెద్దవాళ్లు. మహిళల ఆరోగ్యాన్ని సంప్రదాయాల పట్టికలో చేర్చారు. పెద్దవాళ్లు చెప్పిన పద్ధతులను పాటిద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

వంటిల్లు

కొబ్బరి మునగాకు వేపుడు



కావలసినవి: మునగాకు పావు కేజీ; పసుపు – పావు టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము– పావు కప్పు; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు; ఉప్పు – అర టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్; ఆవాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; వెల్లుల్లి రేకలు– 4; కరివేపాకు– 2 రెమ్మలు.

తయారీ: ● మునగాకులో పుల్లలు తీసివేసి, ఆకును శుభ్రంగా కడిగి నీరు పోయేటట్లు చిల్లుల పాత్రలో వేయాలి. అరగంటసేపు పక్కన ఉంచాలి. బాగా ఆరిన తర్వాత ఒక పాత్రలోకి తీసుకుని అందులో కొబ్బరి తురుము, పసుపు వేసి కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండు మిర్చి, పచ్చి శనగపప్పు వేసి అవి వేగిన తర్వాత వెల్లుల్లి రేకలు, ఉల్లిపాయ ముక్కలు, మిరప్పొడి, కరివేపాకు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత ముందుగా కలిపి సిద్ధంగా ఉంచుకున్న మునగాకు, కొబ్బరి మిశ్రమం, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి సన్న మంట వేగనివ్వాలి. మధ్యలో మూత తీసి కలుపుతూ ఆకులో పచ్చిదనం, తేమ పోయే వరకు వేగనిచ్చి ఉప్పు సరిచూసుకుని ఆపేయాలి.

మొరింగా ఆమ్లెట్



కావలసినవి: కోడిగుడ్లు – 2; మునగాకు – అర కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్; మిరియాలపొడి– పావు టీ స్పూన్; వెన్న లేదా నెయ్యి– టేబుల్ స్పూన్.

తయారీ: ● మునగాకులో పుల్లలు ఏరివేసి ఆకును శుభ్రంగా కడిగి నీరంతా పోయేటట్లు చిల్లుల పాత్రలో వేయాలి. నీరు కారిపోయిన తర్వాత తరిగి ఒక పాత్రలో వేయాలి. అందులో ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడిగుడ్లు కొట్టి సొనవేసి కలపాలి ● పెనం వేడిచేసి వెన్న లేదా నెయ్యి వేసి కరిగిన తర్వాత మునగాకు, కోడిగుడ్ల మిశ్రమాన్ని వేయాలి. ఒకవైపు కాలిన తర్వాత తిరగేసి రెండోవైపు కూడా దోరగా కాలనిచ్చి స్టవ్ ఆపేయాలి.

గమనిక: కోడిగుడ్డు సొన కాలే సమయంలో మునగాకు కూడా మగ్గిపోతుంది. పచ్చివాసన వస్తుందని సందేహం ఉంటే మునగాకును పెనం మీద పచ్చివాసన పోయే వరకు వేయించి ఆ తర్వాత మిగిలిన దినుసులను కలిపి ఆమ్లెట్ వేసుకోవాలి.

న్యూస్‌మేకర్

కామన్‌వెల్త్ బహుమతి గెలిచిన అమ్మ కథ

ఆధునిక జీవితం అమ్మను ఎక్కడకు చేర్చింది? వృద్ధాశ్రమానికి. ఒకమ్మాయికి వృద్ధాశ్రమంలో నుంచి ఒక తల్లిని ఇంటికి తెచ్చుకోవాలని అనిపిస్తుంది. కాని వృద్ధాశ్రమంలో చూస్తే అందరు తల్లులూ అద్భుతంగా అనిపిస్తారు. ఇంత మంచి తల్లులను ఎందుకు పెట్టారోనని సంజనా ఠాకూర్ రాసిన కథ కామన్‌వెల్త్ ప్రైజ్ 2024 గెలుచుకుంది. సంజనా ఠాకూర్ పరిచయం.



'స్కూల్ టీచర్లకు నన్ను తిట్టాలని ఉండేది. కాని తిట్టలేకపోయేవారు. సంజనా బాగా చదువుతుంది... హోమ్ వర్క్ చేస్తుంది... కాని క్లాస్ జరుగుతుంటే టేబుల్ కింద కూచుని కథల పుస్తకం చదువుతోంది అని కంప్లయింట్ చేసేవారు. నాకు చిన్నప్పటి నుంచి పుస్తకాలంటే అంత పిచ్చి. మా అమ్మ రోజూ నాకు కథలు చదివి వినిపించేది. నేను మా ఫ్యామిలీ ఫంక్షన్లకు వెళ్లినా పార్టీలకు వెళ్లినా పుస్తకం పట్టుకుని మూలన కూచునేదాన్ని. చిన్నప్పుడే రాయడం మొదలెట్టాను. ఇప్పుడు ఈ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది' అంటుంది 26 సంవత్సరాల సంజనా ఠాకూర్. ముంబైకి చెందిన సంజన ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్‌లో ఎం.ఎఫ్.ఎ. ఫిక్షన్ చదువుతోంది. ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'కామన్‌వెల్త్ షార్ట్ స్టోరీ ప్రైజ్' పోటీల్లో పాల్గొని 2024 సంవత్సరానికి విజేత అయింది.

ఐదు లక్షల బహుమతి

కామన్‌వెల్త్ దేశాలలోని యువ రచయితలను ఉత్సాహపరచడానికి కామన్‌వెల్త్ ఫౌండేషన్ ఏటా కథల పోటీ నిర్వహిస్తుంది. 18 ఏళ్లు పైబడిన వారు దీనికి అర్హులు. నేరుగా ఇంగ్లిష్‌లో కాని లేదా ఇంగ్లిష్‌లో అనువాదమైన స్థానికభాష కథ గాని పంపవచ్చు. 2500 పదాల నుంచి 5000 పదాల వరకూ కథ ఉండాలి. ఇందులో మళ్లీ ఐదు రీజియన్లకు (ఆఫ్రికా, ఆసియా, కెనడా–యూరప్, పసిఫిక్) ఐదుగురు రీజనల్ విన్నర్స్‌ను ప్రకటిస్తారు. వీరి నుంచి ఓవరాల్ విన్నర్‌ను ఎంపిక చేస్తారు. 2024కు ఆసియా రీజనల్ విన్నర్‌గా నిలిచిన సంజనా ఠాకూర్ ఓవరాల్ విన్నర్‌గా కూడా ఎంపికైంది. నగదు బహుమతిగా 5000 పౌండ్లు గెలుచుకుంది.

కథ పేరు ఐశ్వర్యారాయ్

'అమెరికాలో నేనొక బొమ్మల షాపులో తిరుగుతున్నప్పుడు కేవలం అమ్మ బొమ్మలు అమ్మే ఒక షాప్ ఉంటే ఎలా ఉంటుందా అనే ఆలోచన వచ్చింది. అక్కడినుంచి పిల్లలు అమ్మల్ని దత్తత తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన కొనసాగింది. ఇండియాలో పట్టణ సంస్కృతి ఇప్పుడు ఇళ్లల్లో అమ్మకు చోటు లేకుండా చేస్తోంది. ఆమె వృద్ధాశ్రమంలో ఉండాల్సి వస్తోంది. నా కథలో అన్వి అనే అమ్మాయి ఒక వృద్ధాశ్రమానికి వెళ్లి ఒక అమ్మను దత్తత తీసుకోవాలనుకుంటుంది. కాని ఒక్కో అమ్మ ఒక్కో లక్షణంలో గొప్పగా కనిపిస్తుంది. అమ్మలందరూ తమ అనుబంధం రీత్యా ఐశ్వర్యారాయ్ కంటే తక్కువ సౌందర్యవతులు కాదు. ఏ అమ్మ సౌందర్యమైనా బంధం రీత్యా ఐశ్వర్యారాయ్ అంత అందమైనదే. అందుకే ఆ పేరుతోనే కథ రాశాను. వ్యంగ్యం, చెణుకులు ఉండటంతో నా కథను జడ్జిలు మెచ్చుకొని ఉండొచ్చు' అని తెలిపింది సంజనా.

త్వరలో పుస్తకం

'త్వరలో 15 కథలతో నేను పుస్తకం తెస్తాను. ఇప్పటికే రాశాను. అందులో అన్ని కథల్లోనూ తల్లులూ కూతుళ్లు కనిపిస్తారు. వారి భిన్న భావోద్వేగాలు చర్చకు వస్తాయి. ప్రస్తుతం నా థీసిస్‌లో భాగంగా ఈ కథలను సబ్మిట్ చేయగానే పుస్తకం పని మొదలెడతాను. ప్రపంచ సాహిత్యంలో చాలా మంచి రచనలు వస్తున్నాయి. మన దేశం నుంచి అరుంధతి రాయ్ శైలి నాకు బాగా నచ్చుతుంది' అందామె.

సాహిత్యాన్ని ఒక చదువుగా... రచనను ఒక ఉపాధిగా చేసుకోదలిచింది సంజన.

హెల్త్ ఫ్యాక్ట్

శాకాహారంతోనూ మంచి మజిల్స్!

మంచి శరీర సౌష్ఠవం కోరుతూ వ్యాయామాలు చేసేవారు తమ మజిల్స్ పెరగడానికి మాంసాహారాన్ని తీసుకుంటుంటారు. అయితే శాకాహారపు ప్రొటీన్లు సైతం మంచి కండరాలను ఇస్తాయంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్‌కు చెందిన పరిశోధకులు. బలమైన కండరానికి ప్రొటీన్ కావాలి తప్ప... అది మాంసం నుంచా లేక శాకాహారం నుంచా అన్నది అంత ప్రధానాంశం కాదంటున్నారు వారు. కొందరు



ఎక్సర్‌సైజ్ ప్రియులను ఆరు గ్రూపులు గా విభజించి వారికి... కొవ్వులు ఎక్కువగా ఉండే పాలు–వాటి ఉత్పాదనలు, చేపలు, వేటమాంసం, చికెన్, కొవ్వు తక్కువగా ఉండే పాలు, బఠాణీల వంటి పప్పుధాన్యాలను అందించారు. దీనికి ముందూ... ఆ తర్వాత వారి మజిల్ మాస్, కండరాల సౌష్ఠవం వంటి వాటిని లెక్కించారు. ప్రొటీన్ ఏదైనప్పటికీ మజిల్‌మాస్, బలం, సౌష్ఠవం వంటి అంశాల్లో పెద్ద తేడాలేమీ కనిపించకపోగా.. శాకాహార ప్రొటీన్ తీసుకున్న వారిలో ప్రోస్టేట్‌కు సంబంధించిన కొన్ని అనర్థాల ఆనవాళ్లు లేవని తేలింది!

ఆచారం

ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒక గడప దాటకూడదా?

ఆషాఢంలో అత్తాకోడళ్ళు ఒక గడప దాటకూడదని, అత్తా అల్లుళ్లు ఒకరికొకరు ఎదురు పడకూడదని, కొత్త దంపతులు కలవకూడదనీ అంటారు. ఎందుకంటే...

సాధారణంగా వ్యవసాయ పనులన్నీ ఈ మాసంలోనే రైతులు ప్రారంభిస్తారు. పూర్వం రోజుల్లో కొత్తగా పెళ్లయిన అబ్బాయి ఆరు నెలల కాలం అత్తగారింట్లో ఉండే సంప్రదాయం ఉండేది. వ్యవసాయపు పనులు చేయవలసిన యువకులు అత్తవారింట్లో ఉంటే, సకాలంలో పనులు జరగవు. వర్షాలకు తగినట్లుగా విత్తనాలు చల్లుకొనే రోజులు అవి. ఇప్పటిలా కాల్వల ద్వారా నీరు లభించేది కాదు. సరైన సమయంలో విత్తనాలు చల్లకపోతే కష్టం కదా... అందుకే కొత్త కోడలు పుట్టింట్లోనే ఉండాలి. అల్లుడు అత్తవారింటికి వెళ్ళకూడదు అనే నియమం విధించారు. అంతేకాకుండా, కొత్త నీరు వచ్చే ఆషాఢంలో ఆ నీరు తాగటం వల్ల రకరకాల రుగ్మతలకు లోను కావచ్చు. అంతేకాదు, ఈ కాలంలో గర్భధారణ జరిగితే పిల్లలు కలిగే నాటికి మంచి ఎండాకాలం... శిశువు పెరగటానికి అంత మంచి వాతావరణం కాదు అని ఆలోచించారు. అందుకే ఈ నియమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి రోజులకు అన్వయించుకుంటే... వ్యవసాయదారుల కుటుంబాలు కాకుండా ఇతరుల విషయంలో ఈ ఇబ్బంది లేదు.

ఆర్గానిక్ స్కిన్‌కేర్

సహజమైన గెలుపు

చర్మ సమస్యలతో ఇబ్బంది పడుతున్న కుమార్తెను చూసి బాధ పడింది కృతిక కుమారన్. ఈ నేపథ్యంలోనే కెమికల్ ఫ్రీ ప్రాడక్ట్‌ల గురించి ఆలోచించింది. నేచురల్ కాస్మటాలజీలో డిప్లొమా చేసిన తరువాత ప్రయోగాలు ప్రారంభించి విజయం సాధించింది. కోయంబత్తూరుకు చెందిన కృతిక కుమారన్ ఆర్గానిక్ స్కిన్‌కేర్ స్టార్టప్ 'విల్వా' సూపర్ సక్సెస్ అయింది...



తమిళనాడులోని గోబిచెట్టిపాళయం అనే ఊళ్లో పుట్టి పెరిగింది కృతి. తండ్రి లాయర్. తల్లి గృహిణి. ఉన్నత విద్య కోసం కోయంబత్తూరుకు వెళ్లిన కృతిక 'కుమారగురు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ'లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీలో బీటెక్ చేసింది. ఆ తరువాత తమిళ్ కుమారన్ అనే వస్త్ర వ్యాపారితో కృతికకు వివాహం జరిగింది.

కుమార్తెకు చర్మసమస్యలు వచ్చినప్పుడు మార్కెట్‌లోని కొన్ని సబ్బులు, షాంపులను ప్రయత్నించిందిగానీ అవేమీ ఫలితం ఇవ్వలేదు. దీంతో సహజ సిద్ధమైన పదార్థాలను ఉపయోగించి సబ్బులు తయారు చేయాలని నిర్ణయించుకుంది. 'కాస్మటాలజీలో డిప్లొమా చేయడం నుంచి యూ ట్యూబ్‌లో వీడియోలు చూడడం వరకు ఎన్నో అంశాలు నా ప్రయోగాలలో ఉపయోగపడ్డాయి' అంటుంది కృతిక.



● ప్రయోగశాలలో కృతిక కుమారన్

ముందుగా వంటగదిలో మేకపాలతో ప్రయోగాలు మొదలుపెట్టింది. కుటుంబ సభ్యులు కూడా ఈ ప్రయోగాల్లో పాలు పంచుకున్నారు. 'అనేక ప్రయోగాల తరువాత విజయం సాధించాం. మొదట్లో రెండు మేకలు ఉండేవి. ఇప్పుడు మేకల మందలు ఉన్నాయి. వాటి తాజా పాలతో మా ప్రాడక్ట్స్ తయారు చేస్తున్నాం. హానికరమైన రసాయనాలకు దూరంగా ఉన్నాం' అంటుంది కృతిక.

జుట్టు, చర్మసంరక్షణ ఇతర సౌందర్య ఉత్పత్తులతోపాటు లెమన్ గ్రాస్‌తో దోమల నివారణ మందును కూడా తయారు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోర్‌తో తొలి అడుగు వేశారు. రెండు సంవత్సరాల తరువాత వెబ్‌సైట్‌ను మొదలు పెట్టడంతో పాటు డిస్ట్రిబ్యూషన్, లాజిస్టిక్స్‌లోకి వచ్చారు. అగ్రశ్రేణి డిస్ట్రిబ్యూషన్, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లతో కలిసి పని చేయడం మొదలుపెట్టారు. ఆ తరువాత ఆఫ్‌లైన్ స్టోర్‌లకు కూడా శ్రీకారం చుట్టారు.

'ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మా ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని షేర్ చేసినప్పుడు కోయంబత్తూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వాట్సాప్ ద్వారా ఆర్డర్లు వచ్చేవి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, నైకా లాంటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్ మా ఉత్పత్తులను లిస్టింగ్ చేయడంతో వ్యాపారపరిధి విస్తరించింది' అంటుంది కృతిక.

'లాభాల దృష్టితో కాకుండా మా కంపెనీ ద్వారా రైతులు, చేతివృత్తుల కార్మికులకు ఏదో రకంగా ఉపయోగపడాలనుకుంటున్నాం. పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్‌లను ఉపయోగిస్తున్నాం' అంటుంది కృతిక.

సంగీత, నృత్యాలలో ప్రవేశం ఉన్న కృతికకు చిన్నప్పటి నుంచి కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి. ఆ జిజ్ఞాస ఆమెను వ్యాపార దారిలోకి తీసుకువచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా తిరుగులేని విజయం సాధించేలా చేసింది.

ఇద్దరితో ప్రారంభమైన 'విల్వా'లో ఇప్పుడు వందమందికి పైగా పనిచేస్తున్నారు. పదివేల రూపాయలతో మొదలైన కంపెనీ సంవత్సరం తిరిగేసరికల్లా కోటి రూపాయల టర్నోవర్‌కు చేరింది. ఇప్పుడు కంపెనీ టర్నోవర్ 29 కోట్లు.



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 111

శుక్రవారం 12-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

యువర్స్

2.0

● టెక్... టాక్

వన్‌ప్లస్ వాచ్ 2



డిస్‌ప్లే	:	1.43 అంగుళాలు
బ్యాటరీ	:	500 ఎంఏహెచ్
ర్యామ్	:	2జీబీ
స్టోరేజ్	:	32 జీబీ
రిజల్యూషన్	:	466×466 పిక్సెల్స్
		● 100 స్పోర్ట్స్ మోడ్స్
కలర్స్	:	బ్లాక్, గ్రీన్

షావోమి పోకో ప్యాడ్



డిస్‌ప్లే	:	12.10 అంగుళాలు
బరువు	:	571 గ్రా.
రిజల్యూషన్	:	1600×2560 పిక్సెల్స్
మెమొరీ	:	256జీబీ/ 8జీబీ ర్యామ్
బ్యాటరి	:	10000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా	:	8ఎంపీ

దిగంతర

● సక్సెస్ స్టోరీ: స్పేస్ టెక్ స్టార్టప్

కాలేజీ రోజుల్లో కల కనని వారు అంటూ ఉండరు. ఆ కలకు కష్టం, అంకితభావం తోడైతే ఎంత పెద్ద విజయం సాధించవచ్చో 'దిగంతర' నిరూపించింది. అనిరుధ్ శర్మ, రాహుల్ రావత్, తన్వీర్ అహ్మద్ అనే కుర్రవాళ్లు కాలేజీ రోజుల్లో కన్న కలను స్పేస్-టెక్ స్టార్టప్ 'దిగంతర' రూపంలో సాకారం చేసుకొని తిరుగు లేని విజయాన్ని సాధించారు....


తన్వీర్ అహ్మద్, అనిరుధ్ శర్మ, రాహుల్ రావత్

'దిగంతర మొదలైనప్పుడు, ఇప్పటికి తేడా ఏమిటి?' అనే ప్రశ్నకు వినిపించే జవాబు... 'దిగంతర' అంటే అంతరిక్ష వ్యర్థాలను గుర్తించే సంస్థగానే ఎక్కువ గుర్తింపు ఉండేది. తాజా విషయానికి వస్తే... విని యోగదారులకు సేవలు అందించడం మాత్రమే కాకుండా మన దేశ రక్షణ ప్రయోజనాల విషయంలో మౌలిక సదుపాయాలను అందించే సంస్థగా అభివృద్ధి చెందింది. 'అంతరిక్షంలో ఏం జరుగుతుంది?' అనేది అర్థం చేసుకోవడానికి స్పేస్ డొమైన్ అవేర్‌నెస్ కంపెనీగా ఎదిగింది. దిగంతరకు సంబంధించిన ఐడియా కాలేజీ రోజుల్లోనే అనిరుధ్ శర్మ, రాహుల్ రావత్‌లకు వచ్చింది. బెంగళూరులో శాటిలైట్ క్లబ్ నిర్వహిస్తున్న తన్వీర్ అహ్మద్‌తో కలిసి 'దిగంతర' కలను సాకారం చేసుకున్నారు.

విమానయానం, సముద్ర నావిగేషన్‌కు సంబంధించి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సంస్థలు, నియమాలు ఉన్నాయి. అంతరిక్షానికి సంబంధించి అలాంటివి లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'స్పేస్ డొమైన్ అవేర్‌నెస్'కు ప్రాధాన్యత ఇస్తోంది దిగంతర. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తోంది. స్పేస్ డొమైన్ అవేర్‌నెస్ వల్ల అంతరిక్షంలో ఏం జరుగుతుందో అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. స్పేస్-మ్యాప్ (స్పేస్ మిషన్ ఎష్యూరెన్స్ ప్లాట్‌ఫామ్), స్టార్స్(స్పేస్ థ్రెట్ అసెస్‌మెంట్ అండ్ రెస్పాన్స్ సూట్) అనే రెండు సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేసింది కంపెనీ. అంతరిక్ష ఆధారిత సెన్సర్లు, గ్రౌండ్ ఆధారిత టెలిస్కోపిక్ అబ్జర్వేటరీల కాంబినేషన్‌ను ఉపయోగిస్తోంది దిగంతర. ఈ అబ్జర్‌వేటరీలలో మొదటిది లద్దాఖ్‌లో రానుంది. సెన్సర్‌ల నుంచి తీసుకున్న డెటా, వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, ఇతరత్రా సంస్థల నుంచి సేకరించిన డేటాతో తన సొంత లైబ్రరీలను ఏర్పాటు చేసే పనిలో ఉంది. ఈ లైబ్రరీలను ఉపయోగించి విశ్లేషణలు అందించే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది.

'దిగంతర'కు 'సింగపూర్ స్పేస్ అండ్ టెక్నాలజీ'లాంటి అంతర్జాతీయ కస్టమర్‌లు ఉన్నారు. మైత్రి(మిషన్ ఫర్ ఆస్ట్రేలియా-ఇండియా టెక్నాలజీ, రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్)లో భాగంగా ఆప్టికల్ సెన్సర్‌ల సప్లైకు సంబంధించి ఆస్ట్రేలియాకు చెందిన స్పేస్ మెషిన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. స్పేస్ ఆపరేషన్స్, సిచ్యుయేషనల్ అవేర్‌నెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీతో దూసుకుపోతున్న 'దిగంతర' అంతరిక్షానికి సంబంధించి అంతర్జాతీయ కంపెనీగా ఎదిగింది. 'వర్క్ హార్డ్ డ్రీమ్ బిగ్' అనేది ముగ్గురు మిత్రులకు ఇష్టమైన మాట. ఆ మాటకు అర్థం ఏమిటో 'దిగంతర' విజయం చెప్పకనే చెబుతోంది.

● మ్యూజిక్ వరల్డ్



మధురానురాగ రాయల్

న్యూ రిలీజ్ 'అస్సీ సజ్నా'తో ప్రేక్షకులకు హాయ్ చెప్పింది సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్ జస్లీన్ రాయల్. 2009లో 'ఇండియాస్ గాట్ టాలెంట్' షోలో ఒకే సమయంలో ఎన్నో ఇన్‌స్ట్రుమెంట్‌లు ప్లే చేసి వావ్ అనిపించింది. ఇండీ ఆర్టిస్ట్‌గా ప్రయాణం ప్రారంభించిన రాయల్ బాలీవుడ్‌లోనూ తన టాలెంట్ నిరూపించుకుంది. 'నేనొక మ్యూజిక్ కంపోజర్‌ని. విత్ అవుట్ ఎనీ ట్రెనింగ్' అంటుంది రాయల్. సంగీతంలో శిక్షణ తీసుకోనప్పటికీ ఆత్మన్యూనతకు మాత్రం ఎప్పుడూ లోనుకాలేదు. 'యస్. నేను చేయగలను' అంటూ స్వర విహారం చేస్తుంది. 'ఐయామ్ బ్యాక్ టూ ది బేసిక్స్' అంటూ తన ప్రయాణాన్ని పునఃసమీక్షించుకుంటుంది రాయల్. పాట హిట్ అయితే కాసేపు సంతోషించి ఆ సక్సెస్‌తో డిస్‌కనెక్ట్ అయ్యి 'నెక్స్ట్ ప్రాజెక్ట్'లోకి జంప్ చేయడం రాయల్ అనుసరిస్తున్న విధానం. 'ప్రతి పాట నాకు ఎంతో ఇచ్చింది' అంటున్న రాయల్ తన తాజా పాట 'అస్సీ సజ్నా' గురించి ఏంచెబుతుంది? ఆమె మాటల్లోనే చెప్పాలంటే... జీవితంతో ప్రేమలో పడేలా చేసే సాంగ్. జీవనోత్సాహాన్ని వెలిగించే సాంగ్. జీవితంలోని ఆనంద క్షణాలు గుర్తు తెచ్చుకొని ఆస్వాదించేలా చేసే సాంగ్. 'బాధ నుంచి బయటపడేలా చేసే పాట' అంటుంది రాయల్. పెళ్లి పాటల్లో తనదైన పేరు తెచ్చుకున్న రాయల్‌ను 'పెళ్లి పాటల మహారాణి' అని పిలుస్తారు అభిమానులు.

మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ గురించి రాయల్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి. వాటిని ఎలా ప్లే చేయాలో నేర్చుకునేది. ఎప్పుడైనా మెలోడి తన బుర్రలోకి వస్తే....అది ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంట్ మీద తీయగా పలికేది. బాలీవుడ్‌లో బంధువులు లేరు. గాడ్ ఫాదర్ లేరు. కేవలం తన మీద నమ్మకంతో పంజాబ్‌లోని లుధియానా నుంచి ముంబైకి వచ్చి సింగర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది జస్లీన్ రాయల్.

● ఏఐ ఏరియా



వీలైనన్ని చోట్ల ఏఐ ఫీచర్‌లను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది గూగుల్. గూగుల్ జెమిని యాప్స్, మోడల్స్‌లో ఇది ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటిలో కొన్ని....

హెల్ప్ మీ రైట్: రాసేటప్పుడు కొన్నిచోట్ల ఏం రాయలో తెలియక స్టక్ అవుతుంటాం. ఇలాంటి సందర్భంలో రచన ముందుకు సాగడానికి ఉపయోగపడే ఫీచర్ ఇది. ఏఐ టెక్స్‌ను జెనరేట్ చేస్తుంది.

ఏఐ వాల్‌పేపర్ అండ్ బ్యాక్‌గ్రౌండ్స్: ఒక్క ప్రాంప్ట్ ఇస్తే చాలు కొత్త వాల్‌పేపర్, బ్యాక్స్‌గ్రౌండ్స్‌కు ఉపయోగపడే ఏఐ ఫీచర్ ఇది. ఉదా: ఏ క్యాబిన్ ఇన్ ది మిడిల్ ఆఫ్ ఏ పీస్‌ఫుల్ మెడో.

మ్యాజిక్ ఎడిటర్: గూగుల్ ఫొటోస్‌లోని మ్యాజిక్ ఎడిటర్ ఇప్పుడు క్రోమ్ బుక్‌లో కూడా అందుబాటులో ఉంది. చిత్రంలోని వ్యక్తులు, వస్తువులను మూవ్ చేయడానికి, పూర్తిగా తొలగించడానికి ఇది ఉపయోగపడుతుంది.

English Idioms

క్లియర్ ది డెక్స్

ఒక పని ప్రారంభించడానికి సన్నద్ధం అయ్యే విషయంలో, ముఖ్యమైన ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు చిన్న చిన్న పనులు పూర్తిచేసే సందర్భంలో వాడే మాట....క్లియర్ ది డెక్స్
ఉదా: వి నీడ్ టు క్లియర్ ది డెక్స్ అండ్ గెట్ అవర్ ప్రాజెక్ట్ డన్ ఆన్ టైమ్

ఇన్ లివ్ ఆఫ్

ఒకరి స్థానంలో మరొకరు, ఒక వస్తువుకు బదులుగా మరొకటి... రీప్లేస్‌మెంట్‌కు సంబంధించిన విషయాలలో వాడే మాట... ఇన్ లివ్ ఆఫ్.
ఉదా: వి మేడ్ ఏ డొనేషన్ టు చారిటీ ఇన్ లివ్ ఆఫ్ సెండింగ్ గిఫ్ట్స్ ఫర్ ది వెడ్డింగ్.
మూలం: ఇది 'లివ్ దె' అనే ఫ్రెంచ్ పదబంధం నుంచి వచ్చింది.
దీని అర్థం... ప్రదేశం. 15వ శతాబ్దంలో ఈ పదబంధం ఫ్రెంచ్ నుంచి ఇంగ్లీష్‌లోకి వచ్చింది.

● గేమింగ్

ఆ కొండకు చేరాలంటే కొండంత గుండె కావాలి



డార్కెస్ట్ డంజన్‌కు సీక్వెల్‌గా వస్తున్న డార్కెస్ట్ డంజన్ 2 ఈ నెల 15న విడుదల అవుతుంది. గత గేమ్స్‌లాగే తాజా గేమ్ కూడా రోగ్‌లైక్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్. తమవైన శక్తిసామర్థ్యాలతో ఉండే విభిన్నమైన క్యారెక్టర్లు దీనిలో ఉంటాయి. ఈ గేమ్ అంతిమ లక్ష్యం కొండకు చేరడం. కొన్ని శక్తులు ప్రపంచాన్ని ఆక్రమించడంలో కీలక పాత్ర పోషించిన కొండ ఇది. కొండను అన్వేషించే క్రమంలో ప్లేయర్‌కు రకరకాల అడ్డంకులు ఎదురవుతుంటాయి. ఈ టర్న్-బేస్డ్ గేమ్‌లో రాంగ్ స్పాట్‌లో ఉన్నప్పుడు ప్లేయర్ తన స్కిల్స్‌ను ఉపయోగించలేరు.

డెవపర్స్: రెడ్ హుక్ స్టూడియోస్ ఇంజిన్: యూనిటీ
ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: రోల్-ప్లేయింగ్, రోగ్‌లైక్ మోడ్ సింగిల్-ప్లేయర్

సినిమా

నా కల నెరవేరుతోంది

- శంకర్


● కియారా, రామ్‌చరణ్


● శంకర్

''తెలుగులో నేరుగా ఓ సినిమా తెరకెక్కించాలనే నా కల 'గేమ్ ఛేంజర్' సినిమాతో నెరవేరుతోంది''అంటున్నారు దర్శకుడు శంకర్. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'భారతీయుడు 2'. కమల్‌హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్థానీ 2' పేరుతో నేడు రోజు రిలీజ్ అవుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శంకర్ మాట్లాడుతూ... రామ్‌చరణ్ హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'గేమ్ ఛేంజర్' చిత్రం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''నేను తీసిన తమిళ సినిమాలకు తెలుగులో అపూర్వ ఆదరణ దక్కింది. తెలుగు ప్రేక్షకులు నా సినిమాలను బాగా ఆదరించారు. ఈ కారణంగా తెలుగులో నేరుగా ఓ సినిమా తెరకెక్కించాలని ఎప్పుడూ అనుకునే వాణ్ణి. ఆ మేరకు కొన్ని ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి. ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్' సినిమాతో నా కల నెరవేరుతోంది. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు ఇచ్చిన కథతో ఈ సినిమా తెరకెక్కించాను. ఇది పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం. నా దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' లాంటి మాస్ మూవీ వచ్చి చాలా కాలమైంది'' అని ఆ ఇంటర్వ్యూలో శంకర్ తెలిపారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'గేమ్ చేంజర్'లో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ప్యాలెస్‌లో ప్రారంభం

హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. వెంకటేశ్ హీరోగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందుతున్న 58వ చిత్రమిది. ఈ సినిమా రెగ్యులర్‌ను షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ఆరంభించారు మేకర్స్. ''హీరో, అతని భార్య... మాజీ ప్రేయసి... ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్‌ట్రార్డినరీ ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. ప్రస్తుతం ఓ ప్యాలెస్‌లో జరుగుతున్న షూటింగ్‌లో సినిమాలోని ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. ఈ మూవీ కోసం టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. 2025 సంక్రాంతి పండగకి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి.


● వెంకటేశ్

ప్రతి ముఖం ఓ కథ చెబుతుంది


● జాన్వీ కపూర్

ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) విభాగంలో ఆఫీసర్‌గా ఉద్యోగం చేసి ఓ కుట్రను గురించి కాన్ఫిడెన్షియల్ ఫైల్‌ను రెడీ చేశారు జాన్వీ కపూర్. మరి... ఈ ఫైల్‌లో ఉన్న వివరాలు ఏంటి? నిజమైన కుట్రదారులు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం 'ఉలజ్' సినిమాలో చూడాలి. ఈ సినిమాలోనే జాన్వీ కపూర్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా నటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీకి సుధాంశు సరియ దర్శకత్వం వహించారు. ముందు 'ఉలజ్'ను జూలై 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ రిలీజ్ కాలేదు. దీంతో ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త ఫొటోలను విడుదల చేసింది యూనిట్. ''ప్రతి ముఖం ఓ కథ చెబుతుంది. ప్రతి కథ ఓ ఉచ్చులాంటిదే'' అని ఈ సినిమాను ఉద్దేశించి పేర్కొన్నారు జాన్వీ కపూర్. ఇక తెలుగులో ఎన్టీఆర్ 'దేవర', రామ్‌చరణ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్), హిందీలో వరుణ్ ధావన్ 'సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి' చిత్రాల్లో హీరోయిన్‌గా చేస్తున్నారు జాన్వీ కపూర్.

ఇండియా ఫైల్స్‌లాంటి సినిమా అవసరం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


● అద్దంకి దయాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కీరవాణి, సుమన్, బొమ్మకు మురళి

''ప్రస్తుత సమాజానికి 'ఇండియా ఫైల్స్' లాంటి సినిమా చాలా అవసరం. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలే మూలాలుగా తెరకెక్కిన ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అద్దంకి దయాకర్ లీడ్ రోల్‌లో ఇంద్రజ, సుమన్, 'శుభలేఖ' సుధాకర్ ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'ఇండియా ఫైల్స్'. బొమ్మకు హిమమాల సమర్పణలో డా. బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఎంఎం కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ- ''అద్దంకి దయాకర్ నటన చూడలేదు. కానీ ఆయనకు ప్రతి సబ్జెక్ట్, సమస్యల పట్ల ఉన్న అవగాహన నాకు తెలుసు. దయాకర్ ఎప్పటికైనా పెద్ద నాయకుడు కావాలి'' అన్నారు. ''గద్దర్‌గారు పాడి, నటించిన పాటకి నేను సంగీతం అందించడం సంతోషంగా ఉంది'' అన్నారు ఎంఎం కీరవాణి. డా. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ- ''నటనంటే తెలియని నాకు 40 రోజులు శిక్షణ ఇచ్చి, మంచి కంటెంట్ ఉన్న సినిమాలో నటించే చాన్స్ కల్పించిన మురళిగారికి కృతజ్ఞతలు'' అన్నారు. ''ఈ సినిమా సమాజం గురించి చాలా విషయాలు నేర్పిస్తుంది... ఆలోచింపజేస్తుంది'' అన్నారు బొమ్మకు మురళి. గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కూతురు వెన్నెల, కొరియోగ్రాఫర్ సుచిత్రా చంద్రబోస్ మాట్లాడారు.

వారం ఆలస్యంగా తుఫాన్


● విజయ్ ఆంటోని

థియేటర్లలోకి తుఫాన్ రాక వారం ఆలస్యం కానుంది. విజయ్ ఆంటోని హీరోగా నటించిన తాజా చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మేఘా ఆకాశ్ హీరోయిన్‌గా నటించారు. కమల్ బోరా, డి. లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. అయితే వారం ఆలస్యంగా ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా కొత్త తేదీని ప్రకటించారు. ''పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'తుఫాన్' సినిమాని తెరకెక్కించారు విజయ్ మిల్టన్. తనని చిన్న చూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ దీవి నేపథ్యంలో ఈ కథ సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

డేట్ ఫిక్స్


● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

రాజ్ తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'తిరగబడర సామీ'. ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా నటించగా, హీరోయిన్ మన్నారా చోప్రా ఓ కీలక పాత్ర చేశారు. మల్కాపురం శివకుమార్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించింది. ''యువతను ఆకట్టుకునే ఫ్యామిలీ, రొమాన్స్ అంశాలతో పాటుగా సెంటిమెంట్, మాస్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. మన్నారా చోప్రా ఈ సినిమాలో ఓ డిఫరెంట్ రోల్ చేశారు. ఓ స్పెషల్ సాంగ్‌లోనూ కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నీ ప్రేమలో..!


● త్రిప్తి దిమ్రి

రణ్‌బీర్ కపూర్ 'యానిమల్'లో జోయా పాత్రలో గ్లామరస్‌గా నటించి బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ త్రిప్తి దిమ్రి. 'యానిమల్' సినిమా కూడా బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో ఈ బ్యూటీకి వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ఈ క్రమంలో రాజ్‌కుమార్ రావుతో 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో', కార్తీక్ ఆర్యన్‌తో 'భూల్ భూలయ్యా 3', సిద్ధాంత్ చతుర్వేదితో 'ధడక్ 2' సినిమాల్లో హీరోయిన్‌గా చాన్స్‌లు దక్కించుకున్నారు త్రిప్తి. ఈ బ్యూటీకి మరో హిందీ సినిమా ఆఫర్ దక్కిందని టాక్. 'రాంఝణా', 'అత్రంగి రే' చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కనుంది. ప్రేమకథ నేపథ్యంలో 'తేరే ఇష్క్ మే' (నీ ప్రేమలో) టైటిల్‌తో ఈ సినిమా చేయనున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ను అక్టోబరులో ప్రారంభించాలనుకుంటున్నారు. హీరోయిన్ పాత్రకు త్రిప్తి దిమ్రిని సంప్రదించారనే ప్రచారం బాలీవుడ్‌లో జరుగుతోంది. మరి... 'తేరే ఇష్క్ మే' అంటూ ధనుష్‌తో త్రిప్తి జోడీ కడతారా? అనేది త్వరలో తెలిసిపోతుంది.


నాది వన్ సైడ్ లవ్

- దర్శకుడు అశ్విన్ రామ్



''చిన్నప్పట్నుంచీ తెలుగు సినిమాలు చూసి ఎంజాయ్ చేస్తున్నాను. తమిళ దర్శకుడు అట్లీ తీసిన 'రాజా రాణి'కి దర్శకత్వ విభాగంలో చేశాను. దర్శకుడు మురుగదాస్ ప్రొడక్షన్‌లోని మూడు సినిమాల్లో భాగమయ్యాను. ధనుష్‌గారి సినిమాలకూ వర్క్ చేశాను. తమిళంలో ఓ సినిమాకు దర్శకత్వం వహించాను. తెలుగు సినిమాలపై నాది వన్ సైడ్ లవ్ (నవ్వుతూ). ఇప్పుడు తెలుగులో 'డార్లింగ్' చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు అశ్విన్ రామ్. ప్రియదర్శి, నభా నటేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డార్లింగ్'. కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా అశ్విన్ రామ్ మాట్లాడుతూ- ''భార్యాభర్తల అనుబంధం నేపథ్యంలో సాగే సినిమా 'డార్లింగ్'. ఈ అనుబంధం నేపథ్యంలో కొన్ని సినిమాలు వచ్చాయి. కానీ మా 'డార్లింగ్' కొత్తగా ఉంటుంది. ఇప్పటివరకూ మా సినిమాను చూసిన నలభైమంది ఈ కొత్తదనాన్నే ఫీలయ్యారు. ఈ సినిమా ట్రైలర్ చూసి నభా పాత్రలో స్ప్లిట్ పర్సనాలిటీ ఉంది కాబట్టి కొందరు 'అపరిచితుడు'తో పోల్చుతున్నారు. 'డార్లింగ్', 'అపరిచితుడు' సినిమాల మధ్య ఉన్న కామన్ పాయింట్ స్ప్లిట్ పర్సనాలిటీ మాత్రమే'' అన్నారు.

శుక్రవారం 12-7-2024


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 111

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జాస్మిన్ జయహో

వింబుల్డన్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి. రేపు క్రిచికోవాతో టైటిల్ పోరు - 15లో



టీసీఎస్ బోణీ భేష్

తొలి త్రైమాసికంలో రూ. 12,040 కోట్ల నికర లాభం - 15లో

న్యూస్‌రీల్

స్తంభించిన రిజిస్ట్రేషన్లు



రాష్ట్రవ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ఈకేవైసీలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. రాత్రికల్లా సమస్యను సరిదిద్దడంతో శుక్రవారం నుంచి యథావిధిగా రిజిస్ట్రేషన్లు కొనసాగనున్నాయి.

- వివరాలు 3లో

మీ వల్లే నా రాక మరింత ఆలస్యం



పోలీసులు మీడియాకు లీకులు ఇవ్వడం వల్ల తన ఆరోగ్యం క్షీణించిందని అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడైన ఎస్‌ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆరోపించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు అధికారికి లేఖ రాశారు.

- వివరాలు 3లో

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ సిటీ ఎమ్మెల్యేలు




హైదరాబాద్ నగర పరిధిలోని ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి) శుక్రవారం సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

- వివరాలు 2లో



నిరుద్యోగులకు సర్కారీ 'పరీక్ష'!

డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల తేదీలపై నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆందోళన

- వచ్చే వారం నుంచే ఉపాధ్యాయ నియామక పరీక్షలు..
- అవి ముగుస్తున్న సమయంలోనే గ్రూప్-2 పరీక్షలు
- చాలా మంది నిరుద్యోగులు రెండింటికీ పోటీ పడుతున్నవారే..
- పైగా దరఖాస్తుల ప్రక్రియ ముగిశాక నెలరోజుల్లోపే డీఎస్సీ పరీక్ష
- ప్రిపరేషన్‌కు సమయం లేదంటూ అభ్యర్థుల ఆందోళన
- కనీసం రెండు, మూడు నెలలు సమయం ఇవ్వాలనే డిమాండ్లు
- డీఎస్సీ వాయిదా వేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళనలు
- వెబ్‌సైట్లో డీఎస్సీ హాల్‌టికెట్లు
- కొంత సమయం ఇస్తే బాగుండేది: ప్రొఫెసర్ కోదండరాం

వారం రోజుల్లో మొదలుకానున్న డీఎస్సీ పరీక్షలు.. అవి ముగిశాక రెండు రోజుల్లోనే గ్రూప్-2 పరీక్షలు.. ప్రిపరేషన్‌కు సమయం సరిపోని పరిస్థితి.. దీంతో డీఎస్సీ పరీక్షల తేదీలను మార్చాలంటూ అభ్యర్థుల ఆందోళనలు.. ఏమాత్రం వెనక్కితగ్గకుండా పరీక్షల నిర్వహణకే మొగ్గుచూపుతున్న సర్కారు.. ఆందోళనలు చేస్తున్న అభ్యర్థులు, విద్యార్థి సంఘాలపై పోలీసుల లాఠీచార్జీలు.. కాస్త సమయం ఇస్తే బాగుంటుందంటున్న విద్యావేత్తలు.. సమస్యకు పరిష్కారం చూపడం మానేసి లాఠీచార్జీలు ఏమిటంటూ హక్కుల కార్యకర్తల నిలదీతలు..

.. రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో ఆందోళన, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో నెలకొన్న పరిస్థితి ఇది. సర్కారు ఉద్యోగాల భర్తీ హర్షణీయమే అయినా.. నిరుద్యోగుల డిమాండ్లు, విజ్ఞప్తుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్న సూచనలు వస్తున్నాయి.

సిలబస్ ఎక్కువ.. సమయం తక్కువ

టీచర్ ఉద్యోగాలకు సంబంధించి సిలబస్ బాగా పెరిగింది. మొత్తం 14 సబ్జెక్టులు చదవాలి. కానీ సమయం మాత్రం తక్కువగా ఉంది. రోజుకో సబ్జెక్ట్ పూర్తి చేయడం ఎలా? ఇది ఆందోళన రేపుతోంది. పరీక్ష గడువును కనీసం మూడు నెలలు పొడిగించాలి.

– ఐ.సుజిత, డీఎస్సీ అభ్యర్థి, సూర్యాపేట జిల్లా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్షల (డీఎస్సీ)కు సమయం ముంచుకొస్తోంది. ఈ నెల 18వ తేదీ నుంచి సబ్జెక్టుల వారీగా పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించనున్న ప్రభుత్వం.. ఆ దిశగా ఆన్‌లైన్ కేంద్రాలను సైతం ఎంగేజ్ చేసుకుంది. డీఎస్సీ పరీక్షలు ఆగస్టు 5వ తేదీతో పూర్తికానుండగా.. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. వరుసగా పరీక్షలు ఉండటంతో అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుందనే వాదన వస్తోంది.

సమయం తక్కువగా ఉండటంతో..

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం ఈ ఏడాది మార్చిలో నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తుల స్వీకరణ మిగతా 2వ పేజీలో ▶



గురువారం ఉన్నతాధికారులతో సమావేశమైన మండలి చైర్మన్ గుత్తా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

మాకు ఆ గౌరవం ఏదీ?

ప్రొటోకాల్‌పై మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ ఆవేదన

అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై అధికారులతో భేటీలో వ్యాఖ్యలు

- జిల్లాల్లో ప్రొటోకాల్ పాటించట్లేదు
- అభివృద్ధి కార్యక్రమాలకు ఆహ్వానాలూ లేవు
- ఎయిర్‌పోర్టులో వీఐపీ లాంజ్‌లోకి రానివ్వడం లేదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తాము అత్యున్నత రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నా అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల పర్యటనకు వెళ్తున్న సందర్భాల్లో ప్రొటోకాల్ నిబంధనల మేరకు తమను గౌరవించడం లేదన్నారు. శాసన సభ ప్రాంగణంలో మండలి చైర్మన్ గుత్తా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నతాధికారులతో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రొటోకాల్ అంశంలో తాము ఎదుర్కొంటున్న సమస్యల జాబితాను వివరించారు. అనంతరం డీజీపీ జితేందర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతోనూ చైర్మన్, స్పీకర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ భేటీలో ప్రొటోకాల్ అంశంపై వీరిద్దరు ఉన్నతాధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో జరిగిన భేటీలో పలు అంశాలను ప్రస్తావించారు. తమను గౌరవించాల్సిన తీరుపై కిందిస్థాయి అధికారులకు అర్థమయ్యే రీతిలో సందేశాలు, సంకేతాలివ్వాలని గుత్తా, గడ్డం ప్రసాద్ చెప్పారు.

చైర్మన్, స్పీకర్ అభ్యంతరాలు ఇవే..

తాము జిల్లా పర్యటనకు వెళ్లిన సమయంలో కనీసం ఆర్డీఓ లేదా తహసీల్దార్ స్థాయి అధికారులు మిగతా 3వ పేజీలో ▶

ఆదాయం పెంచాల్సిందే

ఖజానా నింపేందుకు సంస్కరణలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- జూన్ వరకు వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదు
- పన్నుల వసూళ్లపై నిక్కచ్చిగా వ్యవహరించండి
- ఆయా శాఖలు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలి
- విమాన ఇంధనంపై పన్నును సవరించే అంశాన్ని పరిశీలించండి
- ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తానన్న ముఖ్యమంత్రి
- ఆదాయం తెచ్చే ప్రధాన శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు వీలైనన్ని సంస్కరణలు తీసుకుని రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రతిపాదించిన మేరకు ఆదాయం రావాలంటే ఆయా శాఖలు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖల ఉన్నతాధికారులతో సీఎం దాదాపు మిగతా 2వ పేజీలో ▶

కత్తిదూసిన ఉన్మాదం

వేటకొడవలితో నరికి దంపతుల దారుణహత్య

- మనస్పర్థలతో వేరుపడిన ప్రేమజంట... అప్పట్నుంచి యువతి కుటుంబంపై కక్ష పెంచుకున్న యువకుడు
- ఆమె తల్లిదండ్రులను హతమార్చిన వైనం
- యువతికి, ఆమె సోదరుడికి తీవ్రగాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు

5లో



నిందితుడు మేకల నాగరాజు (ఫైల్)

మాజీ అగ్నివీర్‌లకు పారామిలటరీలో 10% రిజర్వేషన్

సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌ల ప్రకటన

- వివరాలు 6లో

ఎవరు సన్నాసో వాళ్లే చెప్పాలి

రాహుల్, రేవంత్‌లను ఉద్దేశించి మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్య



- అధికారం కోసం విద్యార్థులను వాడుకున్నదే కాంగ్రెస్
- దాడులు చేస్తున్న పోలీసుల పేర్లు డైరీలో రాస్తున్నాం
- నిరుద్యోగులకు రాజకీయాలు అంటగడుతున్నారని విమర్శ

3లో

గత ప్రభుత్వం కంటే ఇప్పుడే ఎక్కువ అవినీతి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



- చీకటి ఒప్పందాలతో కావాల్సిన కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారు
- రహస్య జీవోలతో సర్కారు నడుస్తోంది
- సీఎం తమ్ముడు, బావమరిది భాగస్వామ్యంతో ఉన్న కంపెనీలకు కాంట్రాక్టులు
- ఈ అవినీతిపై ఈడీ, సీబీఐ విచారణ కోరతామని వెల్లడి

- వివరాలు 2లో

ఇదంతేనట



నీకే చెప్పేది! ఆ పేపర్‌ని బయటకెళ్లి చదువుకోవయ్యా!!

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు!

అందుకే మన సీట్లు తగ్గాయి... చేరికలు కూడా కలసి రాలేదు

- ఇతర పార్టీల నేతలను అభ్యర్థులుగా దింపడమూ ఫలించలేదు
- కురియన్ కమిటీకి వెల్లడించిన కాంగ్రెస్ ఎంపీలు, ఓడిపోయిన అభ్యర్థులు
- బీజేపీపై బీఆర్‌ఎస్‌కు కోపం ఉండాలి కదా అని ప్రశ్నించిన కురియన్
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత సమీకరణాలు మారాయని చెప్పిన పార్టీ నేతలు
- నేడు కూడా కొనసాగనున్న పోస్టుమార్టం



గురువారం రాత్రి పీజే కురియన్, రకీబుల్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కు కావడం వల్లనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన మేర సీట్లు రాలేదని ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన, ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. కొన్ని స్థానాల్లో మాత్రం ఎమ్మెల్యేల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని, ఇతర పార్టీల నుంచి చేరికలు కూడా కలసి రాలేదని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పని తీరుపై పోస్టుమార్టం నిర్వహించేందుకు హైకమాండ్ పంపిన కురియన్ కమిటీకి తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్‌తో పాటు అస్సాం ఎమ్మెల్యే రకీబుల్ హుస్సేన్ గురువారం గాంధీభవన్‌కు వచ్చారు. మూడు రోజుల షెడ్యూల్‌లో భాగంగా తొలి రోజు ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు, ఓడిపోయిన అభ్యర్థులతో వీరిరువురూ భేటీ అయ్యారు. 17 మంది అభ్యర్థులకుగాను 16 మంది మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యర్థులను వేధిస్తున్నారు

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



సాక్షి, హైదరాబాద్: పోలీసులను అడ్డుపెట్టుకుని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యర్థులను వేధిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడిపై ఓ మహిళ ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, పోలీసులు కేసులు నమోదు చేయడం లేదంటూ గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ధర్నాలు చేసిన మంత్రి శ్రీధర్‌బాబు.. ప్రస్తుతం ప్రత్యర్థుల మీద రౌడీషీట్‌లు తెరిపించేందుకు సమయాన్ని వెచ్చిస్తున్నారని ఆరోపించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులపై గతంలో శ్రీధర్‌బాబు రౌడీషీట్ తెరిపించారని, ఎమ్మెల్యే సోదరుడికి మాత్రం పోలీ సులు రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఫిర్యాదులను పోలీసులు తీసుకోవడం లేదన్నారు. కోమలత అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు స్పందించకుంటే కోరును ఆశ్రయిస్తామన్నారు.

ఓటమిని సమీక్షించుకోండి

- బీఆర్‌ఎస్ నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు హితవు



సాక్షి హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి ఏడు నెలలైనా ఆ పార్టీ పెద్దలు ఇప్పటికీ భ్రమల్లో విహరిస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల భంగపాటు తర్వాతనైనా ఎక్కడ లోపం జరిగిందో సమీ క్షించుకోకుండా తమ ప్రభు త్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తామని, అంతేకాని నిస్పృహతో ప్రకటనలు ఇస్తూ.. గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన గురువారం ఒక ప్రకటనలో బీఆర్‌ఎస్‌కు సలహా ఇచ్చారు. రాజకీయ పార్టీల గెలుపు, ఓటములను ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు.

కల్వకుంట్ల కుటుంబ అవినీతిపై విచారణ జరపాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్




స్టేషన్‌ఘన్‌పూర్: కల్వకుంట్ల కుటుంబం అవినీతిపై విచారణ జరపాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌కుమార్ తమ ఆస్తుల వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతలు అవినీతి, కుటుంబ పాలన, అహంకారంతోనే ఓటమి పాలయ్యారన్నారు. రాజకీయ వలసల గురించి మాట్లాడే నైతిక హక్కు కల్వకుంట్ల కుటుంబానికి, బీఆర్ఎస్ నేతలకు ఏమాత్రం లేదని అన్నారు.

ఇంధన సర్దు'బాదుడు'కు బ్రేక్!

- ఎఫ్ఎస్‌పీ చార్జీలు లెక్కించి ముందుగా పత్రికల్లో యాడ్స్ ఇవ్వడంలో డిస్కంల విఫలం
- డిస్కంల వెబ్‌సైట్‌లో సైతం పొందుపరచని వైనం
- దీంతో డిస్కంల పిటిషన్లకు విచారణ అర్హత లేదని తోసిపుచ్చిన ఈఆర్సీ
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎఫ్ఎస్‌పీల వసూళ్లకు అనుమతి కోరడం ఇదే తొలిసారి

4 త్రైమాసికాల ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూళ్లకు అనుమతి కోరిన డిస్కంలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్ఎస్‌ఏ) వసూలు చేసేందుకు ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు(టీజీఎన్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్) చేసిన విజ్ఞప్తిని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) తోసిపుచ్చింది. ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూళ్లకు అనుమతిస్తూ 2023 జనవరి 18న ఈఆర్సీ జారీ చేసిన మూడో సవరణ నిబంధనలు-2023ను డిస్కంలు అమలుపరచకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. 2023- 2024 ఆర్థిక సంవత్సరంలోని నాలుగు త్రైమాసికాలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూళ్లకు అనుమతి కోరుతూ డిస్కంలు దాఖలు చేసిన పటిషన్లకు విచారణ అర్హత లేదని తిరస్కరిస్తూ బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఏప్రిల్-జూన్, 2023 జూలై-సెప్టెంబర్, 2023 అక్టోబర్-డిసెంబర్, 2024 జనవరి-మార్చి త్రైమాసికాలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీలు వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు రెండు డిస్కంలు చెరో నాలుగు పిటిషన్లు దాఖలు చేయగా, అన్నింటినీ ఈఆర్సీ కొట్టి వేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్ వినియోగదారుల నుంచి ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూళ్లకు డిస్కంలు అనుమతి కోరడం ఇదే తొలిసారి.

ఎందుకు తిరస్కరించిందంటే..?

నిబంధనల ప్రకారం.. N నెలకు సంబంధించిన ఇంధన సర్దుబాటు చార్జీలను N+2 వ నెలకు సంబంధించిన బిల్లుతో కలిసి N+3వ నెలలో డిస్కంలు జారీ చేయాలి. N+2 నెల 15వ తేదీలోగా ఎఫ్ఎస్‌పీ చార్జీల వివరాలను డిస్కంలు తమ వైబ్‌సైట్‌లో ప్రకటించాలి. ఉదాహరణకు జనవరి నెల ఇంధన సర్దుబాటు చార్జీలను డిస్కంలు ఆ తర్వాతి మార్చి నెల బిల్లుతో కలిపి ఏప్రిల్ నెలలో వినియోగదారులపై విధించాల్సి ఉంటుంది. డిస్కంలు ఒక నెలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీలను లెక్కించి సంబంధిత నెల ముగిశాక 45 రోజుల్లోగా దిన పత్రికల్లో యాడ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. 45 రోజులు దాటితే ఆ నెలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీలను అనుమతించరు. విద్యుత్ బిల్లుల్లో ఎఫ్ఎస్‌పీ చార్జీలను ప్రత్యేకంగా చూపించడంతోపాటు వసూలైన ఎఫ్ఎస్‌పీ చార్జీలను ప్రత్యేక ఖాతా కింద నమోదు చేయాలి. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 60 రోజుల్లోగా ఆ త్రైమాసికంలోని నెలలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీల వివరాలను ఈఆర్సీకి అందజేయాలి. డిస్కంలు విధించిన ఎఫ్ఎస్‌పీ చార్జీలను ఈఆర్సీ క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదిస్తుంది. యూనిట్ విద్యుత్‌కు గరిష్ఠంగా 30పైసల వరకు ఎఫ్ఎస్‌పీ చార్జీలను ఈఆర్సీ ముందస్తు అనుమతి లేకుండా డిస్కంలు విధించవచ్చు. ఒకవేళ ఎఫ్ఎస్‌పీ చార్జీలు యూనిట్‌కి 30పైసలకు మించితే ముందస్తు అనుమతి లేకుండా ఆపైన ఉండే అదనపు చార్జీలు విధించడానికి వీలులేదు. 30 పైసల సీలింగ్‌కు మించి ఎఫ్ఎస్‌పీ చార్జీలు వసూలు చేయాల్సి వస్తే ఈఆర్సీ నుంచి ముందస్తు అనుమతి పొందాలి. ఈ నిబంధనలను పాటించకపోవడంతో ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూలు చేసేందుకు ఉత్తర/దక్షిణ తెలంగాణ డిస్కంలు చేసిన విజ్ఞప్తిని ఈఆర్సీ తాజాగా తిరస్కరించింది.

కేంద్రం నిబంధనల ఆధారంగా

ఇంధన/ విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు చార్జీల భారాన్ని ఆటోమెటిక్‌గా విద్యుత్ బిల్లుల్లో బదిలీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021 అక్టోబర్ 22న ఎలక్ట్రిసిటీ (టైమ్లీ రికవరీ ఆఫ్ కాస్ట్ డ్యూ టు చేంజ్ ఇన్‌లా) రూల్స్ 2021ను అమల్లోకి తెచ్చింది. బొగ్గు, ఇతర ఇంధనాల ధరల పెరుగుదలతో విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా ఎక్కువ కావడంతో ఎప్పటికప్పుడు వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో వసూలు చేసేందుకు కేంద్రం ఈ నిబంధనలు తీసుకొచ్చింది. దీని ఆధారంగానే గతేడాది ఈఆర్సీ ఎఫ్ఎస్‌పీ చార్జీల వసూళ్లకు అనుమతిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది.

గత ప్రభుత్వంకంటే ఇప్పుడే ఎక్కువ అవినీతి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- చీకటి ఒప్పందాలతో కావాల్సిన కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారు
- రహస్య జీవోలతో సర్కారు నడుస్తోంది
- సీఎం తమ్ముడు, బావమరిది భాగస్వామ్యంతో ఉన్న కంపెనీలకు కాంట్రాక్టులు .. ఈ అవినీతిపై ఈడీ, సీబీఐ విచారణ కోరుతాం



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఎక్కువ అవినీతి, చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా చీకటి ఒప్పందాలతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. రహస్య జీవోలతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఓ బడా కాంట్రాక్టర్‌కు రూ.1,100 కోట్ల కాంట్రాక్ట్ పనులు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర పథకం అమృత్ స్కీమ్‌లో కూడా రూ.3 వేల కోట్ల మేర కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడ్డారని అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా హాలులో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ కుంభకోణంలో ఉన్న రేవంత్ బావమరిదికి చెందిన ఓ కంపెనీకి రూ.400 వందల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చారని తెలిపారు. ఆయా పనులను 30 నుంచి 35 శాతం తక్కువకు చేసేందుకు ఇతర కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నా ఇష్టారీతిన అంచనాలు పెంచి, కావాల్సిన వారికి కాంట్రాక్ట్‌లు ఇచ్చారని విమర్శించారు. ఇటీవల వివిధ పనుల్లో రూ.1,200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి తమ్ముడు, బావమరిది భాగస్వామ్యంతో ఉన్న కంపెనీలకు కాంట్రాక్టులు ధారాదత్తం చేస్తున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై తాను చేస్తున్న ఆరోపణలపై విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. అలాగే కరీంనగర్‌లో వివిధ కాంట్రాక్టలలో సీఎం తమ్ముడు భాగస్వామిగా ఉన్నట్టు చెబుతున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో త్వరలో పిలిచే టెండర్లలో కూడా ఓ బడా కంపెనీకి పెద్ద పీట వేయబోతున్నారన్నారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతి వ్యవహారాలపై ఈడీ, సీబీఐ విచారణ కోరతామని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆరోగ్యశ్రీ ప్యాకేజీ ధరల సవరణ

వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దాదాపు 14 ఏళ్ల తర్వాత ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో అందిస్తున్న చికిత్సల ప్యాకేజీ ధరలను సవరిస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో మంత్రి గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ బకాయిలు త్వరగా విడుదల చేయాలని కార్పొరేట్ ఆస్పత్రుల యజమానులు, ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను సమర్థంగా అమలు చేయటానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులకు తమవంతు సహకారం అందించాల్సిందిగా మంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని మెడికల్ టూరిజం హబ్‌గా రూపొందించడానికి కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఆస్పత్రుల యాజమాన్యా లు చేసిన పలు విజ్ఞప్తులపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రభు త్వ ప్రాధాన్యతలను వివరించారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యం పేరుతో వ్యాపారాలు చేయడాన్ని మంత్రి ఆక్షేపించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో నాణ్యత ప్రమాణాలు పెంచటానికి, విశ్వసనీయత, పారదర్శకత, జవాబుదారితనంతో కూడిన సేవలు ప్రజలకు అందించడానికి వేర్వేరుగా కమిటీలు నియమిస్తామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు జనాభా ప్రతిపాదికన ఆస్పత్రులకు అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో అపోలో, కిమ్స్, యశోద, కాంటినెంటల్, మెడికోవర్ ఆస్పత్రుల యజమానులు, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

నాలుగు గంటలపాటు సమీక్షించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరగాలని, పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను రూపొందించుకుని, ఆ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆదాయం వచ్చే వనరులపై, పన్నుల వసూళ్లపై అధికారులు నిక్కచ్చిగా ఉండాలని స్పష్టంచేశారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్ వ్యవస్థీకరించుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

జీఎస్టీ రాబడిపై దృష్టి పెట్టండి

నిర్దేశించిన వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకానెల లక్ష్యాలను నిర్దేశించుకొని రాబడి సాధించాలన్నారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్షిస్తానని, అలాగే, ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. ప్రధానంగా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీని పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం చెప్పారు. వాణిజ్య పన్నుల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా విమాన ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

మద్యం ఆదాయం ఎందుకు పెరగలేదు?

ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణమేంటని సీఎం రేవంత్ ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని ఈ సందర్భంగా చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా అన్న అంశంపై అధ్యయనం చేయాలని సీఎం నిర్దేశించారు.

రియల్ ఎస్టేట్‌కు అనుకూలం

రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతోపాటు ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. ఈ ఆరు నెలల్లో వాణిజ్య నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే మాదిరి పుంజుకుంటాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను అరికట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.

కేసీఆర్, రేవంత్ కుమ్మక్కయ్యే ఫిరాయింపులకు ప్రోత్సాహం

- బీజేపీ నేత చింతల ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై ఫిరాయింపులకు పాల్పడుతున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఫిరాయింపులను తప్పుపట్టిన రేవంత్, అధికారంలోకి వచ్చాక ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న ప్రేమ నిరుద్యోగులపై లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణతో పాటు కాళేశ్వరం, మిషన్ భగీరథలలోజరిగిన అవినీతిపై విచారణ ఏమైందని ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఆయా అంశాలపై ఏర్పాటు చేసిన కమిషన్ల విచారణ నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు.

డీఎస్సీ వాయిదా డిమాండ్‌తో 13న చలో ఢిల్లీ

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ పరీక్ష వాయిదా కోసం ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నామని.. ఈ నెల 13న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ గురువారం ప్రకటించారు. 15 రోజులుగా రాష్ట్రంలో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్ తీరు ఏఐసీసీ పెద్దలకు తెలిసేలా 'నిరుద్యోగి బచావో.. రేవంత్‌రెడ్డి హటావో' పేరిట కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ సిటీ ఎమ్మెల్యేలు

- నేడు సీఎం రేవంత్ సమక్షంలో చేరనున్న ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ
- ఈ నెల 7న హైదరాబాద్‌లో చంద్రబాబును కలసిన ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు
- పలువురు మున్సిపల్ చైర్మన్లు కూడా హస్తం పార్టీలోకి..



ప్రకాశ్‌గౌడ్



అరికపూడి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. హైదరాబాద్ నగర పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి) శుక్రవారం సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వారితోపాటు కొందరు మున్సిపల్ చైర్మన్లు కూడా తమ పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా.. ఈ ఇద్దరి చేరిక పూర్తయితే ఆ సంఖ్య తొమ్మిదికి చేరనుంది.

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన తర్వాతే..

ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ ఇద్దరూ 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచి.. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ బీఆర్ ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా ఎన్నిక య్యారు. నిజానికి ఈ ఇద్దరు నేతలు కూడా టీడీపీలో కొన సాగినకాలంలో ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇక్కడ టీడీపీ ఉనికి కోల్పోవడంతో బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు ఇటీవల ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తాజాగా హైదరాబాద్‌కు వచ్చారు. ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ ఈ నెల ఏడున చంద్రబాబుతో భేటీ అయి చర్చించారు. తర్వాత వారం రోజుల లోపలే వారిద్దరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ఆదేశాల మేరకే వారు కాంగ్రెస్ గూటికి చేరుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు!

▶ మొదటి పేజీ తరువాయి



పార్టీనేతలతో సమావేశమైన కురియన్

హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న కారణంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కమిటీ ముందుకు రాలేదు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, టీజీ ఫుడ్స్ చైర్మన్ ఫహీం, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ తదితరులు కూడా కురియన్ కమిటీని మర్యాదపూర్వకంగా కలిశారు.

మొత్తం సీన్ మారిపోయింది...

తొలి రోజు షెడ్యూల్‌లో భాగంగా ఉదయమే గాంధీ భవన్‌లో కురియన్ కమిటీ ఎంపీ అభ్యర్థులతో సమావేశమైంది. ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లురవి, రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురామిరెడ్డి, ఓడిపోయిన అభ్యర్థులు ఆత్రం సుగుణ, దానం నాగేందర్, సమీవుల్లా, సునీతా మహేందర్‌రెడ్డి, గడ్డం రంజిత్ రెడ్డి, వెల్చాల రాజేందర్‌రావు, చల్లా వంశీచంద రెడ్డి, నీలం మధు, జీవన్‌రెడ్డిలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా జరిగిందని, కానీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగా జరిగిందని వెల్లడించినట్టు తెలిసింది. 'అసెంబ్లీ ఎన్నికల సమీకరణలు లోక్‌సభ ఎన్నికల్లో లేవు. పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. బీఆర్ఎస్ బాహాటంగానే బీజేపీకి మద్దతిచ్చింది. తాము గెలవకపోయినా కాంగ్రెస్ గెలవొద్దని, బీజేపీని గెలిపించడం ద్వారా తమ రాజకీయ ప్రయోజనాలను రక్షించుకోవాలనేది బీఆర్ఎస్ ఉద్దేశం'అని వెల్లడించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న కురియన్ బీజేపీ అంటే బీఆర్ఎస్‌కు కోపం ఉండాలి కదా... ఓట్లు వేసి సహకరించుకునే సాన్నిహిత్యం ఆ రెండు పార్టీల మధ్య ఉందా అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని మొదటి నుంచీ తెలంగాణ ప్రజల్లో అభిప్రాయం ఉండేదని, రాజకీయ క్షేత్రంలో బీఆర్ఎస్, బీజేపీల మధ్య వైరుధ్యం అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కొంత ఉండేదని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత మాత్రం మారిపోయిందని చెప్పారు. కేసుల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్ నేతలు బీజేపీకి సహకరించారని వెల్లడించారు.

ఎమ్మెల్యేలు సహకరించలేదు...

కొందరు ఓడిపోయిన అభ్యర్థులు మాత్రం తమకు ఎన్నికల్లో సహకరించని ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల పేర్లను కూడా కురియన్ కమిటీకి చెప్పారని తెలుస్తోంది. మహబూబ్‌నగర్‌లో చాలా స్వల్ప తేడాతో ఓడిపోయామని, అక్కడ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన డి.కె.అరుణ కాంగ్రెస్ నుంచి ఎదిగారని, దీంతో చాలా స్వల్పంగా అయినా కాంగ్రెస్ కేడర్ ఆమెకు సహకరించిందని, ఈ నియోజకవర్గంలోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా సరిగా పనిచేయలేదనే చర్చ జరిగినట్టు సమాచారం. అలాగే మెదక్ నియోజకవర్గంలోనూ పూర్తిస్థాయిలో సహకారం అందలేదన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. ఇక, ఇంద్రకరణ్‌రెడ్డి, కోనేరు కోనప్ప, వేణుగోపాలాచారి లాంటి నేతల చేరికలు పార్టీకి కలసి రాలేదని, వాళ్ల ఓట్లు కూడా పడలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు టికెట్లు ఇవ్వడం కూడా కొంత ప్రభావం చూపిందని చెప్పినట్లు సమాచారం. కరీంనగర్ లాంటి స్థానాల్లో అభ్యర్థుల ఖరారు కోసం చివరి నిమిషం వరకు ఆగకుండా ఉండాల్సిందనే అభిప్రాయాలు కూడా వెల్లడైనట్లు తెలిసింది. కాగా, శుక్రవారం కమిటీ లోక్‌సభ ఎన్నికల ఇంచార్జులు, పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ కానుంది.

సీఎం రేవంత్‌తో భేటీ

అధిష్టానం నుంచి వచ్చిన కురియన్, రకీబుల్ హుసేన్ గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎంగా బాధ్యతలు చేపట్టినందుకు రేవంత్‌ను కురియన్ అభినందించారు. అనంతరం రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై చర్చించారు. రాష్ట్రంలో ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలు, ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ కోసం చేస్తున్న కసరత్తు, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పని తీరు తదితర అంశాలను రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. ఈ భేటీలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు, టీజీ ఫుడ్స్ చైర్మన్ ఎంఏ ఫహీమ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పాల్గొన్నారు.

వారి అంతర్గత పొత్తుతోనే: ఎంపీ చామల కిరణ్

కురియన్ కమిటీతో భేటీ అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమ అభిప్రాయాలను కురియన్ కమిటీకి వివరించామని చెప్పారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 12-13 స్థానాలు వచ్చేవని, బీజేపీ-బీఆర్ఎస్‌ల అంతర్గత పొత్తు కారణంగానే ఎనిమిది సీట్లకు పడిపోయామని చెప్పారు. కొన్ని స్థానాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల స్థాయి కంటే తక్కువ ఓట్లను పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పొందిందని, పార్లమెంటు ఎన్నికల నాటికి సమీకరణాలు మారిపోయాయని చెప్పారు.

నిరుద్యోగులకు సర్కారీ 'పరీక్ష'!

▶ మొదటి పేజీ తరువాయి

మార్చి 4 నుంచి జూన్ 20వ తేదీ వరకు కొనసాగింది. పోటీ పరీక్షలకు సిద్ధంకావడానికి కనీసం 45 రోజులు ఉండాలి. కానీ ఉపాధ్యాయ నియామక పరీక్షకు నెల రోజుల వ్యవధి కూడా ఇవ్వకుండా పరీక్షల తేదీలు నిర్ణయించడంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీ కోసం 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదలైంది. ఆ పరీక్షలు పలుమార్లు వాయిదా పడ్డాయి. తాజా తేదీలను ప్రకటించిన టీజీపీఎస్సీ.. ఈసారి పరీక్ష తేదీల్లో ఎలాంటి మార్పు ఉండదంటూ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ రెండు పరీక్షలు ఒకే సమయంలో జరుగుతుండటంతో.. రెండింటికీ సిద్ధమవుతున్న వారికి ఇబ్బందిగా మారింది.

ఆందోళనలకు దిగుతున్న అభ్యర్థులు

ప్రిపరేషన్‌కు సమయం తక్కువగా ఉందని.. ఉపాధ్యాయ నియామక పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే డీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లను వెబ్‌సైట్లో పెట్టిందని పేర్కొంటున్నాయి.

వెబ్‌సైట్లో డీఎస్సీ హాల్‌టికెట్లు

డీఎస్సీ పరీక్షల హాల్‌టికెట్లను గురువారం రాత్రి వెబ్‌సైట్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు www. schooledu. telangana. gov. in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.

డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల షెడ్యూల్ ఇదీ..

ఉపాధ్యాయ పోస్టులు: 11,062
పరీక్షల తేదీలు: జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు
అభ్యర్థులు: 2.8 లక్షలు

గ్రూప్-2 పోస్టులు: 786
పరీక్షల తేదీలు: ఆగస్టు 7, 8 తేదీల్లో..
అభ్యర్థులు: 5.51 లక్షలు

రెండు నెలలు వాయిదా వేయాలి




ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన నెలలోపే రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తామనడం సరికాదు. కనీసం 45 రోజులు సమయం ఇవ్వాలి. టీచర్ నియామక పరీక్షలను రెండు నెలలు వాయిదా వేస్తే మేలు జరుగుతుంది.
– కేతమోని మనోజ్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా (డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల అభ్యర్థి)

పరీక్షలు వాయిదా వేయాలంటే.. పోలీసులతో కొట్టిస్తున్నారు



డీఎస్సీ పరీక్షలకు కాస్త సమయం ఇవ్వాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతుంటే స్పందించని సీఎం.. నిరుద్యోగులపై మాత్రం లాఠీచార్జి చేయిస్తున్నారు. ప్రజాపాలన అంటే.. నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడమేనా? విద్యార్థులకు ప్రిపరేషన్‌కు తగిన సమయం కూడా ఇవ్వకపోవడం సరికాదు.
– గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు

కొంత సమయం ఇస్తే బాగుండేది



టెట్ ఫలితాలు వెల్లడించిన తర్వాత కొంత సమయం ఇచ్చి ఉపాధ్యాయ నియామక పరీక్షలు నిర్వహిస్తే బాగుండేది. అలాగాకుండా ముందే షెడ్యూల్ ప్రకటించి, తర్వాత టెట్ ఫలితాలు ఇవ్వడంతో అభ్యర్థుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని కొందరు ఉద్దేశపూర్వకంగా రాజకీయాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో కలుగజేసుకుని సమస్యను పరిష్కరిస్తే అభ్యర్థులకు ఊరట కలుగుతుంది.
– ప్రొఫెసర్ కోదండరామ్, టీజేఎస్ అధ్యక్షుడు

లాఠీచార్జీలు కాదు.. సమస్యను పరిష్కరించాలి



రాష్ట్రంలో వివిధ పోటీ పరీక్షలను వాయిదా వేయాలంటూ విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీ నిర్వహించి రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. పదేళ్లపాటు ఉద్యోగాల కోసం వేచి ఉండటంతో నిరుద్యోగ యువతలో ఆతృత, ఆందోళన పెరిగా యి. వరుస పరీక్షల నిర్వహణ షెడ్యూల్, ఇప్పటికే ప్రకటించిన పోటీపరీక్షల రీషెడ్యూల్‌పై టీజీపీఎస్సీ నిర్ణయించుకోలేని పరిస్థితిలో ఉంది. పరీక్షలు వాయిదా వేయాలంటూ ఎవరైనా కోర్టుకు వెళితే.. కోర్టు స్టే ఇస్తే మొత్తం సమస్య మొదటికి వచ్చే అవకాశాలున్నా యి. అందువల్ల ప్రభు త్వం జాగ్రత్త తీసుకోవాలి. నిరుద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వపరంగా స్పందించడమో లేక ఉద్యమిస్తున్న సంఘాల ప్రతినిధులతో చర్చించి సమ స్య పరిష్కారానికి నచ్చజెప్పడమో చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా లాఠీచార్జీలు, దాడులకు దిగడం మంచిది కాదు.
– ప్రొఫెసర్ హరగోపాల్, హక్కుల కార్యకర్త, విద్యావేత్త

స్తంభించిన రిజిస్ట్రేషన్లు

సాంకేతిక సమస్యలతో ఉదయం నుంచి బంద్

- సాయంత్రానికి కూడా పరిష్కారం కాకపోవడంతో ఎదురుచూపులతోనే సరి
- ఆధార్ సేవల్లో అంతరాయమే కారణం.. నేటి నుంచి యథావిధిగా సేవలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. యథావిధిగా ఉదయం 10 గంటలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రారంభం కాగా, అన్ని చోట్ల ఒకట్రెండు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత 11 గంటలకు సమస్య వచ్చింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా క్రయవిక్రయదారుల ఆధార్ వివరాలతో ఈకేవైసీ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఈకేవైసీని సబ్‌రిజిస్ట్రార్ వేలిముద్రతో ఆమోదించాలి. అలా సబ్‌రిజిస్ట్రార్ వేలిముద్ర వేసే క్రమంలో సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆ దశలోనే ఆగిపోయిందని రిజిస్ట్రేషన్లశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా సరాసరి 3,500 నుంచి 4వేల వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ, గురువారం ఉదయం నుంచి సాయంత్రం కార్యాలయ వేళలు ముగిసేంతవరకు ఈకేవైసీ సమస్య పరిష్కారం కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా గురువారం కేవలం 339 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. రిజిస్ట్రేషన్ సేవల్లో కలిగిన అంతరాయానికి చింతిస్తున్నామని, ఆధార్ సర్వీసుల్లో సమస్య కారణంగానే రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో అధికారికంగా వెల్లడించింది. ఈ విషయమై రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులను 'సాక్షి' సంప్రదించగా, తమ శాఖకు సంబంధించిన సర్వర్లలో ఎలాంటి సమస్యా లేదని, సెంట్రల్ సర్వర్‌తో అన్ని కార్యాలయాల్లోని సర్వర్లు సక్రమంగానే ఉన్నాయని చెప్పారు. ఈకేవైసీ మినహా ఈసీలు, వివాహ రిజిస్ట్రేషన్లు, ఈ–స్టాంపులు లాంటి కార్యకలాపాలు యథావిధిగా నడిచాయని వెల్లడించారు. కాగా, ఆధార్ సేవల్లో తలెత్తిన లోపాన్ని చక్కదిద్దామని, శుక్రవారం నుంచి యథావిధిగా సేవలు అందుతాయని ఢిల్లీలోని యూఐడీఏఐ అధికారులు తెలిపారు.

టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా నిర్మలా జగ్గారెడ్డి బాధ్యతల స్వీకారం

- హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, పొన్నం తదితరులు



నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు చెబుతున్న ఉత్తమ్, పొన్నం, మధుయాష్కీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్‌గా నిర్మలా జగ్గారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బషీర్‌బాగ్‌లోని టీజీఐఐసీ కార్యాలయంలో ఆమె బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆడంబరంగా జరిగింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ నేత జెట్టి కుసుమకుమార్, కుమారుడు దత్తురెడ్డి, కుమార్తె జయారెడ్డి, అభిమానుల సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు నిర్మలా జగ్గారెడ్డిని అభినందించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున జగ్గారెడ్డి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్‌గౌడ్ మాసాబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కోఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి కూడా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ట్యాపింగ్ కేసులో బెయిల్‌పై నేడు తీర్పు

- నాంపల్లి కోర్టులో ముగిసిన వాదనలు

సిటీ కోర్టులు: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న నాంపల్లి కోర్టు తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేసింది. ఇప్పటికే ఒకసారి ఏ–2 భుజంగరావు, ఏ–3 ప్రణీత్‌రావు, ఏ–4 తిరుపతన్న బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో నిందితులు రెండోమారు బెయిల్‌కు దాఖలు చేసుకోగా గురువారం మరోసారి వాదనలు జరిగాయి. పిటిషనర్ల తరఫున వి.సురేందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. సరైన పద్ధతిలో పోలీసులు చార్జిషీట్ వేయలేదని న్యాయస్థానమే పలుమార్లు తిరస్కరించిందన్నారు. చార్జిషీట్‌లో విలువైన మెటీరియల్ లేదని, పోలీసులు కావాలనే పిటిషనర్లను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసున్నారన్నారు. నిందితులకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివరెడ్డి వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం చాలా పెద్ద విషయమని, పూర్తి సమాచారం సేకరించేందుకు సమయం పడుతుందని చెప్పారు. త్వరలోనే మరింత సమాచారాన్ని కోర్టు ముందు ఉంచుతామన్నారు.



ఎవరు సన్నాసో వాళ్లే చెప్పాలి

- రాహుల్, రేవంత్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్య
- అధికారం కోసం విద్యార్థులను వాడుకున్నదే కాంగ్రెస్
- దాడులు చేస్తున్న పోలీసుల పేర్లు డైరీలో రాస్తున్నాం
- నిరుద్యోగులకు రాజకీయాలు అంటగడుతున్నారని విమర్శ



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చేందుకు విద్యార్థులను వాడుకున్న రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలలో ఎవరు సన్నాసో వారే చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. విద్యార్థులను, నిరుద్యోగులను అవమానపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడులు చేస్తున్న పోలీసుల పేర్లను డైరీలో నమో దు చేస్తున్నామని, అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం పోలీసుల చేతిలో దెబ్బతిన్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా భరించలేని నిరంకుశ మనస్తత్వంతో సీఎం రేవంత్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులపైనా పోలీసులు దుర్మార్గంగా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ అంటూ రాహుల్ గాంధీ బొమ్మతో దినపత్రికలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రకటనలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు, యువతకు రేవంత్ రాజకీయాలు అంటగడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారి తలలు, వీపులు పగలగొట్టడమే మీ మార్కు ప్రజాపాలనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

కొత్త రూపంలో పాత అరాచకాలు

పాత అరాచకాల కాంగ్రెస్ మోసపూరితంగా కొత్త రూపంలో వచ్చిందని విమర్శించిన కేటీఆర్ ఈ విషయాన్ని ప్రజలు ఆరు నెలల్లోనే అర్థం చేసుకున్నారని చెప్పారు. హామీల అమలును ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడమేమిటని నిలదీశారు. గతంలో ప్రైవేటు యూనివర్సిటీలపై రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ ప్రస్తుతం ఏడు యూనివర్సిటీలకు కొత్తగా ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో 50వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించి ప్రస్తుతం ఆరు వేల అదనపు ఉద్యోగాలతో యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 1.62 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు 40వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించామన్నారు. విద్యారంగంలో జరిగే అన్యాయాలపై బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆందోళన చేయాలని కేటీఆర్ సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ దెబ్బతింటే దేశానికీ నష్టమే: 'ఎక్స్'లో కేటీఆర్

పాలనానుభవం లేని నాయకత్వ ఫలితం రాజధాని హైదరాబాద్ మొదలుకొని రాష్ట్రంలోని మారుమూల ప్రాంతంలోనూ కనిపిస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ మసకబారిందని, దశాబ్దకాలంగా ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో ప్రజల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. సీఎం స్వయంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వస్తున్నా శాంతిభద్రతలపై నియంత్రణ లేదని ఆరోపించారు. నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని, పెట్టుబడులు తరలిపోతుండటంతో యువతకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని, విద్యుత్ కోతలు, నేరాలు హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎంకు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర రాజధానిపై లేదన్నారు. హైదరాబాద్ కేవలం రాష్ట్ర రాజధాని మాత్రమే కాదని, తెలంగాణకు ఆర్థిక ఇంజిన్ అనీ, హైదరాబాద్ దెబ్బతింటే కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి కూడా నష్టమేనని కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ఇప్పించండి

- కేంద్ర మంత్రి బండికి కేటీఆర్ లేఖ
- రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని విమర్శ

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు కోసం ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కోరారు. గతంలో రాష్ట్ర పరిశ్రమల మంత్రి హోదాలో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ కోసం తాను అనేక విధాలుగా ప్రయత్నించినా కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. కనీసం ఇప్పుడైనా నేత కార్మికులను నిరాశ పరచకుండా త్వరలో ప్రవేశ పెట్టే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ మేరకు ప్రకటన చేయించాలని కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీగా కృషి చేయాలని సంజయ్‌కు కేటీఆర్ గురువారం లేఖ రాశారు. రెండోసారి ఎంపీగా ఎన్నికై ప్రస్తుతం కేంద్రంలో మంత్రి పదవిలో ఉన్న బండికి సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక సిరిసిల్ల నేత కార్మికులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సంగతి గుర్తించాలని కేటీఆర్ సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతన్నల కోసం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ సర్కారు పాతరేసిందని ఆరోపించారు. దీంతో ఏడు నెలల కాలంలోనే చేనేత రంగం మరోసారి పదేళ్ల క్రితం నాటి సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐదేళ్లలో కరీంనగర్‌కు గానీ సిరిసిల్ల నేతన్నలకు గానీ మీరు (బండి సంజయ్) చేసిందేమీ లేదు.. కనీసం కేంద్రమంత్రిగా ఇప్పుడైనా ఈ బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ప్రకటన చేయిస్తారని భావిస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ క్లస్టర్ ఏర్పాటుతో సిరిసిల్ల చేనేత కార్మికులకు చేతినిండా పనిదొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మీ వల్లే నా రాక మరింత ఆలస్యం

పోలీసులకు ఈ-మెయిల్ పంపిన టి.ప్రభాకర్‌రావు

తప్పుడు కేసు నమోదుతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యా ● ఉద్దేశపూర్వకంగానే మీడియాకు లీకులు ఇస్తున్నారు

వైద్యుల సూచనల మేరకే ప్రయాణం వాయిదా వేసుకున్నట్లు వెల్లడి ● ఈ లేఖ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన సిట్



సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కార్యాలయం కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్, బెదిరింపు వసూళ్ల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు పోలీసులకు షాక్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న ఆయన షెడ్యూల్ ప్రకారం గత నెల 26నే తిరిగి రావాల్సి ఉంది. అయితే పోలీసుల వ్యవహారశైలి కారణంగానే తన రాక మరింత ఆలస్యమవుతోందంటూ ఆరోపించారు. ట్యాపింగ్ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీకి ఇటీవల అనారోగ్య కారణాలను చూపుతూ ఈ-మెయిల్ ద్వారా లేఖ రాశారు. ఇది గురువారం వెలుగులోకి రావడంతో పాటు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రభాకర్ రావు రాసిన లేఖను దర్యాప్తు అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు.

జూన్ ఆఖరుకు వస్తానంటూ చెప్పి...

గత డిసెంబర్‌లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి రావడానికి ముందే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. తాను వైద్యం కోసం అమెరికా వచ్చానని, తనపై అరెస్టు వారంట్ జారీ చేయవద్దని, షెడ్యూల్ ప్రకారం జూన్ 26న తిరిగి వస్తానని కోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌లో ప్రభాకర్‌రావు వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన రాకపై అనేక ఊహాగానాలు కూడా వినిపించాయి. ప్రభాకర్‌రావు కుమారుడిని గత నెల 12న విచారించిన పోలీసులు ఆయన తిరిగి ఎప్పుడు వస్తారని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రావు తాజాగా ఈ-మెయిల్ ద్వారా దర్యాప్తు అధికారికి లేఖ రాశారు. ఒకప్పుడు తన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో జూన్ నాటికి పూర్తిగా కోలుకుంటానని, తిరిగి వచ్చేస్తానని భావించానని చెప్పారు. అయితే తనపై నమోదైన తప్పుడు కేసు, నిరాధార ఆరోపణలు, ఉద్దేశపూర్వకంగా పోలీసులు మీడియాకు ఇస్తున్న లీకులు, తన ప్రతిష్టకు భంగం కలగడం తదితర కారణాలతో ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. ఏళ్లుగా ఉన్న కేన్సర్‌కు తోడు ఒత్తిడి కారణంగా రక్తపోటు పెరగడంతో గుండె, మూత్రపిండాలకు సంబంధించిన ఇబ్బందులు వచ్చాయని వివరించారు. ఈ పరిణామాలు తన కుటుంబాన్ని షాక్‌కు గురిచేశాయని ఆరోపించారు.

వైద్యులు అమెరికా వదిలి వెళ్లవద్దన్నారంటూ...

ఈ పరిణామాల నేపథ్యంలో ఇటీవల తన శారీరక, మానసిక ఆరోగ్యాలు మరింత క్షీణించడంతో ఆంకాలజీ, కార్డియాలజీ, యూరాలజీలో నిపుణులను సంప్రదిస్తున్నానని పేర్కొన్నారు. ప్రస్తుత కన్సల్టింగ్ డాక్టర్లు తన ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడే వరకు అమెరికా వదిలి వెళ్లవద్దంటూ సలహా ఇచ్చారని లేఖలో వివరించారు. ఈ కేసులో ఇప్పటికే దర్యాప్తు అధికారులు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారని, దీన్ని బట్టి తాను తిరిగి రాకున్నా దర్యాప్తు ఆగడం, దానికి ఆటంకం కలగడం లాంటివి లేవన్న విషయం స్పష్టమైందన్నారు. ఆరోగ్యం మెరుగుపడగానే తిరిగి వస్తానని, పోలీసుల ఎదుట హాజరై అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తానంటూ లేఖ ద్వారా దర్యాప్తు అధికారికి హామీ ఇచ్చారు. ఈలోపు అవసరం అనుకుంటే వీడియో కాన్ఫరెన్సింగ్ లేదా టెలి కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణను ఎదుర్కొనడానికి కూడా తాను సిద్ధమని చెప్పారు.

మాకు ఆ గౌరవం ఏదీ?

▶ మొదటి పేజీ తరువాయి

స్వయంగా వచ్చి స్వాగతం చెప్పాల్సిన ఉన్నా ఎవరూ రావడం లేదు. తమ పర్యటనలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని ప్రొటోకాల్ విభాగం జిల్లా అధికారులకు పంపించడం లేదు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పరంగా జరిగే అభివృద్ధి కార్యక్రమాలకూ ఆహ్వానించడం లేదు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు మాత్రమే సమాచారం ఇస్తున్నారు. సాధారణంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో బదిలీలపై వచ్చే అధికారులు మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలవాలనే ఆనవాయితీని పాటించడం లేదు. జాతీయ పండుగలైన పంద్రాగస్టు, గణతంత్ర దినోత్సవం, రాష్ట్ర అవతరణ వేడుకలు తదితర సందర్భాల్లో తాము జాతీయ పతాకాన్ని ఏ జిల్లాలో ఎగురవేయాలో చివరి నిమిషం వరకు చెప్పడం లేదు. పర్యటనలకు వెళ్లిన సందర్భంలో కనీసం ఎస్ఐ స్థాయి అధికారి బందోబస్తు ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా కనిపించడం లేదు. ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో సినిమా తారలు, ఇతరులను కూర్చోబెడుతూ మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ వెళ్లిన సందర్భంలో అధికారిక ఏర్పాట్లేవీ చేయడం లేదు. అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు వెళ్లినపుడు భద్రతా ఏర్పాట్లు ఉండటం లేదు.

25 లేదా 26న రాష్ట్ర బడ్జెట్?

రాష్ట్ర అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్ర బడ్జెట్ ఈనెల 23న ప్రవేశపెడుతున్న నేపథ్యంలో, రాష్ట్ర బడ్జెట్ ఈనెల 25 లేదా 26న ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఉన్నతాధికారులతో జరిగిన భేటీలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ సమీక్ష నిర్వహించారు. సమావేశాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలపై విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాసనసభ, మండలి లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో పెండింగులో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో ప్రొటోకాల్ వివాదాలు తలెత్తకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని చెప్పారు. ఈ సమీక్షలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, లెజిస్లేచర్ సెక్రెటరీ నరసింహాచార్యులు, విప్ రామచంద్రు నాయక్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- ఉపాధ్యాయ బదిలీలపై పాఠశాల విద్య డైరెక్టర్ హామీ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా తలెత్తిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి పాఠశాల విద్య డైరెక్టర్ వెంకట్ నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నేతృత్వంలోని బృందం గురువారం నర్సింహారెడ్డిని కలిసింది. ప్రమోషన్ల తర్వాత మిగిలిన ఖాళీల్లో తర్వాత వారికి పదోన్నతి కల్పించాలని, బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో తపస్ అధ్యక్షుడు హన్మంతరావు, నవాత్ సురేశ్ ఉన్నారు.

మత్స్యశాఖలో అవినీతి జరగకుండా చూడండి

- మత్స్య సహకార చైర్మన్ మెట్టు సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: మత్స్యశాఖ అధికారులు నిబద్ధతతో పనిచేసి మత్స్యకారుల పురోగతికి తోడ్పడాలని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శాఖలో అవినీతి జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి మత్స్యశాఖ అధికారులతో మాసాబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయికుమార్ అధికారులకు పలు సూచనలు చేశారు.

మీ అంకితభావం, నిబద్ధత స్ఫూర్తిదాయకం

- పుట్టినరోజు సందర్భంగా బండి సంజయ్‌కు ప్రధాని మోదీ లేఖ
- శుభాకాంక్షలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు



శ్రీవారి సన్నిధిలో బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్/ కరీంనగర్‌టౌన్: కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం బండి సంజయ్‌కు ప్రధాని మోదీ లేఖను పంపించారు. 'నవ భారతాన్ని నిర్మించేందుకు ప్రభుత్వంలో నా సహోద్యోగిగా, మీరు అపరిమితమైన శక్తి, దృఢ సంకల్పంతో అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. కుటుంబం, సమాజం, దేశం పట్ల మన బాధ్యతలను నిర్వర్తించడానికి రెట్టించిన శక్తితో మనల్ని మనం పునరంకితం చేసుకునేలా పుట్టినరోజు ప్రేరేపిస్తుంది. దేశాభివృద్ధి, శ్రేయస్సు కోసం మీరు చేస్తున్న అంకితభావం, నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకం. మీరు మంచి ఆరోగ్యం, ఆనందంతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నాను' అని ప్రధాని లేఖలో పేర్కొన్నారు. కాగా, బండి సంజయ్‌కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషీ, మనోహర్‌లాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ కూడా ఉన్నారు. తనకు శుభాకాంక్షలు చెప్పిన అందరికీ బండి సంజయ్ 'ఎక్స్'వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో బండి సంజయ్...

బండి సంజయ్ జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు.

కేటీఆర్ @ అజయ్ రావు.. మీకు నేతన్నలు ఇన్నాళ్లకు గుర్తొచ్చారా?

పవర్ లూమ్ సంస్థలు మూతపడేలా చేసింది మీరే కదా?

- నాడు మీరు సహకరించి ఉంటే సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ పార్క్ వచ్చేది
- కేటీఆర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: 'పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించింది మీరే కదా? సిరిసిల్లకు 15 ఏళ్లుగా మీరే ప్రాతినిధ్యం వహించారు కదా? మీ హయాం నుంచి నేతన్నల ఆకలి చావులు కొనసాగుతూనే ఉన్నాయి కదా...మీరెందుకు నేతన్నలను సంక్షోభం నుంచి గట్టెక్కించలేకపోయారు?'అని రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. 'బతుకమ్మ'బకాయిలు చెల్లించకుండా పవర్ లూమ్ సంస్థలు మూతపడేలా చేసింది మీరే కదా? ప్రధానమంత్రి తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రకటించినప్పుడు... మీకు సిరిసిల్ల గుర్తుకు రాలేదా?'అని కేటీఆర్ బహిరంగ లేఖకు సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు @ కల్వకుంట్ల అజయ్ రావు అని సంబోధిస్తూ సంజయ్ లేఖ సంధించారు.

ఆ మాట అన్నందుకు సంతోషం

'రాష్ట్ర పాలకుల వైఫల్యం వల్లనే నేడు నేతన్నలు సంక్షోభంలో ఉన్నారని ఒప్పుకున్నందుకు సంతోషం. సిరిసిల్ల నేతన్నలు సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కేంద్ర మంత్రిగా, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నా. అది నా బాధ్యత కూడా'అని బండి సంజయ్ స్పష్టం చేశారు. 'సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా మీరు రాసిన లేఖలోని అంశాలను తెలుసుకున్నాను. ఇన్నాళ్లకైనా మీరు సిరిసిల్ల నేతన్నల సమస్యలను గుర్తించినందుకు సంతోషం. కానీ, అధికారంలో ఉన్నప్పుడు మీరే డిఫ్యాక్టో సీఎం. సిరిసిల్లలో మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఎందుకు ఏర్పాటు చేయించలేకపోయారు? ఆనాడు మీ ప్రభుత్వం సహకరించి ఉంటే సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ పార్క్ ఎప్పుడో ఏర్పాటయ్యేది'అని సంజయ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

అల్లాహ్ మీ జరుగుబాటుకు ఆధారంగా చేసిన మీ ధనాన్ని అవివేకుల పరం చేయకండి. కాకపోతే ఆ సంపదలో నుంచి వారికి అన్నవస్త్రాలు మొదలుగునవి సమకూర్చండి. వారితో మంచితనంతో, మృదువుగా మాట్లాడండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 12 జూలై 2024

పిల్లల భవితకు పెద్ద పరీక్ష!

సంస్కరణ అనుకొని తెచ్చినది తీరా సమస్యగా మారడమంటే ఇదే. వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం పదకొండేళ్ళ క్రితం అప్పటి యూపీఏ సర్కార్ తెచ్చిన జాతీయస్థాయి ప్రవేశపరీక్ష 'నీట్' వ్యవహారం చూస్తుంటే అదే అనిపిస్తోంది. పేపర్ లీకులు, ఇతర అక్రమాలు సహా అనేక వివాదాలు ముసురుకున్న తాజా 'నీట్ – యూజీ 2024' వ్యవహారమే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అవకతవకలకు ఆలవాలమైన జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) – కొత్తగా పరీక్ష నిర్వహించాలని కోరుతున్న అభ్యర్థులు – అందుకు ససేమిరా అంటున్న కేంద్రం – సత్వర నిర్ణయానికి బదులు సన్నాయి నొక్కులు నొక్కుతున్న సుప్రీమ్ కోర్ట్... వీటన్నిటి మధ్య నీట్ ఓ అంతులేని కథ. మళ్ళీ పరీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నట్టు సుప్రీమ్ గురువారం ప్రకటించడంతో ఈ సీరియల్‌కు సశేషం కార్డు పడింది. ఈసారి వైద్యవిద్యలో ప్రవేశాలు ఆశించిన 24 లక్షలమందితో పాటు అర్హత సంపాదించిన 13 లక్షలమంది పరిస్థితి అగమ్య గోచరమైంది.

లీక్ కథ బయటకొచ్చి ఇన్ని వారాలైనా, పునఃపరీక్ష మినహా మరో మార్గం కనబడట్లేదు. ఒక పక్క కోర్ట్ నిర్ణయం జాప్యమవుతుండగా... మరోపక్క రీ–టెస్ట్‌పై సంబంధిత పక్షాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నిజానికి, ఉత్తరాదిన కొన్ని కేంద్రాల్లో ప్రశ్నపత్రం లీక్ సహా అనేక అక్రమాలు జరిగినట్టు ఇప్పటికే మీడియాలో బాహాటంగా వెల్లడైంది. సాక్షాత్తూ సుప్రీమ్ సైతం లీకేజీ నిజమేనని అభిప్రాయపడింది. కాకపోతే, వ్యవస్థీకృతంగా లీక్ జరిగిందా, ఏ మేరకు ఎలా జరిగింది, భవిష్యత్తులో కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారన్న వివరాలు ఇవ్వాలంటూ కేంద్రాన్నీ, ఎన్టీఏనూ జూలై 8న ఆదేశించింది. అందుకు జవాబిచ్చే క్రమంలో కేంద్ర సర్కార్ పాత పరీక్ష రద్దు చేసి కొత్త పరీక్ష పెట్టడం హేతుబద్ధం కాదు పొమ్మంటోంది. అదేమంటే, విస్తృత స్థాయిలో అవకతవకలు జరిగాయనడానికి ఆధారాలు లేవంటూ ఐఐటీ – మద్రాస్ తాజాగా ఇచ్చిన సమగ్ర నివేదికను వత్తాసు తెచ్చుకుంటోంది. సహజంగానే ఎన్టీఏ సైతం కేంద్ర సర్కార్ వాదననే సమర్థిస్తోంది. పైగా, నీట్ ప్రశ్నపత్రం సామాజిక మాధ్యమాల్లో లీకైనట్టు వచ్చిన వీడియోనే ఫేక్ అనేసింది.

ఏ విషయంలోనైనా అనుమానాలు రాకూడదు. వస్తే సమూలంగా నివృత్తి చేయాలి. అంతేకానీ అనుమానం పెనుభూతమైన వేళ... పాలకులు, ప్రభుత్వ సంస్థలు భీష్మించుకు కూర్చుంటే ఎలా? పైగా, లక్షలాది విద్యార్థుల భవితతో, వారి కుటుంబాల మానసిక ఆరోగ్యంతో ముడిపడిన అంశాన్ని వారి దృక్కోణం నుంచి సానుభూతితో చూడకపోవడం మరీ ఘోరం. నీట్ ఫలితాల్లో ఏవైనా నగరాల్లో, కేంద్రాల్లో పెద్దయెత్తున విద్యార్థులకు అనుచిత లబ్ధి చేకూరిందా అని తేల్చడం కోసం ఉన్నత విద్యాశాఖ అభ్యర్థన మేరకు ఐఐటీ– మద్రాస్ డేటా ఎనాలసిస్ చేసింది. మంచిదే! 2023, 2024ల్లోని టాప్ లక్షా నలభై వేల ర్యాంకులను ఈ ఎనాలసిస్‌లో భాగంగా విశ్లేషించారట. ఎక్కడా ఏ అక్రమం జరగలేదనీ, టాప్ ర్యాంకులు అన్ని నగరాలకూ విస్తరించాయనీ ఐఐటీ మాట. ఇక్కడే తిరకాసుంది. ప్రత్యేకించి ఈ ఏటి పరీక్షలో కొన్ని కేంద్రాల్లో చేతులు మారిన డబ్బులు, ముందస్తు లీకులు, డబ్బులిచ్చిన పిల్లలకు జవాబుల ప్రత్యేక శిక్షణ జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఆ నిర్ణీత కేసులు వదిలేసి సర్వసాధారణంగా నీట్ నిర్వహణలో అక్రమాలే లేవంటూ క్లీన్‌చిట్ ఇస్తే సరిపోతుందా?

గోధ్రా, పాట్నా లాంటి కొన్ని కేంద్రాలకే లీక్ పరిమితమైందన్న ఎన్టీఏ వాదన సరైనది కాదు. భౌగోళిక సరిహద్దుల్ని చెరిపేసిన సోషల్ మీడియా శకంలో ఒకచోట లీకైన పేపర్ అక్కడికే ఆగుతుందనుకోవడం అజ్ఞానం. పైగా రాజస్థాన్, ఢిల్లీ, జార్ఖండ్, బెంగాల్‌లోనూ లీకువీరుల అరెస్టులే నిదర్శనం. సీబీఐ దర్యాప్తును బట్టి దోషులైన అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఏ హామీ ఇస్తోంది. అక్రమ ర్యాంకర్లపై చర్యలు సరే... వాళ్ళ నేరం వల్ల దేశవ్యాప్తంగా ఇబ్బంది పడి, ర్యాంకుల్లో వెనకబడ్డ లక్షలాది విద్యార్థుల మాటేమిటి? వారికి న్యాయం చేసేదెట్లా? ఇకపై పేపర్, పెన్ను వాడే ఓఎంఆర్ విధానం వదిలి కంప్యూటర్ ఆధారిత పరీక్షకు మారతారట. ప్రైవేట్ ఏజెన్సీలపై అతిగా ఆధారపడే ఆ పరీక్షలూ అంత నిర్దుష్టమేమీ కాదని ఎన్టీఏనే నిర్వహించే యూజీసీ నెట్ పరీక్ష రద్దుతో ఇటీవలే తేలిపోయింది. ఈ పరిస్థితుల్లో పరీక్షా విధానమే కాదు, ఎన్టీఏ సహా వ్యవస్థనే సమూలంగా ప్రక్షాళించడం అవసరం. రీ–టెస్ట్ పెట్టాలా వద్దా అన్న చర్చ కన్నా అది ఇంకా కీలకం.

నిజానికి, ప్రతిభకు పెద్ద పీట వేయడానికి ఉద్దేశించిన పరీక్షా వ్యవస్థలు లోపభూయిష్ఠంగా మారుతున్న తీరు విచారకరం. చదువులు, ప్రవేశ పరీక్షల మొదలు ఉద్యోగాల పోటీ పరీక్షల దాకా అన్నిటి మీదా నీలినీడలే. ప్రశ్నపత్రాల లీకుల దగ్గర నుంచి జవాబు పత్రాల మూల్యాంకనంలో లోటుపాట్ల దాకా ప్రతి స్థాయిలోనూ నిత్యం వివాదమే. గత 7 ఏళ్ళలో, 15 రాష్ట్రాల్లో 70 లీకులతో 1.4 కోట్లమంది బాధితులే. వెరసి పరీక్షల ప్రాథమిక లక్ష్యమే దెబ్బతింటోంది. ఆగి, ఆలోచించాల్సిన తరుణమిది. మన పరీక్షల విధానం, వాటి ప్రాథమిక లక్ష్యం, ప్రయోజనాలపైన మథనం జరపాల్సి ఉంది. జ్ఞాపకశక్తిని పరీక్షించే పద్ధతుల నుంచి పక్కకు వచ్చి, జ్ఞానాన్ని పరిశీలించే మార్గాల వైపు ఇప్పటికైనా మన పరీక్షా వ్యవస్థలు మళ్ళాల్సి ఉంది. ప్రతి పరీక్షనూ వ్యాపారంగా మారుస్తూ, తప్పుడు మార్గాలు వెతుకుతున్న చీడపురుగుల్ని ఏరివేసేందుకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నుంచి పాఠశాల బోర్డ్ దాకా పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి జూన్ 21 నుంచి పార్లమెంట్ ఓ కొత్త చట్టం తెచ్చింది. అది ఏ మేరకు అవతవకల్ని అరికడుతుందో చూడాలి. ఏమైనా, పరీక్ష జ్ఞానానికి గీటురాయిగా ఉండాలే కానీ, ప్రతిసారీ పిల్లలకు శిక్షగా మారితేనే కష్టం.

గ్రహం అనుగ్రహం శ్రీక్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి శు.షష్ఠి ఉ.10.18 వరకు, తదుపరి సప్తమి; నక్షత్రం ఉత్తర ప.2.54 వరకు, తదుపరి హస్త; వర్జ్యం రా.12.13 నుండి 1.59 వరకు; దుర్ముహూర్తం ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు; అమృత ఘడియలు ఉ.6.55 నుండి 8.43 వరకు; రాహుకాలం ఉ.10.30 నుండి 12.00 వరకు; యమ గండం ప.3.00 నుండి 4.30 వరకు; సూర్యోదయం 5.36; సూర్యాస్తమయం 6.35

'కనీస' చట్టబద్ధత ఎండమావేనా?

విశ్లేషణ



డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు ఆశించిన మేరకు లేకపోవడంతో అన్నదాతలకు నిరాశే మిగిలింది. వరి ఎక్కువగా పండించే రాష్ట్రాలు వరి సాధారణ రకానికి రూ. 3,000 నుంచి రూ. 3,200; ఏ గ్రేడ్ రకానికి రూ. 3,200 నుంచి రూ. 3,400 ప్రకటించాలని కేంద్రానికి సిఫార్సు చేశాయి. కానీ కేంద్రం సాధారణ రకానికి రూ. 2,300; ఏ గ్రేడ్ రకానికి రూ. 2,320 మాత్రమే ప్రకటించింది. పత్తికి రూ. 1,000 నుంచి రూ.1,500 పెంచాలని కోరితే రూ. 500 పెంపుతో సరిపెట్టారు. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, కందులు, పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయా, పెసలు, మినుములు... వంటి పంటలకు రాష్ట్రాల సిఫార్సులకు అనుగుణంగా ధరలు పెంచలేదు. శాస్త్రీయత లేకుండా తోచిన ధర ప్రకటించడంలో ఔచిత్యం ఏమిటి?

పంటల సాగు ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఆదాయం అందాలనీ, అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుందనీ వ్యవసాయ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ 2005లో నాటి యూపీఏ ప్రభుత్వానికి అందించిన నివేదికలో స్పష్టం చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు ఈ డిమాండ్ అపరిష్కృతంగానే ఉండిపోయింది. ఆశ్చర్యం ఏమంటే... స్వామినాథన్ కమిషన్ అందించిన సిఫార్సులను 2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు అధికారంలో ఉండి అమలు చేయకుండా అటకెక్కించిన కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని నమ్మబలికింది.



మరోపక్క, దేశంలో దశాబ్దాలపాటు అపరిష్కృతంగా, చిక్కుముళ్లుగా బిగుసుకుపోయిన సమస్యలకు తాము పరిష్కార మార్గాలు చూపగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే చెబుతుంటారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆర్టికల్ 370 రద్దు, ట్రిబుల్ తలాక్ రద్దు, చంద్రయాన్ విజయం, సూర్యయాన్‌కు సన్నద్ధత వంటి అంశాలను ఉదహరించే అధికార బీజేపీ గత పదేళ్లుగా రైతాంగ సమస్యలకు అరకొరగా తప్ప శాశ్వత పరిష్కార మార్గాలేమీ చూపించలేకపోవడం గమనార్హం! ఫలితంగానే దేశానికి ఆహార భద్రత చేకూర్చడానికి ఆరుగాలం కష్టపడే అన్నదాతలు దేశం నలుమూలల నుంచి తరలివచ్చి ఢిల్లీ శివారు ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని ఎండ, వాన, చలిని తట్టుకొని నెలల తరబడి తమ డిమాండ్ల సాధన కోసం ఉధృతమైన ఉద్యమం చేశారు. గత 10 ఏళ్లల్లో నాలుగు దశల్లో దేశ రైతాంగం చేసిన ఆందోళన కార్యక్రమాలు ఇంతకుముందెప్పుడూ కనివిని ఎరుగనివి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 300కు పైగా రైతు సంఘాలు సంఘటితమై ఉద్యమించాయంటే సమస్య తీవ్రత ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. 750 మందికి పైగా ప్రాణాలు పోయినా లెక్కచేయక రైతాంగం ప్రదర్శించిన పట్టుదల కారణంగానే కేంద్రం పార్లమెంట్‌లో మూడు వివాదాస్పద రైతు బిల్లుల్ని ఉపసంహరించుకొంది. కానీ వారి ఇతర డిమాండ్లను మాత్రం నెరవేర్చలేదు.

దేశ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న అతి ప్రధాన డిమాండ్ ఎంఎస్‌పీ(కనీస మద్దతు ధర)కి చట్టబద్ధత. దీనినే 'కిసాన్ న్యాయ్ గ్యారంటీ' అంటున్నారు. కేంద్రం ముందు రైతు సంఘాలు పెట్టిన ఇతర డిమాండ్లలో 1) ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఒప్పందాల నుంచి భారత్ బయటకు రావడం 2) వ్యవసాయ దిగుమతులపై సుంకాల పెంపుదల 3) 2020 విద్యుత్ సంస్కరణల చట్టం రద్దు 4) ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులకు పెంపు 5) రైతుకు, రైతు కూలీలకు పెన్షన్ వర్తింపు వంటివి ప్రధానంగా ఉన్నాయి.

రైతులు పెట్టిన ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపినా పరిష్కారం కాలేదు. ముఖ్యంగా రైతులు పట్టుబడుతున్న ప్రధాన డిమాండ్ 23 పంటలకు కనీస మద్దతు ధరలతో చట్టబద్ధత కల్పించడం. ఈ అంశాన్ని ప్రభుత్వం ఆర్థిక కోణంలో కాకుండా రైతుల ఆర్థిక కోణంలో చూడాలని అంటున్నారు. కానీ, కేంద్రం ఈ డిమాండ్‌కు తలొగ్గకపోగా మరో కొత్త ప్రతిపాదన తెరమీదకు తెచ్చింది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా కంది, మినుము, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు పండిస్తే ఐదేళ్ల పాటు కనీస మద్దతుతో కేంద్ర సంస్థలయిన జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య (ఎన్‌సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్)లు కొంటాయనీ, అందుకుగాను రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకొంటాయనీ ప్రతిపాదించింది. దీనిని రైతు సంఘాలు ఒప్పుకోవడం లేదు. కేంద్రం మాత్రం ఈ ప్రణాళికను అమలు చేయాలనే గట్టి పట్టుదలతో ఉంది.

పంటమార్పిడి అన్నది అంత తేలికైనది కాదు. రైతులలో పంట మార్పిడి విధానంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ సహకారం అందాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న నమ్మకం రైతుల్లో కలగాలి. ఇందుకు చాలా సమయం పడుతుంది. ముఖ్యంగా, దేశంలోని అన్ని ప్రాంతాలలోని వ్యవసాయ భూములు పంట మార్పిడికి పూర్తి అనుకూలంగా లేవన్నది ఓ చేదు వాస్తవం. సమగ్రమైన అధ్యయనం, వాటి ఫలితాలు పరిశీలించిన తర్వాతనే పంటల మార్పిడి విధానం అమలు చేయాలే తప్ప, బలవంతంగా అమలు చేయాలనుకోవడం వల్ల ప్రతిఘటన ఎదురవుతుంది. నిజానికి, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించే విషయంలోనూ, ఇతర డిమాండ్ల పరిష్కారంలోనూ ఎన్డీఏ–2 ప్రభుత్వం ప్రదర్శించిన ఉదాసీనత కారణంగానే బీజేపీ ఈ ఎన్నికలలో 60 లోక్‌సభ స్థానాలకు పైగా నష్టపోయిందని పరిశీలకుల విశ్లేషణ. ప్రధానంగా... పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లోని మెజారిటీ స్థానాల్లో రైతాంగం బీజేపీని ఆదరించలేదు.

అయితే, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా కొలువుదీరిన ఎన్డీఏ–3 ప్రభుత్వం రైతాంగం చేస్తున్న డిమాండ్లను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుందా? లేక ఉద్యమాన్ని అణచివేస్తుందా అన్నదే కీలకం. ఎన్నికల ముందు దేశ రైతాంగాన్ని తమ హామీల ద్వారా తమ వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ కూటమి పక్షాలు (ఇండియా బ్లాక్) ప్రయత్నించినా అది పూర్తి స్థాయిలో ఫలించలేదు. ఈ నేపథ్యంలోనే దేశ రైతాంగం ఆశలు, ఆకాంక్షలు ఏమవుతాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తే ఏటా కేంద్ర ప్రభుత్వంపై రూ. 12 లక్షల కోట్ల అదనపు భారం పడుతుందని నీతి ఆయోగ్ తేల్చింది. దాదాపు రూ. 50 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో ఇంత మొత్తం కేటాయించడం అసాధ్యమే. పైగా, వ్యవసాయం అంటే కేవలం 23 పంటలే కాదు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, రొయ్యలు, పండ్లు, కూరగాయల మాటేమిటి? వాటికి ప్రోత్సాహకాలు అవసరం లేదా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

దేశంలో జరుగుతున్న రైతాంగ ఉద్యమాలు, వాటిపట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్నా రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయినట్లు 77వ జాతీయ నమూనా సర్వే వెల్లడించడం గమనార్హం. ఈ సర్వే ప్రకారం దేశంలోని చిన్న సన్న కారు రైతు కుటుంబాల నెలసరి ఆదాయం సగటున రూ. 10,218 మాత్రమే. రైతు కూలీల సగటు నెలవారీ ఆదాయం రూ. 4,063. ఆదాయాలు పెరగకపోవడం వల్ల వారికున్న రుణభారం తగ్గడం లేదు. ఫలితంగానే రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 2023లో 11,290 మంది, 2022లో 10,281 మంది, 2021లో 9,898 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. రైతుల ఆత్మహత్యల్లో పెరుగుదల 3.7 నుంచి 5.7 శాతంగా ఎన్‌సీఆర్‌బీ డేటా వెల్లడిస్తోంది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో 53 శాతం మంది రైతు కూలీలేనన్నది చేదు నిజం. రైతులు, అనుబంధ వృత్తికూలీల ఆదాయం పెరగకపోవడం కారణంగానే గ్రామీణ పేదరికం క్రమేపీ పెరుగుతున్నది. మోదీ చెప్పినట్లు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. ఇప్పట్లో హరియాణాకు తప్ప ఇతర ప్రధాన రాష్ట్రాలకు ఎన్నికలు లేవు కనుక... రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రైతులు డిమాండ్ చేస్తున్న ఎంఎస్‌పీకి చట్టబద్ధత ఓ ఎండమావిగానే మిగిలిపోతుందన్నది నిష్ఠుర సత్యం.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పూర్తి మద్దతు



కేవలం మాటలు కాదు, చర్యలు. రష్యా చేస్తున్న అక్రమ యుద్ధాన్ని అంతం చేయడానికి ఎంత కాలమైనా ఉక్రెయిన్‌కూ, జెలెన్‌స్కీకీ మద్దతిచ్చేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

– కీర్ స్టార్మర్, బ్రిటన్ ప్రధాని

కాలం మారుతుంది!



ప్రభుత్వాన్నో, అధికార పక్షాన్నో, లేదా దాని మాజీ నాయకులనో విమర్శించిన వాళ్లను గుడ్డిగా అరెస్టు చేస్తున్న పోలీసులు తెలుసుకోవాల్సింది ఏమిటంటే... ఒకరోజు మళ్లీ కాలచక్రం గిర్రున తిరుగుతుంది. పూర్తి పక్షపాత చర్యలకు పాల్పడ్డవారిని జవాబుదారీగా నిలబెడతామని తర్వాతి ప్రభుత్వం ప్రతిజ్ఞ చేయాలి. తమిళనాడు సర్కార్ పోలీసు రాజ్యమవుతోంది. కేవలం పూర్తిస్థాయి నేరస్థులే స్వేచ్ఛగా ఊపిరి తీసుకుంటున్నారు.

– సుమంత్ రామన్, హోస్ట్

నీళ్ల పాలేనా?



రానున్న బడ్జెట్‌లో బిహార్‌కు 30,000 కోట్లను నితీశ్ కుమార్ డిమాండ్ చేస్తున్నారని వార్త. మరో 10–12 వంతెనలను నిర్మించి, నాశనం చేయడానికి ఆ డబ్బు సరిపోతుందా?

– సుచేతా దలాల్, రచయిత్రి

క్యాండీ పీరియడ్



ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లాకు కొత్తగా నియమితులైన కలెక్టర్ ఒక ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్ ఫోన్‌ను బట్టి రెండు గంటలు క్యాండీ క్రష్ ఆడినట్టు, 30 నిమిషాలు సోషల్ మీడియాలో గడిపినట్టు, మరో 30 నిమిషాలు ఫోన్ కాల్స్‌లో ఉన్నట్టు తెలిసింది. ఆ టీచర్ సస్పెండయ్యారు... కానీ ప్రభుత్వోపాధ్యాయులకు చెడ్డపేరు ఎందుకు వస్తున్నదో ఈ ఘట్టం తెలియజేస్తోంది.

– స్వాతీ గోయల్ శర్మ, జర్నలిస్ట్

ఇప్పటి రష్యా



విప్లవాలు, సర్వోత్తమాల నేల అయిన రష్యా నుంచి తిరిగొచ్చాను. రూబుల్ పాలిస్తోంది. డాలర్లను అంగీకరించే హోటళ్లు దొరకడం సులభం కాదు. ఇంగ్లిష్ మాట్లాడేవాళ్లు దొరకడానికి సమయం పట్టింది. యువతీ యువకులు ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రేమిస్తున్నారు. రాజ్‌కపూర్ కంటే నమస్తే, యోగా ఇప్పుడు ఎక్కువ ప్రజాదరణలో ఉన్నాయి.

– వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

సుస్థిర జీవనం



ఈ ప్రపంచ జనాభా దినోత్సవం (జూలై 11) రోజున, జనాభా సమస్యలను సుస్థిర విధానాలతో పరిష్కరించాలని సంకల్పం చెప్పుకొందాం. మనం ఉమ్మడిగా అందరికీ నాణ్యమైన జీవనాన్ని అందించగలం.

– కఫీల్ ఖాన్, పిల్లల వైద్యుడు

పాక్ అకృత్యం



బలోచిస్తాన్‌లో పాకిస్తాన్ సైన్యపు అకృత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. పాకిస్తాన్ సైన్యం వల్ల కిడ్నాపునకు గురై కనబడకుండాపోయిన బలోచులను విడుదల చేయాలంటూ క్వెట్టాలో నిరసన జరుపుతున్న సాధారణ పౌరుల మీద పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరిపింది.

– ఫాజిలా బలోచ్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

మహోన్నత నైతిక శిఖరం



హెన్రీ డేవిడ్ థోరో

దశాబ్దాలు గడుస్తున్నా దేశ ప్రజాస్వామ్య ప్రయాణం ప్రజా ఆకాంక్షలు నెరవేర్చే దిశగా నడవ లేదనడం వాస్తవ దూరం కాదు. ప్రజా భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అందుకు ప్రజలే చొరవ చూపాలి. రాజకీయ, పాలనా వ్యవస్థలపై అవగాహన పెంచుకొని ఉద్యమించాలి. అందుకు అమెరికా తాత్త్వికవేత్త థోరో రచనలు బాగా దోహదం చేస్తాయి. ఆయన రచన 'సివిల్ డిబీడియన్స్' (శాసనోల్లంఘన) మహాత్మాగాంధీని అమితంగా ఆకర్షించింది. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చదువుతున్నప్పుడే దీన్ని చదివారాయన. దక్షిణాఫ్రికాలో ఆసియా వాసుల హక్కుల కోసం ఈ సిద్ధాంతాన్ని సంధించి పోరాటం చేశారు. శాసనోల్లంఘనను మాతృ భాషలోకి అనువదించి సహచరులకు అందించారు. 1919లో బ్రిటిష్‌వాళ్లు రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించినపుడూ, తరువాతి కాలం (1930)లోనూ శాసనోల్లంఘన సిద్ధాంతం అనుసరించి ఉద్యమం నిర్మించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు.

హెన్రీ డేవిడ్ థోరో అమెరికాలో 1817 జులై 12న పుట్టారు. నలభై నాలుగు ఏళ్ళు జీవించి 1862లో మరణించారు. సివిల్ డిసొబీడియన్స్ గ్రంథం మసాచుసెట్స్‌లో 1849లో ప్రచురితమయ్యింది. ఇది చిన్న పుస్తకం. కానీ బలమైన రాజకీయ రచన. మేల్కొలిపే తాత్విక చింతన. ప్రభుత్వం, రాజకీయ దోపిడీ, జైళ్ళు, అహింసా మార్గం, ప్రజల హక్కులు, పేదరికం, నైతిక విలువలు, యుద్ధం, అజ్ఞానం, మానవ సంబంధాల ప్రాముఖ్యం వంటి ఎన్నో ముఖ్య విషయాలు ఈ పుస్తకం ద్వారా థోరో మన ముందు ఉంచారు. ఈ రచన వచ్చి 175 ఏళ్ళు అయింది. దీనిలోని 'నామమాత్రంగా పాలించే ప్రభుత్వమే ఉత్తమ ప్రభుత్వం. ఇదే నా ఆదర్శం. ప్రభుత్వం అతి తొందరగా ఆ విధంగా పాలించేటట్లు చేయుటే నా అభిలాష.' అనే ప్రారంభ వాక్యాలు సమకాలిక రచయిత జాన్ స్టువార్ట్ మిల్ అన్నవి. థోరో కవి, తాత్వికుడు, వ్యాసకర్త, ప్రకృతి ప్రేమికుడు. ఆయన ఏం చెప్పాడో అదే ఆచరించిన మహోన్నత నైతికశిఖరం.

మన కులపోడనో, ఊరి వాడనో, రాజ వంశీకుడనో, ఫలానా పార్టీ వాడనో, మతం వాడనో, సినీ నటుడనో, ప్రలోభాలకు లొంగో ఓటు వేసి గెలిపించి చట్ట సభకు పంపితే వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో చూస్తున్నాం. ఆ చేదు ఫలితాలు అనుభవిస్తున్నాం. ఎన్నికలు చేసే మంచి ఎంత? ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానంతో వచ్చే మంచి చెడులు ఏమిటి అనేది మనం తెలుసుకోవాలి. వీటిని థోరో తన రచనలో చర్చించారు. శాసనోల్లంఘన రచనలోని ప్రజాస్వామ్య భావనలు జీర్ణించుకొని, నైతికంగా ఎదిగి, లోపాలు చక్కదిద్దుకోవడానికి మనం తయారైతే సమాజ వికాసం జరుగుతుంది.

– వి. వరదరాజు, శ్రీకాకుళం

బాలల భద్రత తక్షణ కర్తవ్యం

అభిప్రాయం



శ్రీనివాస్ మాధవ్

ఎన్ని చట్టాలు వచ్చినా పిల్లలపై ఘోరాలు కొనసాగుతూ ఉండడం బాధాకరం. జూన్ నెలలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్‌మిల్ దగ్గర ఆరేళ్ల బాలిక, మియాపూర్ నడిగడ్డ తండా వద్ద 12 ఏళ్ల బాలిక లైంగిక హింస, హత్యలకు గురవ్వడం ప్రజలు ఇంకా మర్చిపోలేదు. వలస వెళ్ళిన నిరు పేద కుటుంబాలకు చెందిన ఈ బాలికలు సామజిక మాధ్యమాల మద్దతుకు కూడా నోచుకోలేదు.

తెలంగాణ రాష్ట్రానికి ఇంతవరకూ ఒక బాలల పరిరక్షక విధానం లేదు. సమగ్ర విధానం రూపొందించి, రాష్ట్రంలోని అన్ని సంస్థలలో అమలు పరిచేట్లు చూడటం బాలలపై లైంగిక నేరాలనుంచి రక్షణ (పోక్సో) చట్టం – 2012, నిబంధన 3 (5) ప్రకారం తప్పనిసరి. పోక్సో చట్టం ప్రకారం బాల స్నేహపూర్వక ప్రత్యేక న్యాయస్థానాలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి. పోక్సో చట్టం సెక్షన్ 19 ప్రకారం ఏదైనా సంస్థ పరిధిలో బాలలపై నేరం జరిగినా, జరిగే అవకాశం ఉన్నా ఆ సంస్థ అధిపతి లేక యజమాని వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఈ బాధ్యత నిర్వహణలో విఫలమైతే ఏడాది జైలుశిక్ష విధించవచ్చు. పోక్సో చట్టం నిబంధన 3 (4) ప్రకారం బాలలు సందర్శించే అన్ని సంస్థలు, పాఠశాలలు, క్రెష్‌లలో సిబ్బంది, ఉపాధ్యాయులకు ఏమైనా నేర చరిత్ర ఉన్నదా అని పోలీసు శాఖచే వారి నేపథ్య తనిఖీ క్రమబద్ధంగా చేయడం తప్పనిసరి.



చట్ట పరమైన రక్షణ, పోక్సో చట్టం కింద పడేశిక్షల తీవ్రత గురించి అవగాహన పెంచితే నేరాలు తగ్గవచ్చు.

18 ఏళ్ళ లోపు బాలలపై లైంగిక హింస చేస్తే 20 ఏళ్ళ వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ నేరం బంధువులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల సిబ్బంది, వసతి గృహ సిబ్బంది చేస్తే మరణ శిక్షకు ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే తమిళనాడు, గుజరాత్, బిహార్, మహారాష్ట్ర రాష్ట్రాలలో పోక్సో చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానాలు త్వరితంగా విచారణ పూర్తి చేసి బాలలపై లైంగిక దాడి చేసిన నేరస్థులకు మరణ శిక్షలు విధించాయి.

ఆంధ్రప్రదేశ్ 2019లో 'దిశ' హత్యకు ప్రతిస్పందనగా 'దిశ చట్టం' (ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా (సవరణ) చట్టం–2019), మహారాష్ట్ర 'శక్తి క్రిమినల్ చట్టాల (మహారాష్ట్ర సవరణ) చట్టం 2020' అమలు చేసే ప్రయత్నం చేశాయి. ఈ చట్టాల ప్రకారం బాలలు, మహిళలపై జరిగిన నేరాల పరిశోధన, న్యాయ విచారణ త్వరితంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రపతి అనుమతి రానందున ఈ రెండు చట్టాలు అమలు లోకి రాలేదు.

నారాయణపేట జిల్లాలో జూన్ 13న సంజీవ్ అనే వ్యక్తిపై ప్రాణాంతక దాడి జరుగుతున్న సమయంలో 100 నంబర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదని తెలిసింది. తెలంగాణలో '112 ఇండియా', 'దిశ' వంటి ఎమర్జెన్సీ యాప్‌లను వెంటనే అందుబాటులోకి తీసుకు రావాలి. ఆంధ్రప్రదేశ్ దిశ యాప్ 1.5 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ మధ్య ప్రవేశపెట్టిన టీ–సేఫ్ యాప్ ప్రయాణాల్లో అత్యవసర సాయం కోసం, హెల్ప్ లైన్ 100 డయల్ చేసేందుకు పని చేస్తుంది. కానీ 112 ఇండియా, దిశ వంటి యాప్‌లలో పోలీసులతో పాటు ఇతరులకు కూడా తక్షణ సమాచారం చేరవేసే అవకాశం ఉంది. ఫోన్ గట్టిగా ఊపడం ద్వారా కూడా తక్షణ సందేశం పంపవచ్చు. మొబైలు ఫోన్ హ్యాండ్ సెట్ ప్యానిక్ బటన్, జీపీఎస్ నిబంధనలు– 2016 ప్రకారం... ఫీచర్ ఫోన్‌లో 5 లేక 9 నంబర్‌ను స్మార్ట్ ఫోన్‌లో అయితే ఆన్–ఆఫ్ మీట 3 సార్లు నొక్కితే పోలీసు అత్యవసర హెల్ప్ లైన్‌కు సందేశం వెళ్ళాలి. ఈ విషయంపై ప్రజలలో అవగాహన అవసరం. ఏ దేశానికైనా అత్యంత విలువైన ఆస్తిపాస్తులు బాలలు. వారిని కాపాడటం కోసం అన్ని మార్గాలూ వెదకాలి.

వ్యాసకర్త ఆర్టీఐ కార్యకర్త | 9247 159 343

స్థితప్రజ్ఞత

జ్యోతిర్మయం

మహావీరుడు, ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ ఓ యుద్ధంలో పరాజయాన్ని చవిచూసి సెయింట్ హెలీనా అనే దీవిలో యుద్ధ ఖైదీగా ఉన్న కాలమది. ఆయన ఆరోగ్యాన్ని గమనించడానికి ఓ డాక్టర్ని నియమించారు. ఓరోజు నెపోలియన్, డాక్టరూ కలిసి ఓ బహిరంగ ప్రదేశంలో నడుచుకుంటూ పోతున్నారు. కాసేపటికి వారిద్దరూ ఓ ఇరుకు మార్గంలోకి చేరుకున్నారు. అప్పుడు ఎదురుగా ఒక సాధారణ మహిళ నడుచుకుంటూ వస్తోంది. పక్కకు తప్పుకుని నెపోలియన్ తనకు దారి ఇస్తారని అనుకుంది ఆ స్త్రీ. కానీ డాక్టర్ ఆమెతో 'ఇదిగో ఆయన ఎవరనుకున్నావు... నెపోలియన్ చక్రవర్తి. పక్కకు తప్పుకో. ఆయన ముందుకు పోవడానికి నువ్వే పక్కకు తప్పుకోవాలి' అన్నాడు.

వెంటనే నెపోలియన్ 'ఇప్పుడు మీతో ఉన్నది నెపోలియన్ చక్రవర్తి కాదు. ఓ మామూలు వ్యక్తి అయిన నెపోలియన్. ఇతరులు పక్కకు తప్పుకుని నాకు దారివ్వాల్సిన స్థితి కాదిప్పుడు నాది. ఓ మామూలు స్త్రీ కైనా నేనే పక్కకు తప్పుకుని దారివ్వక తప్పదు. అలా దారివ్వడం వల్ల నేనేమీ బాధ పడబోన'ని చెప్పాడు.

నెపోలియన్ తన జీవితంలో హెచ్చుతగ్గులను ఒకేలా చూసి పరిస్థితికి తగినట్లే వ్యవహరించిన వ్యక్తి. 'ఎప్పుడూ గెలుపు నా పక్షమే అని అనుకోను. ఓటమిని చవిచూడడం నాకు తెలుసు. గెలుపోటములను ఒకేలా చూసిన వ్యక్తిని నేను' అని చెప్పాడు. ఈ మానసిక పరిపక్వత కలవారిని స్థితప్రజ్ఞుడిగా భగవద్గీత చెప్పనే చెప్పింది. విజయం సాధించినప్పుడు విర్రవీగలేదు. పరాభవం పొందినప్పుడు డీలా పడలేదు. రెండిటినీ సమానంగా చూశాడు. స్వీకరించాడు. ఈ మానసిక పరిపక్వత వల్ల జీవితంలో దేన్నయినా అధిగమించవచ్చు. అది మనిషిని దెబ్బతీయదు. పైపెచ్చు ఎప్పుడూ నిలకడగా ఉంచుతుంది.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

నాపై కోపంతోనే నాడు కేసీఆర్ నిధులివ్వలేదు

● మంత్రి కోమటిరెడ్డి ఆరోపణ


తిప్పర్తిలో మొక్క నాటుతున్న మంత్రి కోమటిరెడ్డి

రామగిరి (నల్లగొండ): పదేళ్ల అధికారంలో ఉన్న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై కోపంతోనే నల్లగొండకు నిధులు ఇవ్వలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా తిప్పర్తిలో గురువారం నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కలు నాటిన అనంతరం పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మూడు నెలలు ఎలక్షన్ కోడ్ ఉండటం వల్ల అభివృద్ధి పనులు చేయలేకపోయామన్నారు. తనపై గౌరవంతో నల్లగొండ జిల్లాను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యధిక నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రెండేళ్లలో సాగు, తాగు నీటి సమస్యలను తీర్చుతానని ఈ సందర్భంగా హామీనిచ్చారు.

హాస్టల్ విద్యార్థినులను కరిచిన ఎలుకలు


కాలిపై ఎలుక కొరికిన గాయం

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా రామాయంపేటలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన హాస్టల్‌లో ఒకే గదిలో నిద్రిస్తున్న తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. మొత్తం 12 మంది విద్యార్థినులు గాయపడగా ఈ విషయాన్ని బయటకు తెలియకుండా జాగ్రత్త పడిన హాస్టల్ సిబ్బంది వారిని గురువారం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే విద్యార్థినుల తల్లిదండ్రులకు విషయం తెలిసిపోవడంతో వారు హాస్టల్‌కు వచ్చి ప్రిన్సిపాల్ సరళాదేవిని నిలదీయగా అసలు విషయం ఒప్పుకున్నారు. ఎలుకల నివారణ కోసం బోన్లతోపాటు ప్యాడ్లు తెప్పించామని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు. తహసీల్దార్ రజనీకుమారి హాస్టల్‌కు వచ్చి వివరాలు సేకరించారు.

అందరి మాటతోనే 'భరోసా'

రైతుభరోసాపై మాకు మేము నిర్ణయాలు తీసుకోవట్లేదు..

- క్షేత్రస్థాయిలో రైతులిచ్చే అభిప్రాయాలే పరిగణనలోకి..
- ఇప్పటివరకు పరిమితులు ఖరారు కాలేదు
- పేద, బడుగువర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుభరోసా విస్తృతస్థాయి సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


ఉట్నూర్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు తుమ్మల, సీతక్క

సాక్షి, ఆదిలాబాద్: 'రైతు భరోసాను నిర్దిష్టంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఈ విషయంలో ఓపెన్ మైండ్‌తో ఉన్నాం. మాకు మేము ఏదో నిర్ణయం తీసుకోవడం లేదు. అందరితో చర్చించి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలనే సదుద్దేశంతోనే ఉన్నాం. అన్ని జిల్లాల్లో కేబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజాక్షేత్రంలో అభిప్రాయాలు సేకరించి...అసెంబ్లీలో నివేదిక పొందుపరుస్తాం. రైతుభరోసా పేద, బడుగువర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. రైతు భరోసా పథకానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదు. గ్రామం యూనిట్‌గా తీసుకోవాలని ఎక్కువమంది రైతులు సూచిస్తున్నారు.. పోడు రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం.'అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులోని కుమురంభీం కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల నుంచి అభిప్రాయాలు, సలహాలను కేబినెట్ సబ్ కమిటీ సేకరించింది. ఈ కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల్లో కీలకమైన రైతుభరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి తీరుతామని డిప్యూటీ సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్నివర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరోమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడు తూ ఇంకా ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు రైతులకు భూమికి సంబంధించి సరైన పత్రాలు కూడా లేవని తెలిపారు. ఇలా అన్ని విషయాల్లోనూ ఆలోచన చేస్తామని చెప్పారు. ఎకరం భూమి లేకున్నా, ఏదో ఒకవిధంగా సాగు చేస్తున్న రైతులకు లబ్ధి చేకూర్చాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కోరారు.

ఎంపిక చేసిన వారితోనే మాట్లాడించారు

ఎంపిక చేసిన రైతులతోనే మాట్లాడిస్తున్నారని నిజమైన రైతులతో మాట్లాడించడం లేదని కొందరు ఆరోపించారు. దీంతో స్పెషల్ రోప్ పార్టీ పోలీసులు ఎంటర్ అయ్యారు. వేదిక ముందు ప్రజాప్రతినిధులకు రక్షణగా ఇటువైపు నుంచి అటు వైపు వరకు కూర్చున్నారు. కాగా రైతులను తాము ఎంపిక చేయలేదని, వ్యవసాయ అధికారులే గుర్తించారని ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. కాగా కేబినెట్ సబ్‌కమిటీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

వైఎస్ అమలు చేసిన కౌలురైతు చట్టాన్ని తీసుకురావాలి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 2011లో అమలు చేసిన కౌలు రైతు చట్టాన్ని తీసుకురావాలని రైతులు, రైతు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాగుచేస్తున్న వారిలో 30 నుంచి 40 శాతం మంది కౌలురైతులే ఉన్నారని వివరించారు. 95 శాతం ఆత్మహత్యలు కౌలు రైతులవేనని పేర్కొన్నారు. పట్టాదారులకు భరోసా కల్పించి కౌలు రైతులకు న్యాయం చేయాలని మంత్రివర్గ ఉప సంఘాన్ని కోరారు. రైతు భరోసానే కాకుండా మిగతా వాటి విషయంలోనూ కౌలు రైతులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పహాణీలు, పోడు భూముల సమస్య కారణంగా మెజారిటీ రైతులు ప్రభుత్వ సాయం పొందలేకపోతున్నారన్నారు. పేద, దళిత, గిరిజన రైతులకు రైతు భరోసా అందించాలని పలువురు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకంగా తీసుకొని పదెకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు.

రాష్ట్రానికి రూపాయి సాయం చేశారా ?

- పదేళ్లలో హైదరాబాద్ అభివృద్ధికి మీరు చేసిందేంటి?
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై రాష్ట్ర మంత్రి పొన్నం ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గత పదేళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం రూపాయి సాయం చేసిందా అని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన నేతగా, కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా గత ఐదేళ్లలో హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ విభాగాలకు ఎన్ని నిధులు తెచ్చారో కిషన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంతో అంటకాగి హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసింది బీజేపీ కాదా అని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం వద్దకు వెళ్లి నిధులు కావాలని అడిగామని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే కిషన్‌రెడ్డి ఇప్పుడు రాజకీయ ఆట ఆడుతున్నారని విమర్శించారు.

'కాళేశ్వరం'లో 50 మందికిపైగా సబ్ కాంట్రాక్టర్లు

- గుర్తించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- కమిషన్‌కు పీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్న కె.రఘు, వెదిరె శ్రీరాం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో 50 మందికి పైగా సబ్ కాంట్రాక్టర్లు పాలుపంచుకున్నారని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ గుర్తించింది. బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలపై విచారణ తుది అంకానికి చేరుకుంది. దీంతో ఆర్థికపరమైన అవకతవకలపై కమిషన్ దృష్టి సారించింది. బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బరాజ్‌ల పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థలు చాలా పనులను నిబంధనలకు విరుద్ధంగా సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించినట్టు కమిషన్ నిర్ధారణకు వచ్చింది. గత ప్రభుత్వంలోని ఓ ముఖ్యనేత సమీప బంధువులకు చెందిన కంపెనీలు సైతం సబ్ కాంట్రాక్టులు పొందాయని గుర్తించినట్టు తెలిసింది. తొలుత జారీచేసిన పరిపాలనాపర అనుమతుల ప్రకారం బరాజ్‌ల నిర్మాణానికి అంచనా వ్యయం ఎంత? ఆ తర్వాత ఎన్నిసార్లు పెంచారు? ఎంత పెంచారు? గడువులోగానే పనులు పూర్తి చేసినప్పుడు అంచనా వ్యయం పెంచాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? సబ్ కాంట్రాక్టర్లకు ఏ పనులు కట్టబెట్టారు? వారికి ఎంత చెల్లించారు? ఈ వ్యవహారంలో అవకతవకలు ఏమైన జరిగాయా? వంటి అంశాలపై ఆరా తీస్తోంది. బరాజ్‌ల ఆర్థిక వ్యవహారాలపై మరింత లోతుగా విచారణ నిర్వహించడానికి ఒక చార్టర్డ్ అకౌంటెంట్‌ను కమిషన్ కార్యాలయంలో నియమించాలని ప్రభుత్వాన్ని కోరింది. సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్‌లో కమిషన్‌కు సహకరించడానికి తెలంగాణ(కాళేశ్వరం ప్రాజెక్టు), పశ్చిమబెంగాల్(జస్టిస్ ఘోష్ సొంత రాష్ట్రం)తో సంబంధం లేని సీనియర్ న్యాయవాదిని సైతం నియమించాలని కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 పంప్‌హౌజ్‌ల పనులను నిర్వహించిన ఓ నిర్మాణ సంస్థకు సంబంధించిన వైస్‌ప్రెసిడెంట్‌తో సహా మరో ఇద్దరు ఉన్నత అధికారులను జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ గురువారం తన కార్యాలయంలో విచారించింది. పంప్‌హౌజ్‌ల నిర్మాణ స్థలం ఎంపిక, డిజైన్లు తదితర అంశాలపై కమిషన్ వారిని ప్రశ్నించగా, ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలం, అందించిన డిజైన్ల ప్రకారమే వాటిని నిర్మించినట్టు ఆ కంపెనీ ప్రతినిధులు బదులిచ్చినట్టు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించిన బిల్లుల జారీతో సంబంధం ఉన్న వర్క్ అండ్ అకౌంట్స్ విభాగం డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మను సైతం కమిషన్ విచారించింది.

● విద్యుత్‌రంగ నిపుణుడు కె.రఘు ఈ నెల 15న, కేంద్ర జలశక్తిశాఖ మంత్రి మాజీ సలహాదారుడు వెదిరె శ్రీరాం ఈ నెల 16న కమిషన్ ముందు హాజరై కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందించనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి వీరు అనుమతి కోరగా, కమిషన్ అందుకు ఏర్పాట్లు చేస్తోంది.

నేడు కమిషన్ ఎదుట రహస్య సాక్షి

బరాజ్‌ల నిర్మాణంలో లోపాలను వ్యతిరేకిస్తూ తన ఉద్యోగాన్ని వదులుకున్న ఓ నిర్మాణ సంస్థలోని కీలక ఉద్యోగి శుక్రవారం కమిషన్ ముందు హాజరై తన వాదనలు వినిపించనున్నారు. తన వద్ద ఉన్న సమాచారాన్ని కమిషన్‌కు అందించనున్నారు. ఆయన వివరాలను కమిషన్‌వర్గాలు గోప్యంగా ఉంచాయి.

కత్తిదూసిన ఉన్మాదం

వేటకొడవలితో నరికి దంపతుల దారుణహత్య

- మనస్పర్థలతో వేరుపడిన ప్రేమజంట
- అప్పటి నుంచి యువతి కుటుంబంపై కక్ష పెంచుకున్న యువకుడు
- ఆమె తల్లిదండ్రులను హతమార్చిన వైనం
- యువతికి, ఆమె సోదరుడికి తీవ్ర గాయాలు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


హత్యకు గురైన దంపతులు భానోతు శ్రీనివాస్, సుగుణ


హత్యకు వాడిన వేట కొడవలి

చెన్నారావుపేట: ఓ ఉన్మాది చేతిలో భార్యాభర్తలు దారుణ హత్యకు గురయ్యారు. యువతి, ఆమె సోదరుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారుచింతల్‌తండా గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. తండాకు చెందిన భానోతు శ్రీనివాస్(40), సుగుణ(35) దంపతులకు కూతురు దీపిక, కుమారుడు మదన్‌లాల్ ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. దీపిక డిగ్రీ సెకండియర్, కుమారుడు మదన్‌లాల్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. కాగా.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు(బన్ని)తో దీపిక ప్రేమలో పడింది. నాగరాజు తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వలస వెళ్లగా నాగరాజు గ్రామంలోనే ఉంటున్నాడు. గత నవంబర్‌లో నాగరాజు, దీపిక వెళ్లిపోయి కులాంతర వివాహం చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జనవరిలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోవడమే కాకుండా.. చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. అనేక మార్లు పెద్ద మనుషుల మధ్య పంచాయితీ జరిగింది. ఒకరి జోలికి ఒకరు వెళ్లకుండా ఉండాలని తీర్మానం చేశారు. అప్పటి నుంచి దీపిక కుటుంబంపై కక్ష పెంచుకున్న నాగరాజు.. బుధవారం అర్ధరాత్రి పదహారుచింతల్‌తండాకు చేరుకున్నాడు. ఆరుబయట నిద్రిస్తున్న దీపిక, ఆమె తల్లిదండ్రులు భానోతు శ్రీనివాస్, సుగుణపై వేట కొడవలితో దాడి చేశాడు. ఆ అలజడికి ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు మదన్‌లాల్ బయటికి రాగా అతడిపైనా దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు శ్రీనివాస్‌ను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. తీవ్రంగా గాయపడిన దీపిక, మదన్‌లాల్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు!

నిందితుడు నాగరాజు గుండెంగ ప్రభుత్వ పాఠశాల వరండాలో తెల్లవారు వరకు ఉన్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడికి చేరుకున్నారు. అతడితో పాటు హత్యకు ఉపయోగించిన వేటకొడవలి, ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడిని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నర్సంపేటలో పోలీస్ స్టేషన్ వద్ద, వరంగల్ రోడ్డ జంక్షన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ ఘటనస్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. ఫోన్‌లో కలెక్టర్ సత్యశారదాదేవితో మాట్లాడించి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, గురువారం రాత్రి నాగరాజును అదుపులోకి తీసుకున్నామని డీసీపీ రవీందర్ తెలిపారు. కాగా గురువారం పొద్దుపోయాక మృతులిద్దరి అంత్యక్రియలను స్వగ్రామంలో పూర్తి చేశారు. కూతురు దీపిక తల్లిదండ్రుల మృతదేహాలకు తలకొరివి పెట్టారు.

పక్కా వ్యూహంతోనే హత్యలకు ప్లాన్

ఇద్దరూ విడిపోయాక హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయిన నాగరాజు నెల రోజుల క్రితం మళ్లీ గుండెంగ గ్రామంలో అమ్మమ్మ ఇంటికి చేరుకుని ఆటోను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దీపికకు వివాహ సంబంధాలు చూస్తున్నారనే విషయం తెలుసుకున్న నాగరాజు ఆమె కుటుంబంపై పగ తీర్చుకోవాలని పక్కా వ్యూహంతోనే రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది.

నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తాం: సీతక్క

హన్మకొండ: జంట హత్యలపై మంత్రి సీతక్క తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, దాడిలో గాయపడిన యువతికి, ఆమె సోదరుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపిన సీతక్క, బాధిత కుటుంబానికి రక్షణ కల్పిస్తామని వివరించారు.

బతిమిలాడినా వినలేదు.. నాగరాజును చంపేయాలి: దీపిక

నాకు తల్లిదండ్రులను లేకుండా చేసిన నాగరాజును చంపేయాలి.. మాకు వాటర్‌ప్లాంట్ నుంచి వాటర్ పోసేందుకు తండాకు వచ్చేవాడు. అలా పరిచయం అయిన తర్వాత నెక్కొండకు వెళ్లే క్రమంలో వెంటపడేవాడు. నన్ను హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఏడు నెలలైనా పెళ్లి చేసుకోలేదు. ఇద్దరికీ కుదరలేదు. హైదరాబాద్ నుంచి వచ్చాక తల్లిదండ్రులతో ఉంటున్నా. బుధవారం రాత్రి అమ్మా, నేను, నాన్న బయట పడుకున్నాం. నాపై ఉన్న దుప్పటి తొలగించగా అరవడంతో అమ్మ లేచింది. బతిమిలాడుతున్నా కత్తితో దాడికి పాల్పడ్డాడు. నేను భయంతో నానమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి అక్కడ స్పృహ తప్పి కిందపడిపోయా. ఆ తర్వాత లేచి సమీపంలో ఉన్న వదిన వాళ్ల ఇంటికి వెళ్లాను.. అక్కడికి సైతం వచ్చి పిలిచాడు. వాళ్లు నన్ను బయటకు రానివ్వలేదు. అందరు లేచి అరవడంతో పరారయ్యాడు.

క్రిటికల్ మినరల్ సెంటర్ ఏర్పాటుకు సహకారం

● మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీ – ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో భట్టి విక్రమార్కతో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్, ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు మూర్తి, నరసింహ, అశోక్ కామరాజ్, మోనాష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎలిశెట్టి మోహన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ, ఐఐటీ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి దృష్టికి క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన పలు అంశాలను తీసుకువచ్చారు. ప్రధానంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పాదనలో దేశం బాగా వెనకబడి ఉందని, స్ట్రాటజిక్ అప్లికేషన్ మినరల్స్ అండ్ మెటల్స్ ను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. బ్యాటరీల్లో ఉపయోగించే లిథియం, సెమీకండక్టర్ల తయారీ కోసం ఉయోగించే గ్యాలియం, పర్మినెంట్ బ్యాటరీల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మెటల్స్ ను మనమే సొంతంగా తయారు చేసుకుంటే దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సాంకేతికంగా దేశ పురోభివృద్ధికి ఉపయోగపడుతుందని వివరించారు. కీలకమైన క్రిటికల్ మినరల్స్ ను చైనా నుంచి వంద శాతం దిగుమతి చేసుకుంటున్నామని, దీనివల్ల ఆర్థికంగా భారం పడుతోందని తెలిపారు.



శివాని రాజా. ఇన్‌సెట్లో ప్రమాణం చేస్తున్న దృశ్యం

భగవద్గీత సాక్షిగా...

బ్రిటన్ ఎంపీగా కన్జర్వేటివ్ పార్టీ నేత శివాని రాజా ప్రమాణ స్వీకారం

భగవద్గీత గ్రంథంపై ప్రమాణం చేసిన రిషి సునాక్ సహా మరికొందరు ఎంపీలు

సిక్కు మత గ్రంథాలపై బ్రిటిష్-సిక్కు ఎంపీల ప్రమాణం

లండన్: బ్రిటిష్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలు గురువారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. విపక్ష కన్జర్వేటివ్ పార్టీ నేత, భారత సంతతి యువ ఎంపీ శివాని రాజా హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 29 ఏళ్ల శివాని రాజా లీసెస్టర్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. లేబర్ పార్టీకి కంచు కోట లాంటి ఈ స్థానంలో 37 సంవత్సరాల తర్వాత కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి జయకేతనం ఎగురవేయడం గమనార్హం. శివాని రాజాకు, కన్జర్వేటివ్ పార్టీకి ఇదొక చరిత్రాత్మక విజయమని చెప్పొచ్చు. ప్రమాణ స్వీకారం వీడియోను ఆమె 'ఎక్స్'లో పోస్టు చేశారు. లీసెస్టర్ ఈస్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. బ్రిటన్ రాజు చార్లెస్-3కి విధేయత ప్రకటిస్తూ ప్రజా ప్రతినిధిగా భగవద్గీతపై ప్రమాణం చేయడం గర్వంగా ఉందన్నారు.

రాజేశ్‌పై 4,426 ఓట్ల తేడాతో విజయం

శివాని రాజా 1994లో ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ సిటీలో జన్మించారు. గుజరాత్ మూలాలున్న ఆమె తండ్రి 1970వ దశకంలో కెన్యా నుంచి ఇంగ్లండ్‌కు వలస వెళ్లారు. ఆమె తల్లి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జన్మించారు. శివాని కుటుంబం లీసెస్టర్‌షైర్‌లో స్థిరపడింది. డి మాంట్‌ఫోర్ట్ యూనివర్సిటీలో శివాని ఫార్మాస్యూటికల్, కాస్మెటిక్ సైన్స్‌లో డిగ్రీ చదివారు. పలు కాస్మెటిక్ సంస్థల్లో పనిచేశారు. ఆమె కుటుంబానికి చెందిన నిర్మాణం, అతిథ్య రంగ కంపెనీల్లో సేవలందించారు. కన్జర్వేటివ్ పార్టీలో చేరి చురుగ్గా పనిచేస్తుండడంతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కింది. తాజా ఎన్నికల్లో లీసెస్టర్ ఈస్ట్ నియోజకవర్గంలో లేబర్ పార్టీ అభ్యర్థి రాజేశ్ అగర్వాల్‌పై నెగ్గారు. ఇక్కడ 37 ఏళ్ల తర్వాత తన పార్టీకి విజయం సాధించిపెట్టారు. శివానికి 14,526, రాజేశ్ అగర్వాల్‌కు 10,100 ఓట్లు లభించాయి. ఎన్నికల ప్రచారంలో శివాని భారత సంతతి ఓటర్లతో మమేకమయ్యారు. సంప్రదాయ గార్బా నృత్య వేడుకల్లో పాల్గొన్నారు. హిందూ ఆలయాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. తన భారతీయ మూలాలను పలు సందర్భాల్లో వ్యక్తీకరించారు. తనను ఎంపీగా గెలిపిస్తే రహదారులు, ఆసుపత్రులను అభివృద్ధి చేస్తానని, వివిధ వర్గాల ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపరుస్తానని ప్రజలకు శివాని రాజా హామీ ఇచ్చారు.

స్పీకర్‌కు భగవద్గీత బహూకరణ

బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి 29 మంది భారత సంతతి నాయకులు గెలిచారు. పలువురు ఎంపీలుగా ప్రమాణ స్వీకారంచేశారు. శివాని రాజాతోపాటు బాబ్ బ్లాక్‌మన్, కనిష్క నారాయణ్, మాజీ ప్రధాని రిషి సునాక్ భగవద్గీతపై ప్రమాణం చేశారు. మాజీ ఎంపీ శైలేష్ వర నూతన భగవద్గీత గ్రంథాన్ని స్పీకర్ లిండ్సే హోలీకి బహూకరించారు. ఈ పుస్తకానికి భారత్‌లోని ఆలయంలో పూజలు చేసి తీసుకొచ్చినట్లు తెలిపారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో బ్రిటిష్-సిక్కు ఎంపీలు తాన్ ధేశి, గురిందర్‌సింగ్ జోసన్, హర్‌ప్రీత్ ఉప్పల్, సత్వీర్ కౌర్, వారిందర్‌సింగ్ జస్, ప్రీత్‌కౌర్ గిల్ తదితరులు పవిత్ర సిక్కు గ్రంథాలపై ప్రమాణం చేశారు. కేరళకు చెందిన సోజన్ జోసెఫ్ బైబిల్ కొత్త నిబంధన సాక్షిగా ప్రమాణం చేశారు. ప్రీతి పటేల్, క్లెయిర్ కొటిన్హో, మునీరా విల్సన్ 'కింగ్ జేమ్స్ బైబిల్'పై ప్రమాణం చేశారు.

సూదిమొనపై ఎయిడ్స్ భూతం

త్రిపురలో 800 మంది విద్యార్థులకు పాజిటివ్ • 47 మందిని కబళించిన హెచ్ఐవీ • మాదకద్రవ్యాల వాడకం మాటున విస్తరిస్తున్న ప్రాణాంతక వ్యాధి

చిన్న నిర్లక్ష్యం ఒక జీవితాన్నే తారుమారు చేస్తుంది. అలాంటిది భావిభారత పౌరులుగా ఎదగాల్సిన పాఠశాల విద్యార్థులు భయానక ఎయిడ్స్ భూతం బారిన పడితే ఆ పెను విషాదానికి అంతే ఉండదు. అలాంటి విపత్కర పరిస్థితిని ఈశాన్య రాష్ట్రం త్రిపుర ఎదుర్కొంటోంది. అక్కడి విద్యార్థుల పాలిట హెచ్ఐవీ వైరస్ మహమ్మారి పెద్ద శత్రువుగా తయారైంది. 800 మందికిపైగా విద్యార్థులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన కఠోర వాస్తవం అక్కడి రాష్ట్ర ప్రజలకు మాత్రమేకాదు యావత్‌భారతావనికి దుర్వార్తను మోసుకొచ్చింది. ఇంజెక్షన్ రూపంలో తీసుకునే మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల్లో పెచ్చరిల్లడమే ఈ వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమని రాష్ట్ర నివేదికలో బట్టబయలైంది. త్రిపుర రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నివేదిక అక్కడి దారుణ పరిస్థితులను కళ్లకు కట్టింది. పాఠశాల, కాలేజీ స్థాయిలోనే మాదకద్రవ్యాల విచ్చలవిడి వినియోగాన్ని అడ్డుకోలేక ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర పోతోందని జనం దుమ్మెత్తిపోస్తున్నారు. 828 మంది విద్యార్థులకు వైరస్ సోకిందని, వారిలో 47 మంది మరణించారని ప్రభుత్వం చెబుతోంది. 572 మంది విద్యార్థులు ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. అయితే వీరిలో చాలా మంది ఇప్పటికే పాఠశాల విద్యను పూర్తిచేసుకుని ఉన్నత చదువులకు రాష్ట్రాన్ని వీడారని ప్రభుత్వ అధికారి ఒకరు తాజాగా వెల్లడించారు. దీంతో వీరి వల్ల ఇతర రాష్ట్రాల్లో ఇంకెంత మందికి వ్యాధి సోకుతుందోనన్న భయాందోళనలు ఎక్కువయ్యాయి.

విద్యార్థుల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం

''త్రిపురలో ఏటా వందల హెచ్ఐవీ పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి. ఇటీవలికాలంలో పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఎక్కువగా హెచ్ఐవీ సోకుతోంది. ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకునే విష సంస్కృతి ఇక్కడ విస్తరించింది. హెచ్ఐవీ సోకిన వ్యక్తి వాడిన ఇంజెక్షన్‌ను ఇంకొక వ్యక్తి వాడటం ద్వారా హెచ్ఐవీ సోకడం చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. 2015-2020 కాలంలో ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ వాడకం(ఐడీయూ) 5 శాతముంటే కోవిడ్ తర్వాత అంటే 2020-23లో అది రెట్టింపు అయింది. హెచ్ఐవీ/ఎయిడ్స్ పాజిటివ్ రేట్ కూడా పెరిగింది. శృంగారం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి తగ్గింది. సెక్స్ ద్వారా వ్యాప్తి రేటు గత ఏడాది 2శాతం కూడా లేదు. కానీ సూది ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి చాలా ఎక్కువైంది'' అని త్రిపుర రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ సమర్పితా దత్తా వెల్లడించారు. గత దశాబ్దంతో పోలిస్తే 2023 జూలైలో ఎయిడ్స్ బాధితుల సంఖ్య 300 శాతం పెరగడం రాష్ట్రంలో హెచ్ఐవీ ఎంతగా కోరలు చాచిందనే చేదు నిజాన్ని చాటిచెప్తోంది.

43 రెట్లు ఎక్కువ

శృంగారం, రక్తమార్పిడి, ఇతర కారణాల వల్ల ఎయిడ్స్ బారిన పడ్డ పేషెంట్లతో పోలిస్తే ఇంజెక్షన్ ద్వారా ఎయిడ్స్‌ను కొనితెచ్చికుంటున్న యువత సంఖ్య ఏకంగా 43 రెట్లు అధికంగా ఉందని గణాంకాలు విశ్లేషించాయి. ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకుని ఎయిడ్స్ బారినపడిన 16-30 ఏళ్ల వయసు వారిలో 87 శాతం మంది యుక్తవయసు వాళ్లే ఉన్నారు. ఇందులో 21-25 ఏళ్ల వయసు వారు ఏకంగా 43.5 శాతం మంది ఉన్నారు. 15 ఏళ్లలోపు వారు సైతం ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకుని ఎయిడ్స్ కోరల్లో చిక్కుకున్నారు.



అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

నివేదిక బయటికొచ్చాక మీడియాలో, ప్రజల్లో గగ్గోలు మొదలైంది. విమర్శలు వెల్లువెత్తడంపై మాణిక్ సాహా సర్కార్ అప్రమత్తమైంది. మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని సీఎం సాహా ప్రకటించారు. ''పాజిటివ్ వచ్చిన విద్యార్థుల గురించి పట్టించుకుంటున్నాం. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా విద్యార్థులందరికీ యాంటీ-రిట్రోవైరల్ ట్రీట్‌మెంట్(ఏఆర్‌టీ) ఇప్పిస్తున్నాం'' అని సాహా స్పష్టంచేశారు.

సంపన్నుల పిల్లలే ఎక్కువ

మాదక ద్రవ్యాలు ఖరీదైనవి. వీటిని కొనేంత స్తోమత సాధారణ కుటుంబాలకు చెందిన పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఉండదు. సంపన్నులకే ఇది సాధ్యం. ప్రభుత్వ నివేదికలోనూ ఇదే స్పష్టమైంది. ఎక్కువ మంది పిల్లలు సంపన్న కుటుంబాలకు చెందిన వాళ్లే ఉన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. 'ఉద్యోగాల్లో బిజీగా మారి తమ పిల్లలు ఏం చేస్తున్నారు? పాకెట్ మనీని వేటి కోసం ఖర్చుచేస్తున్నారు? అనే నిఘా బాధ్యత తల్లిదండ్రులకు లేదు. అందుకే పిల్లల భవిష్యత్తు ఇలా అగమ్యగోచరమైంది' అని సమర్పిత అన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యుత్తమ విధానం ఏఆర్‌టీ. శరీరంలో వైరస్ లోడును తగ్గించేందుకు పలు రకాలైన మందులను రోగులకు ఇస్తారు. ఏఆర్‌టీ ద్వారా రక్తంలో వైరస్ క్రియాశీలతను తగ్గించవచ్చు. వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూనే ఎయిడ్స్ మరింత ముదరకుండా ఏఆర్‌టీ చూస్తుంది. అయితే ఎయిడ్స్‌ను శాశ్వతంగా నయం చేయలేముగానీ ఆ మనిషి జీవితకాలాన్ని ఇంకొన్ని సంవత్సరాలు పొడిగించేందుకు ఈ చికిత్సవిధానం సాయపడుతుంది. మే నెల నాటికి చికిత్స కోసం రాష్ట్రంలోని ఏఆర్‌టీ కేంద్రాల్లో 8,729 మంది తమ పేర్లను నమోదుచేసుకున్నారు. మే నెల లెక్కల ప్రకారం 5,674 మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారు. కొత్త కేసుల్లో టీనేజీ వాళ్లు ఎక్కువగా ఉంటున్నారన్న మీడియా వార్తలు అక్కడి టీనేజర్ల తల్లిదండ్రులకు హెచ్చరికలు చేస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పిడుగుపాటుకు 38 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో పిడుగులు పడిన ఘటనలు పలువురి ప్రాణాలు బలిగొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు గురై కనీసం 38 మంది మరణించారని అధికారులు గురువారం ప్రకటించారు. ప్రతాప్‌గఢ్‌లో అత్యధికంగా 11 మంది మృతి చెందారు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగ్‌రాజ్‌లో నలుగురు, ఔరయ్యా, డియోరియా, హత్రాస్, వారణాసి, సిద్ధార్థనగర్‌లలో ఒక్కొక్కరు మరణించారు. అనేక మందికి కాలిన గాయాలయ్యాయి. తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోని చందౌలీ జిల్లాలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ ఘటనలో 13, 15 ఏళ్లున్న ఇద్దరుతో సహా చాలా మంది బాధితులు పొలంలో పనిచేస్తున్నారు. అప్పుడే చేపలు పట్టేటప్పుడు పిడుగుపాటుకు గురయ్యారు. సుల్తాన్‌పూర్‌లో ముగ్గురు చిన్నారులుసహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కొందరు వరి నాట్లు వేస్తుండగా, ఒకరు మామిడి కాయలు కోసేందుకు వెళ్లి, మరొకరు తాగునీరు తెచ్చేందుకు వెళ్లి పిడుగుపాటుకు గురయ్యారు. బుధవారం భారీ వర్షం కురుస్తుండగా చెట్టు కింద తలదాచుకుంటున్న ఓ మహిళ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. వర్షం కురుస్తుండటంతో మామిడి చెట్టు కింద తలదాచుకుంటున్న 14 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. డియోరియాలో పొలంలో ఉన్న కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్తుండగా పిడుగుపడి 5 ఏళ్ల బాలిక మరణించింది. వారణాసిలో ఇద్దరు సోదరులు పిడుగుపాటుకు గురయ్యారు. ఒకరు కాలిన గాయాలతో మృతి చెందగా, మరొకరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రాబోయే ఐదు రోజుల్లో ఉత్తరప్రదేశ్. దాని పరిసర రాష్ట్రాలు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

పార్లమెంట్‌లో నిలదీస్తాం

మణిపూర్‌లో శాంతిస్థాపన కోసం పోరాడతాం: రాహుల్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో శాంతిస్థాపన కోసం పార్లమెంట్ వేదికగా పోరాడతామని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో నెలకొన్న విషాదాన్ని పారద్రోలి శాంతినెలకొనేందుకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించి అక్కడి వారి బాధలను అర్థంచేసుకుని ఘర్షణలకు చరమగీతం పాడాలని కోరారు. ఈ మేరకు ఇటీవల ఆయన మణిపూర్‌లో పర్యటన, బాధితులతో మాట్లాడటం తదితర ఘటనల వీడియోను గురువారం 'ఎక్స్'లో షేర్‌చేస్తూ హిందీలో పలు పోస్టులుచేశారు. 'మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాక మూడుసార్లు రాష్ట్రంలో పర్యటించా. ఇన్నిరోజులైన అక్కడి పరిస్థితిలో మార్పురాలేదు. ఇప్పటికీ అక్కడి జనం రెండు వర్గాలుగా విడిపోయి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వేలాది కుటుంబాలు దిక్కులేక శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నాయి. ప్రధాని మోదీ వ్యక్తిగతంగానైనా ఒక్కసారి మణిపూర్‌లో పర్యటించి అక్కడి వారి బాధలను వినాలి. శాంతియుత వాతావరణం నెలకొనేందుకు కృషి చేయాలి' అని అన్నారు. 'పార్లమెంట్‌లో మణిపూర్ అంశాన్ని ప్రస్తావిస్తాం. శాంతిస్థాపన కోసం చర్యలు తీసుకునేదాకా కాంగ్రెస్, 'ఇండియా' కూటమి మోదీ సర్కార్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తాయి' అని అన్నారు. ' మీ వాణిని పార్లమెంట్‌లో వినిపిస్తాగానీ మీరు శరణార్థి శిబిరాలను వీడి స్వస్థలాలకు ఎప్పటికల్లా వెళ్లగలరు? అనే ప్రశ్నకు సమాధానం ప్రభుత్వం వద్దే ఉంది'' అని అన్నారు.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

న్యూఢిల్లీ: హైకోర్టుల జడ్జీలు ఎన్.కోటిశ్వర్ సింగ్, ఆర్.మహదేవన్‌లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం గురువారం సిఫారసు చేసింది. కోటిశ్వర్ సింగ్ ప్రస్తుతం జమ్మూకశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉండగా, మహదేవన్ మద్రాస్ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా కొనసాగుతున్నారు. వీరిద్దరికి సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని కొలీజియం సిఫారసు చేసింది. కొలీజియంలో సీజే చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్ సభ్యులుగా ఉన్నారు. సుప్రీంకోర్టులో మంజూరైన జడ్జి పోస్టులు 34 కాగా ప్రస్తుతం 32 మంది ఉన్నారు.

మత్తులోనే మిహిర్ డ్రైవింగ్

ముంబై: ముంబైలో ఆదివారం ఉదయం జరిగిన బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మహిళ కావేరి(45) చనిపోగా ఆమె భర్త గాయపడటం తెల్సిందే. ఆ సమయంలో కారు నడుపుతున్న శివసేన నేత రాజేశ్ షా కుమారుడు, ప్రధాన నిందితుడు మిహిర్ షా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గురువారం ధ్రువీకరించుకున్నారు. మిహిర్ షాను పాల్ఘార్ జిల్లాలోని విరార్ ఫటాలో మంగళవారం అరెస్ట్ చేయగా కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. ఆదివారం జరిగిన ఘటనలపై పోలీసులు సీన్ రీక్రియేట్ చేస్తున్నారు. గురువారం ఉదయం బైక్‌ను ఢీకొన్న ప్రాంతం వర్లీలోని అనీబీసెంట్ మార్గం నుంచి కారు బాయ్‌నెట్‌లో కావేరి చిక్కుకున్న తర్వాత కూడా ఒకటిన్నర కిలోమీటర్ల దూరం బాంద్రా వర్లీ సీ లింక్‌పైకి వెళ్లిన మార్గం..ఆ తర్వాత కావేరిని బాయ్‌నెట్ నుంచి వేరు చేసి రోడ్డుపై పడుకోబెట్టడం, డ్రైవర్ రాజర్షి బిదావత్ కారును ఆమెపైకి పోనివ్వడం వంటి ఘటనల క్రమాన్ని ఇద్దరినీ తీసుకెళ్లి వివరంగా తెల్సుకున్నారు. రాజేశ్ షా సూచనల మేరకే ఆ సమయంలో కారును బిదావత్ నడిపినట్లు కూడా వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ఎయిమ్స్‌లో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్(73) గురువారం ఉదయం ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. ఆయన వెన్ను నొప్పితో బాధపడుతున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పాత ప్రైవేట్ వార్డులో ఆయనకు సంబంధిత పరీక్షలు జరుగుతున్నాయని ఎయిమ్స్ మీడియా ఇన్‌చార్జి డాక్టర్ రిమా దాదా చెప్పారు. రాజ్‌నాథ్ పరిస్థితి నిలకడగా ఉందన్నారు.



బుధవారం వాషింగ్టన్‌లో నాటో దేశాల ముగింపు సమావేశంలో సభ్య దేశాల నేతలతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ గ్రూప్ ఫొటో

విధ్వంసకారి చైనా

'నాటో'దేశాల నేతల మండిపాటు • 'వాషింగ్టన్ సమ్మిట్ డిక్లరేషన్' విడుదల

వాషింగ్టన్/బీజింగ్: చైనా-రష్యా దేశాల మధ్య బంధం నానాటికీ బలపడుతుండడం పట్ల నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) సభ్యదేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యుద్ధం పేరిట ఉక్రెయిన్‌లో విధ్వంసానికి రష్యాకు చైనా అండదండలు అందిస్తోందని మండిపడ్డాయి. డ్రాగన్ దేశం నిర్ణయాత్మక విధ్వంసకారిగా మారిందని ఆరోపించాయి. రష్యాతో భాగస్వామ్యానికి ఎలాంటి పరిమితులు లేవంటూ చైనా నాయకత్వం చేసిన ప్రకటనలను నాటో దేశాలు ప్రస్తావించాయి. రష్యా రక్షణ పారిశ్రామిక రంగానికి చైనా పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తోందని, దీనివల్ల రష్యా పొరుగు దేశాలతోపాటు యూరో-అట్లాంటిక్ భద్రతకు పెనుముప్పు పొంచి ఉందని వెల్లడించాయి. అమెరికాలోని వాషింగ్టన్‌లో నాటోలోని 32 సభ్యదేశాల అధినేతలు, ప్రతినిధులు సమావేశమయ్యారు. కూటమి 75వ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. కూటమిలో 32వ సభ్యదేశంగా చేరిన స్వీడన్‌కు సాదర స్వాగతం పలికారు. భేటీ అనంతరం 'వాషింగ్టన్ సమ్మిట్ డిక్లరేషన్' పేరిట ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చైనా దుందుడుకు విధానాలు, చర్యలు తమ ప్రయోజనాలకు, భద్రతకు, విలువలకు సవాలు విసిరేలా ఉంటున్నాయని మండిపడ్డారు.

రష్యాకు మద్దతిస్తే చైనాకే నష్టం

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన చైనా బాధ్యతాయుతంగా మసలుకోవాలని నాటో సభ్యదేశాల ప్రతినిధులు హితవు పలికారు. ఉక్రెయిన్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న రష్యాకు సహకరించుకోవడం తక్షణమే నిలిపివేయాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత చైనాపై ఉందని పునరుద్ఘాటించారు. రష్యాకు ఆయుధపరంగా, రాజకీయంగా ఎలాంటి సహకారం అందించవద్దని స్పష్టం చేశారు. రష్యాను గుడ్డిగా వెనుకేసుకొస్తే చైనాయే నష్టపోతుందని, ప్రపంచంలో ఏకాకిగా మారుతుందని తేల్చిచెప్పారు. రష్యా-చైనా-ఉత్తర కొరియా దేశాల మధ్య స్నేహ సంబంధాలు కొత్త చివుళ్లు తొడుగుతున్న నేపథ్యంలో దానికి ప్రతిచర్యగా ఇండో-పసిఫిక్ దేశాలతో భాగస్వామ్యాన్ని మెరుగుపర్చుకుంటామని నాటో సెక్రెటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ ప్రకటించారు.

అలజడి యత్నాలు మానుకోండి: చైనా

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధంలో చైనా విధ్వంసకారిగా మారిందంటూ నాటో కూటమి నేతలు చేసిన విమర్శలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం ఖండించారు. సొంత భద్రత కోసం ఇతర దేశాల ప్రయోజనాలను బలిపెట్టడం నాటో దేశాలకు అలవాటేనని విమర్శించారు. ఆసియాలో అలజడి సృష్టించాలన్న ప్రయత్నాలు మానుకోవాలని చెప్పారు.

నాటో సభ్య దేశాలు ఇవి...

1.అమెరికా, 2.యునైటెడ్ కింగ్‌డమ్, 3.అల్బేనియా, 4.బెల్జియం, 5.బల్గేరియా, 6.కెనడా, 7.క్రొయేషియా, 8.చెక్ రిపబ్లిక్, 9.డెన్మార్క్, 10.ఎస్తోనియా, 11.ఫిన్లాండ్, 12.ఫ్రాన్స్, 13.జర్మనీ, 14.గ్రీస్, 15.హంగేరీ, 16.ఐస్‌లాండ్, 17.ఇటలీ, 18.లాత్వియా, 19.లిథువేనియా, 20.లక్సెంబర్గ్, 21.మాంటెనిగ్రో, 22.నెదర్లాండ్స్, 23.నార్త్ మాసిడోనియా, 24.నార్వే, 25.పోలాండ్, 26.పోర్చుగల్, 27.రొమేనియా, 28.స్లొవాకియా, 29.స్లొవేనియా, 30.స్పెయిన్, 31.స్వీడన్, 32.తుర్కియే

ఎల్ఎల్‌బీలో మనుస్మృతి ప్రతిపాదన తిరస్కరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్శిటీలో న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలని న్యాయ విభాగం అధ్యాపక బృందం చేసిన ప్రతిపాదనను తిరస్కరించినట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ స్పష్టం చేశారు. విద్యార్థులకు మనుస్మృతిని బోధించబోమని చెప్పారు. ఎల్ఎల్‌బీ ప్రథమ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మనుస్మృతిని బోధించేందుకు వీలుగా సిలబస్‌ను మార్చాలని న్యాయశాస్త్ర విభాగం ఢిల్లీ యూనివర్శిటీ అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన అకడమిక్ కౌన్సిల్‌ను కోరింది. మొదటి, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు మనుభాష్య ఆఫ్ మేధాతిథి , కామెంటరీ ఆఫ్ మనుస్మృతి-స్మృతిచంద్రిక పుస్తకాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని ప్రతిపాదించింది. విమర్శలు వెల్లువెత్తడంతో ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు యోగేష్ గురువారం రాత్రి చెప్పారు.

నీట్‌పై విచారణ 18కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ అవకతవకల ఆరోపణలపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ముందుకొచ్చాయి. ఈ పిటిషన్లను సోమవారం విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.అయితే, సోమ, మంగళ వారాలకు బదులుగా వేరే రోజుల్లో విచారణ చేపట్టాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరడంతో గురువారం చేపడతామని పేర్కొంది. 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ), కేంద్రం బుధవారం దాఖలు చేసిన కౌంటర్లు పిటిషనర్ల తరఫు లాయర్‌కు అందనందున విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నాం ''అని ధర్మాసనం తెలిపింది. మే 4న టెలిగ్రామ్ యాప్‌లో లీక్ అయిన నీట్-యూజీ ప్రశ్న పత్రం ఫొటో నకిలీదని ఎన్‌టీఏ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ముందస్తు లీక్ అనిపించేలా అందులో సమయం మార్చారని తెలిపింది. పేపర్ లీక్ ఆరోపణలు మొత్తం పరీక్షల నిర్వహణపై ఎలాంటి ప్రభావం చూపదని, హాజరైన వారితో పోలిస్తే, లీకైన పేపర్ అందినట్లుగా గుర్తించిన విద్యార్థుల సంఖ్య అత్యల్పమని ఎన్‌టీఏ వివరించింది.

మరో సూత్రధారి అరెస్ట్

నీట్-పీజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతంలో కీలక సూత్రధారుల్లో ఒకరైన రాకేశ్ రంజన్‌ను సీబీఐ అధికారులు గురువారం అరెస్ట్‌చేశారు. సూత్రధారి సంజీవ్ ముఖియాకు బంధువైన రంజన్ స్వస్థలం బిహార్‌లోని నలంద. రంజన్‌ను గురువారం పట్నాలోని స్పెషల్ కోర్టు ఎదుట సీబీఐ అధికారులు ప్రవేశపెట్టారు. రంజన్‌ను 10 రోజులపాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

మాజీ అగ్నివీర్‌లకు పారా మిలటరీలో రిజర్వేషన్

న్యూఢిల్లీ: మాజీ అగ్నివీర్‌లకు సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ తీపి కబురు చెప్పాయి. నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీశ్ దయాళ్ గురువారం ప్రకటించారు. '' మాజీ అగ్నివీర్‌లకు నూతన నియామకాల్లో అవకాశం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది. అందుకే వారికి 10 శాతం రిజర్వేషన్ ప్రక్రియను త్వరలో ప్రారంభించబోతున్నాం' అని నీనా సింగ్, నితిన్ అగర్వాల్ చెప్పారు. కానిస్టేబుళ్లకు సంబంధించిన తదుపరి నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలుచేస్తామని నీనా పేర్కొన్నారు. '' దేహ దారుఢ్య పరీక్షల్లో మాజీ అగ్నివీర్‌లకు మినహాయింపు ఇస్తాం. వయోపరిమితిలోనూ మినహాయింపులు ఉంటాయి'' అని నీనా సింగ్ చెప్పారు.

తల్లిదండ్రులతో గడిపేందుకు సెలవు

అస్సాం ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు

గువాహటి: అస్సాం ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు లేదా అత్తమామలతో గడిపేందుకు రెండు రోజులు సెలవులిస్తున్నట్లు సీఎం కార్యాలయం గురువారం ప్రకటించింది. తల్లిదండ్రులు, అత్తమామలు లేని వారు స్పెషల్ కాజువల్ లీవ్‌కు అనర్హులని స్పష్టం చేసింది. నవంబర్ 6, 8వ తేదీల్లో స్పెషల్ కాజువల్ లీవ్ తీసుకునే వారు తమ తల్లిదండ్రులు, అత్తమామలతో గడిపేందుకే కేటాయించాలని వివరించింది. వయోవృద్ధులైన తల్లిదండ్రులు, అత్తమామలను జాగ్రత్త చూసుకునేందుకు వారికి గౌరవం, మర్యాద ఇచ్చేందుకు ఈ లీవ్ ప్రత్యేక సందర్భమని వెల్లడించింది. నవంబర్ 7న ఛాత్ పూజ, నవంబర్ 9న రెండో శనివారం, నవంబర్ 10న ఆదివారంతో పాటు ఈ రెండు రోజుల సెలవును ఉపయోగించుకోవచ్చని సీఎంఓ తెలిపింది.

ఆర్థిక ఉద్దీపన చర్యలు చేపట్టండి

ప్రధాని మోదీకి ఆర్థికవేత్తల వినతి

న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక వ్యవస్థ ప్రగతికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీకి పలువురు ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేశారు. కేంద్రం త్వరలో పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మోదీ గురువారం ఆర్థికవేత్తలతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలపై సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, ప్రణాళిక శాఖ మంత్రి రావు ఇందర్‌జిత్, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, ఆర్థికవేత్తలు సూర్జీత్ భల్లా, అశోక్ గులాటీ తదితరులు పాల్గొన్నారు. సీతారామన్ 23న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

హరియాణాలో బీఎస్పీతో ఐఎన్ఎల్‌డీ పొత్తు

చండీగఢ్: హరియాణా అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ లోక్ దళ్(ఐఎన్ఎల్‌డీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) కలిసి పోటీ చేయనున్నాయి. ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉంటారు. అసెంబ్లీలోని 90 సీట్లకుగాను బీఎస్పీ 37 సీట్లు, మిగతా చోట్ల ఐఎన్ఎల్‌డీ బరిలోకి దిగనుంది. బీఎస్పీ చీఫ్ మాయావతి గురువారం 'ఎక్స్'లో ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా తాము జట్టుకట్టామే తప్ప స్వార్థ ప్రయోజనాల కోసం కాదని చౌతాలా అన్నారు. ఆప్ సహా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలేవైనా తమతో చేతులు కలపొచ్చన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఉమ్మడిగానే పోటీ చేస్తామన్నారు. ప్రస్తుత అసెంబ్లీలో ఐఎన్ఎల్‌డీకి ఏకైక ఎమ్మెల్యే అభయ్ చౌతాలా ఉండగా బీఎస్పీకి ప్రాతినిధ్యమే లేదు.

డిమాండ్లపై మళ్లీ ఉద్యమిస్తాం

సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ: రైతు సంఘాల సమాఖ్య సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) మళ్లీ ఉద్యమబాట పట్టనుంది. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ), రైతుల రుణ మాఫీ వంటి కీలక డిమాండ్ల సాధన కోసం మళ్లీ ఉద్యమిస్తామని ఎస్‌కేఎం గురువారం ప్రకటించింది. ఉద్యమంపై ప్రధాని మోదీకి, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీకి వినతిపత్రాలు సమర్పించాలని బుధవారం నాటి సంఘం సర్వసభ్య సమావేశం తర్వాత రైతు నేతలు నిర్ణయించారు. ''ఈనెల 16 లేదా 18వ తేదీన అపాయింట్‌మెంట్ తీసుకుని ప్రధాని మోదీని కలిసి మా సమస్యలను విన్నవించుకుంటాం. 2020-21 రైతు ఉద్యమం ఉధృతంగా కొనసాగిన కాలంలో ప్రాణాలు కోల్పోయిన రైతన్నలకు ఢిల్లీలోని టిక్రి, సింఘు సరిహద్దుల వద్ద స్మారకాలను నిర్మిస్తాం'' అని గురువారం ఢిల్లీలో పత్రికా సమావేశంలో రైతు నేతలు తెలిపారు. '' ఉద్యమపంథాను ఈసారి మార్చబోతున్నాం. గతంలో మాదిరి హస్తిన కేంద్రంగా 'ఢిల్లీ ఛలో' వంటి కార్యక్రమాలు చేయబోం. దేశవ్యాప్త ఉద్యమంపై దృష్టిసారిస్తాం. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, హరియాణాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. రైతు ఉద్యమం కారణంగానే తాజా లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ జనాభా ఎక్కువగా ఉన్న 159 స్థానాల్లో బీజేపీ ఓడిపోయింది' అని ఆలిండియా కిసాన్ సభ నేత హన్నన్ అన్నారు.



తమది కాని తనువులోంచి తమలోకి!

పుట్టుకతో శరీరం ఒకలా.. లక్షణాలు మరోలా ఉండి ఇబ్బందిపడుతున్న వారెందరో!

లింగ మార్పిడి చేయించుకుంటున్న కొందరు.. 'జెండర్ ఐడెంటిటీ' మార్చుకుంటున్న మరికొందరు

మారుతున్న పరిస్థితుల్లో పెరుగుతున్న 'మార్పిడి' శస్త్రచికిత్సలు

అలాంటి వారికి మద్దతుగా నిలుస్తున్న సామాజికవేత్తలు, 'ట్రాన్స్ కమ్యూనిటీ' సంఘాలు

నగరానికి చెందిన 'అనుకతీర్ సూర్య' పేరు మార్పుతో ఈ అంశంపై విస్తృతంగా చర్చలు

పగిడిపాల ఆంజనేయులు



"నా శరీరం నాకు కావాలి. నాది కానటువంటి తనువులో ఇక ఏ మాత్రం జీవించలేకపోయాను. అందుకే నాదైన శరీరంలోకి మారాను"

అంటాడు తన పాత పేరు చెప్పడానికి నిరాకరించిన పి. సూర్యకుమార్. అమ్మాయిలా పుట్టిన సూర్య చిన్నప్పటి నుంచి ఆ భావనలో ఇమడలేకపోయాడు. అమ్మాయిల్లానే దుస్తులు ధరించి స్కూల్‌కు వెళ్లినా అబ్బాయిలతోనే కలిసి తిరిగేవాడు. వారితోనే కలసి ఆటలాడేవాడు. సరదాలు, సంతోషాలు అన్నీ వాళ్లతోనే. ఈ క్రమంలో ఎంతో వివక్షను, హింసను, వేధింపులను ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరికి ఆరేళ్ల క్రితం లింగ (జెండర్)మార్పిడి శస్త్రచికిత్సతో అబ్బాయిగా మారిపోయాడు.

.. ఒక్క సూర్య మాత్రమే కాదు. చాలా మంది సమస్య ఇది. ఆడపిల్లల్లా పుట్టినవారు మగవారిగా, మగవారిగా పుట్టినవారు ఆడవారిగా.. మారుతున్న ఘటనలు ఎన్నో. గత ఐదారేళ్లలో.. ఆడవాళ్లుగా పుట్టినప్పటికీ 'మగ' లక్షణాలున్న సుమారు 275 మంది శస్త్రచికిత్సలతో లింగ మార్పిడి చేయించుకున్నట్టు సామాజిక సంస్థలు చెప్తున్నాయి. అలాగే అబ్బాయిలుగా పుట్టినప్పటికీ 'ఆడ' లక్షణాలున్న మరో మూడు వేల మందికిపైగా సర్జరీలతో అమ్మాయిలుగా మారారని.. ఏటేటా జెండర్ మార్పిడి చికిత్సలు పెరుగుతూనే ఉన్నాయని పేర్కొంటున్నాయి.

జెండర్ డయాస్ఫోరాతో..

''తాము‌న్న స్థితిలో ఇక ఏ మాత్రం కొనసాగలేని పరిస్థితి. అవయవాలు కూడా మార్చుకొంటేనే మనుగడ అని భావించేవారు ట్రాన్స్‌విమెన్‌గా, ట్రాన్స్‌మెన్‌గా మారిపోతున్నారు. తీవ్రమైన డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యా సదృశమైన పరిస్థితుల్లో జీవించడాన్ని 'జెండర్ డయాస్ఫోరా' అంటారని.. దాని నుంచి బయటపడేందుకు లింగ మార్పిడి ఒక్కటే పరిష్కారం'' అని ప్రముఖ సామాజిక కార్యకర్త రచన ముద్రబోయిన తెలిపారు. తెలంగాణ మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీకి ఆమె నేతృత్వం వహిస్తున్నారు. మగ శరీరంతో పుట్టి ఆడవాళ్ల లక్షణాలున్న పిల్లలు చిన్నప్పటి నుంచే రకరకాల వివక్షను ఎదుర్కొంటున్నారని.. ఇంట్లో, బడిలో, బయటా అన్నిచోట్లా ఇబ్బందిగానే బతుకుతున్నారని ఆమె చెప్పారు. తమది కానటువంటి జెండర్‌ను భరించలేని పరిస్థితుల్లోనే సర్జరీలకు వెళ్తున్నారని వివరిస్తున్నారు.

'గుర్తింపు'లో మార్పులు వస్తుండటంతో..

ఒకప్పుడు గుట్టుగా లింగ మార్పిడులు సాగేవి. ఇప్పుడవి సాధారణ అంశంగా మారాయి. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన జెండర్‌తో జీవించేందుకు అవకాశాన్ని కల్పిస్తూ సుప్రీంకోర్టు 2014లో వెలువరించిన తీర్పు ట్రాన్స్ కమ్యూనిటీకి ఒక వరంగా మారింది. అప్పటి నుంచి లింగ మార్పిడి సర్జరీలు చేయించుకోవడమేకాదు.. తమలోని లక్షణాలకు అనుగుణంగా 'జెండర్ ఐడెంటిటీ'ని మార్చుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఇన్నాళ్లూ 'అనసూయ'గా కొనసాగిన ఐఆర్‌ఎస్ అధికారిణి.. జెండర్ గుర్తింపు మార్చుకుని, 'అనుకతీర్ సూర్య'గా పేరు పెట్టుకున్నారు. మరోవైపు జెండర్ మార్పు చేసుకున్న కొందరు ఔత్సాహిక మహిళలు వ్యాపారులుగా, డాక్టర్లుగా, టీవీ యాంకర్లుగా, నటీనటులుగా, సామాజిక కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. మరెన్నో రంగాల్లోనూ స్థిరపడ్డారు. జెండర్ మార్పిడికి ముందు అనేక బాధలను అనుభవించామని.. అనంతరం తమదైన గుర్తింపుతో సంతోషంగా ఉంటున్నామనని చెబుతున్నారు. ఇలా జెండర్ మార్పిడితో కొత్త జీవితాన్ని ప్రారంభించిన 25 మందిని క్వీర్ బంధు, పేరెంట్స్ అసోసియేషన్లు ఇటీవల 'తెలంగాణ ట్రాన్స్ స్వాభిమాన్' అవార్డులతో సత్కరించాయి. డాక్టర్ ప్రాచీ రాథోడ్, కాదంబరి స్టూడియో బొటిక్ ద్వారా అనేక మందికి ఉపాధిని

మిగతా 8వ పేజీలో ▶

మార్పు తప్పకాదు



సర్జరీ అవసరమని బలంగా అనిపించినప్పుడు మాత్రమే ముందుకెళ్లాలి. లింగ మార్పిడి చేసుకున్న తరువాత.. ఎందుకు చేయించుకున్నామా అని బాధపడుతున్నవారు ఎంతో మంది ఉన్నారు. అందుకే రెండేళ్ల పాటు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. శాస్త్రీయమైన, ప్రామాణిక పద్ధతిని అనుసరించాలి.

– రచన, తెలంగాణ మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి



లివిన్ లైఫ్



సిటీలో స్థిరపడుతున్న సహజీవన సంస్కృతి

- వివరాలు 13లో

సింప్లిసిటీ.. న్యూ లైఫ్‌స్టైల్

సింప్లిసిటీ అనేది ఇప్పుడు ఒక సరికొత్త జీవనశైలిగా నగరవాసుల్ని ఆకర్షిస్తోంది. భవిష్యత్తుపై కొత్త అంచనాలు రేకెత్తిస్తోంది.

- వివరాలు 12లో

ఆరుగించేస్తున్నారు

8లో



సాక్షి, హైదరాబాద్

నోరూరించే వంటకాలు, సుగంధ ద్రవ్యాలు, విభిన్న రుచులకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్ అన్నట్టుగానే బయట తిండి అంటే లొట్ట లేసుకొని మరీ లాగించేస్తున్నారు. చాయ్, సమోసా, ఇడ్లీ, దోశ, బిర్యానీ, పిజ్జా, బర్గర్.. ప్రతీది టేస్ట్ చేయనిదే వదలట్లేదు. దేశీయ ఫుడ్ పరిశ్రమలో హైదరాబాద్ ఆరో స్థానంలో నిలవడమే ఇందుకు ఉదాహరణ. నగరంలో సంఘటిత ఆహారసేవల పరిశ్రమ విలువ రూ.10,161 కోట్లకు చేరిందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) తెలిపింది. గచ్చిబౌలిలో గురువారం ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ తొలి నివేదిక విడుదల చేసింది. అందులో పలు ఆసక్తికర అంశాలు ఉన్నాయి.

నగరంలో 74,807 రెస్టారెంట్లు ఉన్నాయి. ఇందులో సంఘటిత విభాగంలోని రెస్టారెంట్ల సంఖ్య 41,144. నగరంలో క్లౌడ్ కిచెన్స్, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లదే హవా. ఇక్కడ 16,379 క్లౌడ్ కిచెన్స్ ఉండగా, 13,544 క్యూఎస్ఆర్‌లున్నాయి. 6,468 డైనింగ్, 3,004 కెఫేలు, 230 పబ్‌లు, బార్‌లు, లాంజ్‌లున్నాయి.

తలసరి వినియోగం | రూ.990..

నగరవాసులు నెలలో కనిష్టంగా మూడుసార్లు రెస్టారెంట్లలో తింటున్నారు. రెస్టారెంట్‌లో తలసరి వినియోగం రూ.990గా ఉంది. అదే జాతీయసగటు రూ.970గా ఉంది. అత్యధికంగా ఢిల్లీలో రూ.1,050 ఖర్చవుతుంది. జాతీయసగటు కంటే హైదరాబాద్‌లో తలసరి వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల ఇతర నగరాలు, దేశాల్లోని ఫుడ్ బ్రాండు ఇక్కడ రెస్టారెంట్లు నెలకొల్పడానికి ఆసక్తి చూపిస్తున్నాయి.

ఆరగించేస్తున్నారు

హైదరాబాద్ ఫుడ్ మార్కెట్ విలువ ▶ 10,161 కోట్ల రూపాయలు

దేశంలోనే ఆరోస్థానంలో నిలిచిన నగరం
ఎన్ఆర్ఏఐ తొలి నివేదికలో వెల్లడి

రెస్టారెంట్లకు ఫ్యామిలీతోనే..

నగరవాసులు బయట భోజనం చేయడానికి ప్రధానకారణం గెట్ టు గెదర్లు, సినిమాలు, పుట్టిన, పెళ్లిరోజులే. 24శాతం మంది కుటుంబం, స్నేహితులు, సహోద్యోగులతో గెట్ టు గెదర్ పేరుతో రెస్టారెంట్లకు వెళుతుండగా.. 16శాతం మంది పండుగలు, జాతీయసెలవు రోజుల్లో వెళుతున్నారు. ఇక 11శాతం మంది కొత్త టేస్ట్ ఆస్వాదించేందుకు వెళుతున్నారు. 57శాతం మంది కుటుంబంతో కలిసి వెళుతుండగా.. 17 శాతం ఫ్రెండ్స్‌తో, 16శాతం రొమాంటిక్ పార్ట్‌నర్‌తో, 7 శాతం ఒంటరిగా, 3 శాతం సహోద్యోగులతో వెళుతున్నారు. ఇక అత్యధికంగా 67 శాతం సౌత్ ఇండియా ఫుడ్‌నే ఎక్కువగా తింటున్నారు. 59శాతం స్నాక్స్, 36శాతం బర్గర్, హాట్‌డాగ్ వంటి అమెరిక్ అండ్ మెక్సికన్ ఫుడ్, 31శాతం నార్త్ ఇండియన్ ఫుడ్, 31 శాతం పిజ్జా, పాస్తా వంటి ఇటాలియన్ ఫుడ్, 29శాతం చైనీస్ ఫుడ్ తింటున్నారు.




వృద్ధి అదరహో..

2023 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి దేశీయ ఆహార సేవల పరిశ్రమ రూ.4,89,624 కోట్లకు చేరుకుంది. ఏటా ఈ పరిశ్రమ 3.7 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తోంది. 2024 ముగింపు నాటికి దేశీయ ఆహారసేవల రంగం రూ.5,69,487 కోట్లకు, 2028 నాటికి రూ.7,76,511 కోట్లకు చేరుకుంటుందని అంచనా. దేశ జీడీపీలో 1.9 శాతం, జీఎస్టీలో 1.4 శాతం వాటా ఈ రంగానిదే. ఈ రంగంలో 85 లక్షల మంది పనిచేస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి సంఘటిత రంగం రూ.2,49,694 కోట్లకు, అసంఘటిత రంగం రూ.3,19,793 కోట్లకు చేరుకుంటుందని అంచనా.



గురువారం గచ్చిబౌలిలో ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ తొలి నివేదికను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు





హైదరాబాద్ ఫుడ్ గొప్ప వారసత్వ గుర్తింపు పొందింది.
పన్నుల రూపంలో ఆదాయం వస్తున్నా, పరిశ్రమపై చిన్నచూపు ఉంది.
మద్యం లైసెన్స్‌ల కోసం అధిక రుసుములు, రెస్టారెంట్లకు పరిమిత పనిగంటలు వంటివి హైదరాబాద్ ఆహార పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు.
వీటిని ప్రభుత్వం పరిష్కరించాలి.
- శ్రీనివాస్ సంపత్, ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ హెడ్

తమది కాని 'తనువు'లోంచి.. 'తమ'లోకి!

▶ 7వ పేజీ తరువాయి

కల్పిస్తున్న సుబ్బులక్ష్మి.. బేకరీ, కిరాణా షాపు నిర్వహిస్తున్న సంతోష్ వంటివారు ఎందరో జెండర్ మార్పిడితో సరికొత్త జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

అదెంతో సుదీర్ఘ ప్రక్రియ!

ఢిల్లీ, ముంబై, విజయవాడ కేంద్రంగా జెండర్ మార్పిడి చికిత్సలు ఎక్కువగా జరుగుతున్నట్టు స్వచ్ఛంద సంస్థలు చెప్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ చికిత్సలకు అవకాశం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చవుతున్నట్టు చెప్తున్నారు. అయితే ఎవరైనా జెండర్ మార్చుకోవాలని నిర్ణయించుకున్నా.. అది అప్పటికప్పుడు అయ్యేది కాదు. దీనిపై వైద్య నిపుణులు, సైకియాట్రిస్టులు 9 విడతలు కౌన్సెలింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ రెండేళ్లపాటు కొనసాగుతుంది. ఈ క్రమంలో లింగ మార్పిడి కోసం వచ్చే వ్యక్తుల శారీరక, మానసిక స్థితిని పూర్తిగా అధ్యయనం చేస్తారు. మార్పిడి తప్పదనే నిర్ధారణకు వచ్చాకే సర్జరీకి అనుమతిస్తారు. అయితే 'కొందరు ట్రాన్స్‌జెండర్లు రెండేళ్లపాటు వేచి ఉండేందుకు నిరాకరిస్తూ.. తప్పుడు మార్గాల్లో లింగ మార్పిడి చికిత్సలు చేయించుకుంటున్నారు. అది చట్టవిరుద్ధం, అలా చికిత్సలు చేసే డాక్టర్లు నేరస్తులవుతారు..'' అని సామాజిక కార్యకర్త రచన చెప్పారు.

జెండర్ ఐడెంటిటీ.. బలమైన ఆకాంక్ష!

జెండర్ ఐడెంటిటీ ఒక బలమైన ఆకాంక్ష. పుట్టిననాటి నుంచి సుమారు డిగ్రీ పూర్తయ్యే వరకు 'అమ్మాయి'గా కొనసాగిన సూర్యకుమార్ యాదవ్, విమల్, సంతోష్ వంటి కొందరు ఆ ఐడెంటిటీ తమది కాదని భావించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 'మగ' ఐడెంటిటీని సొంతం చేసుకోవాలని తపించారు. అందుకోసం ఎంతో కష్టపడ్డారు. రకరకాల ఇబ్బందులు, బాధలను ఎదుర్కొని.. కోరుకున్నది సాధించారు.

హార్మోన్లలో వచ్చే మార్పులే కారణం



హార్మోన్ల అసమతుల్యత అనే ప్రధాన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ట్రాన్స్ కమ్యూనిటీని అంచనా వేయాలి. కానీ సామాజిక రుగ్మతగా భావించి తప్పుడు ముద్ర వేయడం సరికాదు.
- వీణ

నా కల నెరవేరింది

అబ్బాయిగా మారాలనే నా కలను 2018లో నెరవేర్చుకున్నాను. అప్పట్నుంచీ సంతోషంగా ఉన్నాను. జెండర్ మార్పిడి అనేది లైంగికపరమైన కోర్కెలతో ముడిపడింది కాదు. తమది కానటువంటి జెండర్ నుంచి విముక్తిని పొందడమే.
- సూర్యకుమార్

చాలా సంతోషంగా ఉన్నాను



జెండర్ మార్పిడి తరువాత చాలా సంతోషంగా జీవిస్తున్నాను. నేను పోగొట్టుకున్న జీవితాన్ని సొంతం చేసుకున్నట్టుగా ఉంది. ఇప్పుడు నా కోసం నేను బతుకుతున్నాను.
- ఆర్తి

ట్రాన్స్‌జెండర్ల లెక్క ఇదీ..

తెలంగాణలో ట్రాన్స్‌జెండర్ల సంఖ్య **50,000** (సామాజిక సంస్థల అంచనాల మేరకు..)	గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్నవారు **10,000**
	మార్పిడి చేసుకొన్న ట్రాన్స్‌విమెన్ **3,000**
	మార్పిడి చేసుకున్న ట్రాన్స్‌మెన్ **275**

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 12 । జూలై । 2024



రూ.40వేల కోట్లతో మూసీ ప్రక్షాళన

రూ.40 వేల కోట్లతో మూసీ నదీ ప్రక్షాళనతో పాటు ఎస్టీపీల నిర్మాణంతో టూరిజం స్పాట్‌గా మార్చనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. -10లో



సింప్లిసిటీ.. సరికొత్త లైఫ్‌స్టైల్..

సింప్లిసిటీ అనేది ఇప్పుడు ఒక సరికొత్త జీవనశైలిగా నగరవాసుల్ని ఆకర్షిస్తోంది. భవిష్యత్తుపై కొత్త అంచనాలు రేకెత్తిస్తోంది. -12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/24.0

రానున్న 24 గంటల్లో నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావచ్చు.

ఆలయాల్లో డీజీపీ ప్రత్యేక పూజలు



జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో డీజీపీ జితేందర్ తదితరులు

బంజారాహిల్స్: రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ గురువారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి, టీటీడీ శ్రీవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయన పెద్దమ్మ గుడిలో పూజలు చేసిన అనంతరం టీటీడీ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. డీజీపీ వెంట జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ట్రాఫిక్ ఏసీపీ హరి ప్రసాద్, జూబ్లీహిల్స్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫిలింనగర్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ గణేష్ ఉన్నారు.

పార్కుల్లో సమస్యలను పరిష్కరిస్తాం

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



సుందరయ్య పార్కును సందర్శించిన కమిషనర్ ఆమ్రపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. గురువారం సుందరయ్య పార్కును ఆమె పరిశీలించారు. పార్కు చుట్టూ జ్యూస్ సెంటర్లు, మటన్ షాపులు, మసాజ్ సెంటర్లతో పాటు అనేక మంది వ్యాపారులు ఆక్రమించుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాకర్స్ ఫిర్యాదు చేశారు. అలాగే.. పార్కులో వాకింగ్ ట్రాక్ అస్తవ్యస్తంగా ఉందని, చిన్నపాటి వర్షానికే చిత్తడవుతోందన్నారు. ఇతర సమస్యలనూ ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్కులో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమ్రపాలి హామీ ఇచ్చారు. సమీపంలోని దశాబ్ది పార్కులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మదర్ డెయిరీ పార్కు సమస్యలను సైతం పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవికిరణ్, చీఫ్ ఇంజినీర్ ప్రాజెక్టు దేవానంద్, ఎస్‌ఈ సురేష్, ఈఈ గోపాల్, డీఎంసీ ఖాదర్, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, సలిపెల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, టి.సైకిలాబ్ బాబు, దశాబ్ది పార్కు అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకర్, సీతారాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ సర్వర్ డౌన్

నిలిచిన దస్తావేజుల నమోదు

సాక్షి, సిటీబ్యూరో: రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్‌తో దస్తావేజుల నమోదు నిలిచిపోయింది. సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో స్థిరాస్తి అమ్మకం, కొనుగోలు దారుల ఆధార్, ఈకేవైసీ, థంబ్ ఇంప్రెషన్ వెరిఫికేషన్‌కు అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయం నుంచి సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. స్లాట్ బుక్ చేసుకున్న దస్తావేజుదారులు గంటలకొద్దీ వేచి చూసి నిరాశతో వెనుదిరిగారు. రిజిస్ట్రేషన్ కోసమని ఉద్యోగాలు, ఇతర పనులు వదులుకొని ఆఫీసులకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వర్ డౌన్ సమాచారంతో కొన్ని చోట్ల దస్తావేజుదారులు వెళ్లిపోవడంతో మధ్యాహ్నం తర్వాత కార్యాలయాలు బోసిపోయి కనిపించాయి. నగర శివారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద మాత్రం జనం బారులు తీరారు. గ్రేటర్ పరిధిలో ప్రతిరోజూ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ రూపంలో కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతోంది. త్వరలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనుండటంతో పదిహేను రోజులుగా సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు తాకిడి పెరిగింది. తాజాగా సర్వర్ల సమస్యలతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడటంతో నిరాశకు గురయ్యారు.

నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం సమర్పించనున్నారు. నేటి ఉదయం పాతబస్తీ మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పెద్దమ్మ తల్లి గుడికి బయలుదేరివెళ్లనున్నట్లు ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనంలో భాగంగా నాలుగో బంగారు బోనాన్ని ఈ నెల 14న విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సమర్పించనున్నారు.

ఘనం.. రెండో బోనం



గోల్కొండ కోటలో పూజలు

గోల్కొండ: గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారికి రెండో బోనం పూజ గురువారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాందేవ్‌గూడ, టోలిచౌకీ, షాలిబండ, చార్మినార్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఊరేగింపుగా తొట్టెలను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. పోతరాజులు అద్భుత విన్యాసాలతో అలరించారు. మరోవైపు శివసత్తులు తలలపై వేపాకుతో అలంకరించిన బోనం కుండలు పెట్టుకుని భక్తిభావాన్ని చాటారు. శివసత్తులు పూనకాలతో భక్తితో పరవశించిపోయారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ పర్యవేక్షణలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రకాష్ గౌడ్.. కాంగ్రెస్‌లోకి దౌడ్!

> ప్రజల శ్రేయస్సు కోసమే పార్టీ మారుతున్నా
>
> రాజేంద్రనగర్ నియోజవర్గంలో అనేక పనులు మధ్యలో ఉండటంతో పాటు మరికొన్నింటిని మొదలు పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. వాటిని సాధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా చేయాలనే ఉద్దేశంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నా. తనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన ఓ ప్రజాప్రతినిధి, నాయకులు, కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌లో చేరుతారు.
>
> - ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్యే



సీఎం సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న ప్రకాశ్ గౌడ్ (ఫైల్)

- నేడు హస్తం గూటికి చేరనున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే
- తిరుమల శ్రీవారి దర్శనం నుంచి నేరుగా సీఎం ఇంటికి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్. ముందుగా ఊహించినట్లే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కారు దిగి.. హస్తం గూటికి చేరనున్నారు. ఆయనతో పాటు మరికొంత మంది నేతలు పార్టీని వీడే అవకాశం ఉంది. ఆయన ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నా.. ముందుగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆ మేరకు ఇదే అంశంపై బుధవారం క్షేత్రస్థాయి కేడర్‌తో చర్చించిన ఆయన గురువారం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. స్వామి దర్శనం అనంతరం శుక్రవారం ఆయన నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి ఇంటికి చేరుకోనున్నా రు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆయనతో పాటు మణికొండ, బండ్లగూడ జాగీర్, శంషాబాద్ మున్సిపాలిటీలకు చెందిన కీలక నేతలు కూడా పార్టీ మారే అవకాశం ఉన్నట్లు తెలిసింది. టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ప్రకాష్‌గౌడ్.. 2009, 2014లలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి అదే పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఇప్పటికే రెండు పార్టీలు మారిన ఆయన తాజాగా కాంగ్రెస్ గూటికి చేరనుండటం చర్చనీయాంశంగా మారింది.

అప్పట్లోనే పార్టీ కండువాతో ప్రత్యక్షం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రకాశ్ గౌడ్ ప్రత్యక్షమయ్యారు. ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి సమక్షంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పారు. అయితే.. క్షేత్రస్థాయి కేడర్ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో చేరికను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు మాట మార్చారు. ఆ తర్వాత కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రెండుసార్లు కలిశారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి హైదరాబాద్ శివారు ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా పార్టీలోనే ఉంటామని, ప్రతిపక్ష పాత్ర గట్టిగా పోషిస్తామని హామీ ఇచ్చి వచ్చారు. నాలుగు రోజుల క్రితం బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో జీహెచ్‌ఎంసీలో వ్యవహరించాల్సిన తీరుపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలోనూ ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, వివేకానంద, బండారి లక్ష్మారెడ్డిలతో కలిసి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారు. త్వరలోనే వీరంతా పార్టీ మారనున్నట్లు ప్రచారం కూడా జరిగింది. కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని తాజాగా ఆయన ప్రకటించి.. పార్టీ మార్పు ఊహాగానాలకు తెరదించారు.

బస్సుల్లేక..



- ఐటీ కారిడార్‌లతో పాటు శివార్లకు బస్సులు పెంచాలి
- ఔటర్‌ను దాటి విస్తరిస్తున్న మహానగరం
- సామాజిక మాధ్యమ వేదికలుగా ఆర్టీసీ ఎండీకి సిటీజనుల ఫిర్యాదుల వెల్లువ
- ర్యాష్ డ్రైవింగ్, బస్టాపుల్లో నిలపకపోవడంపైనా ఆందోళన

- సాక్షి, సిటీబ్యూరో

- 'ఉదయం, సాయంత్రం తగినన్ని బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. సమయానికి కాలేజ్‌కి వెళ్లలేకపోతున్నాం. నగర శివార్లలోని ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల కోసం రద్దీకనుగుణంగా బస్సులు పెంచండి' ఓ విద్యార్థి ఆవేదన.
- 'ఐటీ కారిడార్లకు ఇచ్చే ప్రాధాన్యం ఇతర ప్రాంతాలకు ఇవ్వడం లేదు. శివార్లకు బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం' ఓ ఉద్యోగి ఆందోళన.
- ఆర్టీసీ డ్రైవర్‌లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. బస్టాపుల్లో కాకుండా రోడ్డు మధ్యలోనే బస్సులను నిలుపుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలి.. ఓ మహిళా ప్రయాణికురాలి వినతి.

...ఒకరు, ఇద్దరు కాదు.. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల నిర్వహణపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. 'ఎక్స్' వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని సిటీ ప్రయాణికులు తమ సమస్యలపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు విన్నవిస్తున్నారు. ఇటీవల ఐటీ కారిడార్‌లకు బస్సులను పెంచేందుకు ఆర్టీసీ ఆన్‌లైన్ సర్వే చేపట్టింది. ప్రయాణికుల విజ్ఞప్తులు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు సజ్జనార్ 'ఎక్స్' ద్వారా తెలిపారు. దీంతో చాలామంది సిటీ బస్సుల నిర్వహణపైన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బస్సులు అందుబాటులో ఉండడం లేదని విస్మయం వ్యక్తం చేశారు.

ఔటర్ టు సిటీకి బస్సులు పెంచాలి...

- ఔటర్ చుట్టుపక్కల ఉన్న కాలనీల నుంచి నగరంలోని ప్రధాన ప్రాంతాలకు ప్రస్తుతం అరకొర కనెక్టివిటీ ఉంది. వందలాది కాలనీలకు ఉదయం, సాయంత్రం ఒకటి, రెండు ట్రిప్పులు మాత్రమే బస్సులు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు సెవెన్ సీటర్ ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సివస్తోంది. బాలాపూర్, ఆదిభట్ల, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, మీర్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి హైటెక్ సిటీకి నేరుగా బస్సులు అందుబాటులో లేవు. దీంతో ఐటీ కారిడార్‌లలో పనిచేసే సామాన్య ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని రూట్లలో కనీసం రెండు, మూడు బస్సులను ముగించుకొని ఇంటికి వెళ్లాలంటే ఎంతో కష్టంగా ఉంది.' అని మహిళా ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌ను అరికట్టాలి...

మరోవైపు సిటీ బస్ డ్రైవర్‌ల ర్యాష్ డ్రైవింగ్ పట్ల నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఎడమవైపున వేగంగా దూసుకొచ్చే బస్సుల వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టుకొని వాహనాలను నడపవలసి వస్తుంది. బస్సులు బస్టాపుల్లో కాకుండా రోడ్డు మధ్యలో నిలుపుతున్నారు. దీంతో బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా కష్టంగా ఉందంటూ మహిళా ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మారవలసి వస్తుందంటూ పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. 'బాలాపూర్, ఆదిభట్ల ప్రాంతాల నుంచి హైటెక్‌సిటీకి బస్సులు నడపండి'.అంటూ మరోప్రయాణికుడు ఆర్టీసీ ఎండీకి విజ్ఞప్తి చేశారు.

- ఆరాంఘర్ నుంచి షాద్‌నగర్ వైపు ఉన్న కాలనీలకు సిటీ బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల ఆ రూట్‌లోని పలు కాలనీలకు చెందిన ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తుంది. 'సాయంత్రం వేళల్లో ఇబ్బందిగా ఉంటుంది. డ్యూటీ

అరకొరగా సిటీబస్ కనెక్టివిటీ

కాలేజీలకు ఎలా వెళ్లాలి...

- దిల్‌సుఖ్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఇంజనీరింగ్, ఒకేషనల్ విద్యాసంస్థలు ఉన్నాయి. అలాగే ఘట్కేసర్, కీసర, గండిమైసమ్మ, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న విద్యాసంస్థలకు లక్షలాది మంది విద్యార్థులు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తారు. కానీ ఉదయం, సాయంత్రం విద్యార్థుల రద్దీ, డిమాండ్ మేరకు బస్సులు లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. సెవెన్‌సీటర్ ఆటోలు, సొంత బైక్‌లలో రాకపోకలు సాగిస్తున్నారు. 'ప్రతి రోజు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేస్తున్నాం. ఐటీ కారిడార్‌లలోనే కాదు. కాలేజ్ రూట్‌లపై కూడా దృష్టి సారించండి.' అంటూ ఓ విద్యార్థి 'ఎక్స్' లో పోస్ట్ చేయడం గమనార్హం. పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాలకు సైతం సిటీ బస్సు కనెక్టివిటీ అరకొరగానే ఉంది.
- లంగర్‌హౌస్, బాపూఘాట్ తదితర ప్రాంతాల నుంచి శంకర్‌పల్లి, చేవెళ్ల వైపు బస్సుల సంఖ్య పెంచాలంటూ స్థానికంగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజూ లక్షలాది మంది రాకపోకలు సాగించే రూట్‌లలో బస్సులు పెంచకుండా కేవలం సిటీలోని కొన్ని ప్రాంతాలకే బస్సులను పరిమితం చేస్తున్నారంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి హైటెక్‌సిటీకి బస్సులను పెంచాలి. అలాగే బాచుపల్లి–హైటెక్‌సిటీ రూట్లో ట్రిప్పుల సంఖ్య పెరగాలి. జేఎన్‌టీయూ నుంచి దివ్యశ్రీనగర్‌కు బస్సులు నడపాలంటూ నగరవాసులు ఆర్టీసీకి విజ్ఞప్తి చేశారు.
- నల్లగండ్ల ఫ్లై ఓవర్ రూట్‌లో ఇనార్బిట్ మాల్ వరకు గతంలో నడిచిన సిటీ బస్సులను పునరుద్ధరించాలి.
- తెల్లాపూర్, నల్లగండ్ల, కోకాపేట్ తదితర ప్రాంతాలకు బస్సులను విస్తరించాలి.

జోన్‌కు 5

గ్రేటర్ పరిధిలో వాన నీటి సంపుల నిర్మాణం



10 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న సంపులు.. వాటికి తొలుత నిర్ణయించిన సామర్థ్యం వివరాలు ప్రాంతాల వారీగా

ప్రాంతం	సంపు సామర్థ్యం (లక్షలలీటర్లలో)
పీవీఎన్‌ఆర్ పిల్లర్ నెంబర్ 264	1.5
కరోల్‌బాగ్ 'ఎ'	2.0
నేతాజీనగర్ కాలనీ, లంగర్‌హౌస్	2.0
రంగమహల్ వై జంక్షన్	1.5
ఇమేజ్ హాస్పిటల్ లేన్	1.5
జోయాలుక్కాస్ యూ టర్న్	2.0
రాజీవ్‌గాంధీ విగ్రహం (సోమాజిగూడ)	0.25
ద్వారకా హోటల్ ముందు (లక్డీకాపూల్)	0.10
ఓల్డ్ కేసీపీ	3.0
ఆర్టీఏ ఆఫీస్ (ఖైరతాబాద్)	3.0
లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్	4.0
అయ్యప్పసొసైటీ క్రాస్‌రోడ్స్	2.5

- నీరు నిలవకుండా.. ట్రాఫిక్ ఆగకుండా
- 11 ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో..
- ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత వర్షాకాలానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నగరంలోని రోడ్లు చెరువులుగా కనిపించకూడదని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేయనుంది. వర్షం వస్తే నీరు నిలిచే ప్రాంతాల్లో పరిష్కార మార్గంగా రోడ్ల కింద భూగర్భంలో సంపులు (వాననీరు అందులోకి వెళ్లేలా) నిర్మించాలని భావించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకనుగుణంగా తొలిదశలో కొని ప్రాంతాల్లో సర్వే నిర్వహించిన అధికారులు నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో, ప్రజలకు ఎక్కువ సమస్యాత్మకంగా ఉంటున్న 11 ప్రాంతాల్లో వాననీటి సంపుల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. వాటిలో ఒక్కదానికి మాత్రం టెండరు దాఖలు కాగా మిగతా వాటికి కాలేదు. ఈ నేపథ్యంలో ఆ 11 ప్రాంతాల్లోనూ తొలుత నిర్ణయించిన దానికంటే సంపుల సామర్థ్యం పెంచాలని సచివాలయ వర్గాలు సూచించడంతో అందుకు సిద్ధమయ్యారు. తొలుత సంపుల సామర్థ్యం కనిష్టంగా 25వేల లీటర్ల నుంచి గరిష్టంగా 4 లక్షల లీటర్లు కాగా, ప్రస్తుతం అన్నింటి సామర్థ్యం 10 లక్షల లీటర్లుండాలని నిర్ణయించారు. టెండర్లలో మార్పులు చేసి అందుకనుగుణంగా త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. నగరంలో ప్రతియేటా ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్య భారీ వర్షాలు కురిసిన అనుభవాలుండటంతో వీలైనంత త్వరగా సంపులు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వాటర్ లాగింగ్ ప్రాంతాలు 140..

నగరంలో వానకురిస్తే రోడ్లపై నీరు నిలిచే (వాటర్‌లాగింగ్) ప్రాంతాలు దాదాపు 140 ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం, పోలీసు విభాగాలు గుర్తించాయి. ఆ ప్రాంతాల్లోనూ రోడ్ల కింద వాన నీటి సంపులు నిర్మించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలోని ఆరు జోన్లలోనూ జోన్‌కు కనీసం 5 వాటర్ లాగింగ్ ప్రాంతాల్లోనైనా సంపులు నిర్మించాల్సిందిగా మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సూచించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆ పనిలో పడ్డారు. ఈ ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల భారీ సామర్థ్యంతో కాకుండా క్షేత్రస్థాయి పరిస్థితులకనుగుణంగా అక్కడ నిలిచిపోయే నీటి కంటే రెట్టింపు సామర్థ్యంతో సంపులు నిర్మించనున్నారు.

- వర్షం వచ్చినప్పుడు వాననీరు ఈ సంపుల్లోకి చేరుతుంది. వర్షం వెలిశాక సంపుల్లోని నీటిని భారీ మోటారు పంపులతో సమీపంలోని నాలాల్లోకి తరలిస్తారు. వీటిల్లో లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌కు ఇప్పటికే టెండర్లు దాఖలయ్యాయి. మిగతా ప్రాంతాల్లో ఇంకా టెండర్లు దాఖలు కాకపోవడంతో సామర్థ్యం పెంపుతో రివైజ్డ్ టెండర్లు పిలవనున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

'గోర్ బంజారా వాచకరణి' పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో మూడ కృష్ణ చౌహాన్ రచించిన 'గోర్ బంజారా వాచకరణి' పుస్తకాన్ని గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. బంజారా భాషకు వ్యాకరణాన్ని రచించడం ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వం సాంస్కృతిక సంపదను వెలికితీసే ప్రయత్నం చేస్తోందన్నారు. చరిత్రకు తెలియని ఎన్నో విషయాలను పుస్తక, డాక్యుమెంటరీల రూపంలో తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

40 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన

- ట్రిపుల్ ఆర్ హైదరాబాద్ ముఖచిత్రాన్నే మారుస్తుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి
- నవాబ్ అలీ జంగ్ లైఫ్‌టైం అవార్డుల ప్రదానోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నవాబ్ అలీ జంగ్ లైఫ్‌టైం అచ్చీవ్‌మెంట్ అవార్డు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

ఖైరతాబాద్: రూ.40 వేల కోట్లతో మూసీ నదీ ప్రక్షాళన, ఎక్కడికక్కడ ఎస్టీపీల నిర్మాణం చేపట్టి టూరిజం స్పాట్‌గా మార్చనున్నట్లు ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నవాబ్ అలీ జంగ్ బహదూర్ 147వ జయంతి సందర్భంగా 11వ తెలంగాణ ఇంజనీర్స్ డేను గురువారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబ్ అలీ జంగ్ జనాబ్ బహదూర్ మెమోరియల్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను పలువురు ప్రముఖులకు మంత్రి కోమటిరెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాగునీటి రంగ పితామహుడు నవాబ్ అలీ జంగ్ బహదూర్ అని, ఆయన మొట్టమొదటి స్వదేశీ చీఫ్ ఇంజనీర్‌గా రికార్డు సృష్టించారన్నారు. అప్పటి టెక్నాలజీతో 58 టీఎంసీల సామర్థ్యం గల నిజాం సాగర్ ప్రాజెక్ట్ నిర్మించగా, దానికి ఇప్పటికీ పగుళ్లు రాలేదన్నారు. కానీ, ఇంత టెక్నాలజీ పెరిగిన తరువాత నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్ట్ పరిశీలనకు వెళ్లిన మంత్రుల బృందానికి బ్రిడ్జిపై ఆ చివరి నుంచి ఈ చివరకు వెళ్తామా అనే అనుమానం వచ్చిందన్నారు. గతంలో నిర్మించిన ప్రాజెక్టులలో పాలు పంచుకున్న ఇంజనీర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణం హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

త్వరలోనే ఉప్పల్– ఘట్కేసర్ ఫ్లై ఓవర్...

ఉప్పల్– ఘట్కేసర్ ఫ్లై ఓవర్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇంజనీర్స్ భవన నిర్మాణం కోసం ఎకరం స్థలం ఇచ్చే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి కేటాయించే విధంగా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సమిష్టి నిర్ణయాలతో కలిసి కట్టుగా ముందుకు సాగుతామని తెలిపారు. 'మీకు ఏ సమస్య వచ్చినా, నన్ను తోటి ఇంజనీర్‌గా భావించి నా దృష్టికి తీసుకురావాలి' అని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సెంటర్ ఐఈఐ చైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య, డీఎస్.రెడ్డి, కె.కిషన్, సాంబయ్య, చంద్రమౌళిలతోపాటు ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు

ఈ సందర్భంగా నవాబ్ అలీ జంగ్ జనాబ్ బహదూర్ మెమోరియల్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను ఎన్ఐటీ వరంగల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.జి.శాస్త్రి, రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.ఎ.కరీం, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎస్.జశ్వంత్ కుమార్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ చంద్రమౌళి, ఐఈఐ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ రమణానాయక్, ఆర్ అండ్ బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, తెలంగాణ స్టేట్ సెంటర్ సెక్రటరి డాక్టర్ కె.సీతారాంబాబులకు అందజేశారు.

ఘనంగా డ్యూక్స్ వాఫీ 25వ వార్షికోత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: ఎఫ్ఎంసీజీ పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన డ్యూక్స్ వాఫీ ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డ్యూక్స్ వాఫీ డే నేపథ్యంలో వారం రోజులపాటు వివిధ పాఠశాలల్లో డ్రాయింగ్, స్పెల్లింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులు అందించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు కూడా విభిన్న గేమ్స్ నిర్వహించారు. 1999లో ప్రారంభమైన డ్యూక్స్ వాఫీ బిస్కెట్లు, వేఫర్లు, మిఠాయి విభాగాలలో అగ్రగామిగా నిలిచిందని యాజమాన్యం తెలిపింది. ఈ ప్రయాణంలో వంద కోట్ల రూపాయల స్థాయికి బ్రాండ్ ఎదిగిందని పేర్కొన్నారు.

టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం సెక్షన్ ఆఫీసర్ కబీర్ ఉల్లాఖాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఉప్పర్‌పల్లి ప్రాంతంలోని తమ పొలం గుండా రోడ్డు నిర్మించినందున నష్టపరిహారం ఇవ్వాలని ముక్రముద్దీన్ ఖాన్ అనే రైతు దరఖాస్తు చేశాడు. అప్పట్లో ఈ విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ కృష్ణమోహన్‌తోపాటు సెక్షన్ ఆఫీసర్ కబీర్ ఉల్లాఖాన్ తప్పుడు నివేదికను అధికారులకు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఐదు కోట్ల 78 లక్షల రూపాయల టీడీఆర్‌ను అందజేసింది. తప్పుడు నివేదిక అందించినట్లుగా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు గుర్తించి బాధ్యులైన కృష్ణమోహన్, కబీర్ ఉల్లా ఖాన్‌లను సస్పెండ్ చేశారు. కృష్ణమోహన్ ప్రస్తుతం ఖైరతాబాద్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం కబీర్ ఉల్లాఖాన్‌కు సస్పెన్షన్‌కు సంబంధించిన పత్రాలను అందించినట్లు ఉపకమిషనర్ రవికుమార్ వెల్లడించారు.

డీజీపీని కలిసిన సీపీ



నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి గురువారం నూతన డీజీపీ డాక్టర్ జితేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లి జితేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఎమరాల్డ్ స్వీట్‌హౌస్‌కు నోటీసులు

- కలర్స్ కల్పిన 60 కిలోల బెల్లం, మూడు కిలోల జీడిపప్పు సీజ్
- ల్యాబ్‌కు శాంపిల్స్‌ను తరలించిన అధికారులు
- తనిఖీలు చేసిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు


ఎమరాల్డ్ స్వీట్స్ కిచెన్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు


అపరిశుభ్రంగా ఉన్న కిచెన్


అధికారులు సీజ్ చేసిన బెల్లం, జీడిపప్పు

కవాడిగూడ: నగరంలో ఆర్గానిక్ ఫుడ్స్‌కు అత్యంత ప్రాచుర్యం పొందిన ఇందిరాపార్కు వద్ద గల ఎమరాల్డ్ స్వీట్ హౌస్‌లో గురువారం అంబర్‌పేట్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి, సికింద్రాబాద్, మల్కాజిగిరి సర్కిల్ ఫుడ్‌సేఫ్టీ అధికారి జంగారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కిచెన్‌లో ఎలుకలు పరుగులు పెడుతూ కంపు కొడుతూ దుర్గంధ భరితమైన వాతావరణంలో స్వీట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన పాలు, పెరుగు, పన్నీర్ తదితర స్వీట్స్ తయారీకి వాడే మెటీరియల్స్‌ను సీజ్ చేశారు. స్వీట్లు తయారీలో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగించినట్లు గుర్తించారు. సరైన లేబుల్ లేని వాటర్ క్యాన్లు, సరైన మెడికల్ సర్టిఫికెట్లు లేని ఫుడ్ హ్యాండిలర్స్‌ను గుర్తించి సీజ్ చేశారు. మిఠాయిలో వాడే ముడి సరుకులకు సరైన లేబుల్ లేకపోవడంతో అధికారులు ఎమరాల్డ్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల సందర్భంగా సేకరించిన శాంపిల్స్‌ను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్లోర్ గోడలు, డ్రైనేజీ సిస్టం సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, పెస్ట్ కంట్రోల్ రికార్డులు సరిగ్గా లేవని, వాటిపై త్వరలో నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. స్వీట్స్‌పై ఎక్స్‌పైరీ డేటును ఖచ్చితంగా ముద్రించాలని నిర్వాహకులకు సూచించారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ కోర్టుల్లో నిరసనలు

సిటీ, కోర్టులు : సిద్దిపేటలో ఈ నెల 9వ తేదీన రవికుమార్ అనే న్యాయవాదిపై సిద్దిపేట ఏఎస్ఐ ఉమారెడ్డి దాడిని ఖండిస్తూ గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు, సిటీ సివిల్ కోర్టుతో పాటు అన్ని కోర్టులలో ఆయా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి రోడ్లపై బైఠాయించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయవాదులకు రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన చట్టాల్లో పోలీస్ అధికారులకే ఎక్కువ అధికారాలు ఉన్నాయని తెలిపారు. న్యాయవాదులను పోలీస్ అధికారులు లెక్కచేయకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంతకు ముందు భద్రాచలం, వరంగల్‌తో పాటు చాలా ప్రాంతాల్లో న్యాయవాదులపై దాడులు జరిగాయని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వాల తీరు ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో ఈ నిరసనలు తీవ్రమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు రాజిరెడ్డి, జక్కుల లక్ష్మణ్, నాగేందర్, హనీఫ్ ఖాన్, నరేంద్రనాథ్, గంపా వెంకటేశం, అమర్‌గుప్తా, శేఖర్, రామాంజనేయులు, ఈశ్వర్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

మేడ్చల్: చిన్నారి(8)పై అత్యాచారం చేసిన యువకుడికి మేడ్చల్ న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ జ్యుడీషియల్ పరిధిలోని శామీర్‌పేట మండలం దేవరయంజాల్ గ్రామంలో మంద సాయికిరణ్(27) 2017 మార్చి 19న చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మేడ్చల్ పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం సాయికిరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా, బాలికకు మూడు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి జీవన్‌కుమార్ తీర్పు వెల్లడించారు.

వైట్‌నర్ మత్తులో యువకుల హల్‌చల్




వైట్‌నర్ మత్తులో హల్‌చల్ చేస్తూ, దాడులకు పాల్పడుతున్న వ్యక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో వైట్‌నర్ బ్యాచ్‌లు హల్‌చల్ సృష్టించాయి. మత్తులో ఉన్న యువకులు ఒకరిమీద మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన రెజిమెంటల్ బజార్‌లో చోటు చేసుకుంది. వివరాలు... రెజిమెంటల్ బజార్‌లో కొంతకాలంగా ఉదయం, రాత్రి వేళల్లో వైట్‌నర్ సేవించిన యువకులు రోడ్డుపైనే నానా హంగామా చేస్తున్నారు. మత్తులోకి జారుకున్న తరువాత ఎవరు కనిపిస్తే వారితో గొడవకు దిగడం, దాడులు చేయడం సర్వ సాధారణంగా మారిపోయింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వైట్‌నర్ మత్తులో రెండు గ్రూప్‌లుగా విడిపోయి కట్టెలతో పరస్పర దాడులు చేసుకున్నారు. అడ్డుకునేందుకు యత్నించిన పాదచారులపై కూడా దాడికి దిగారు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి రాగా, వైట్‌నర్ బ్యాచ్‌లు పరారయ్యాయి.

ఎస్సై చొక్కా పట్టిన మహిళ

ఘర్షణకు దారి తీసిన పెంపుడు కుక్క వ్యవహారం


శిల్పా ఆమె భర్తను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

అల్వాల్: బహిరంగ ప్రదేశాలలో చెత్తవేయడంతోపాటు పెంపుడు కుక్క మల విసర్జన చేయిస్తున్నారని వచ్చిన ఫిర్యాదును విచారిస్తున్న ఎస్సైపై ఓ మహిళ దురుసుగా ప్రవర్తించింది. ఎస్ఐ చొక్కా పట్టుకుని దాడి చేయబోయింది. ఈ ఘటనలో సదరు మహిళతోపాటు ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ గణేష్ ఎన్‌క్లేవ్‌లో నివాసముండే వెంకటేశ్వరరావు, శిల్ప దంపతులు తమ పెంపుడు కుక్కను ఇంటి బయట బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేయించడంతో పాటు చెత్త వేస్తున్నారు. ఈ విషయమై పొరుగున ఉండే పవన్ అనే వ్యక్తి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తుండగా ఎస్సై సురేష్‌పై శిల్ప బెదిరింపులకు పాల్పడుతూ చొక్కా పట్టుకుంది. దీంతో చెత్త గొడవ కాస్త సీరియస్ అయింది. ఆ దంపతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ మేరకు శిల్పా, ఆమె భర్త వెంకటేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వరావు ఒక కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడటం వారం రోజులలో ఇది రెండోది.

'వివాహభోజనంబు' రెస్టారెంట్‌పై దాడులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని రెస్టారెంట్ల నిబంధనల అతిక్రమణలపై అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సికింద్రాబాద్‌లోని వివాహ భోజనంబు రెస్టారెంట్‌పై అధికారులు గురువారం దాడి చేశారు. ఈ దాడుల్లో కాలం చెల్లిన చిట్టిముత్యాలు బియ్యం, సింథటిక్ రంగులు కలిపిన కొబ్బరి తురుము, సరైన లేబుల్స్ లేకుండా నిల్వ ఉంచిన పదార్థాలు, ఫుడ్ హ్యాండ్లర్స్‌కి ఉండాల్సిన మెడికల్ సర్టిఫికెట్లు లేకపోవడం, కిచెన్ పరిసరాల్లో డ్రైనేజీ వాటర్ నిల్వ ఉండడం...తదితర ఉల్లంఘనలు గుర్తించారు. దీంతో రెస్టారెంట్‌పై కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన


కరపత్రాలను అందజేస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

హిమాయత్‌నగర్: అమాయకులకు వివిధ రకాలుగా ఆశచూపి లక్షల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. దీంతో నగర సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం మలక్‌పేట యశోద హాస్పిటల్స్‌లో ఉద్యోగులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రేడింగ్, ఫేక్ లోన్ యాప్‌లు, ఫెడెక్స్, బీఎస్ఎన్ఎల్, ట్రాయ్ మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్‌లు, సోషల్ మీడియా ద్వారా వేధింపులపై సైబర్ క్రైమ్ పోలీసులు వారికి అవగాహన కల్పించారు. నకిలీ వెబ్ సైట్లు, నకిలీ యాప్, సోషల్ మీడియా ప్రకటనలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైనట్లయితే బాధితులు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు డయల్ చేసి లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

హింసిస్తున్నాడని భర్తపై గర్భిణీ ఫిర్యాదు

వెంగళరావునగర్: కట్టుకున్న భార్య.. అందునా గర్భిణీ. అయినా అతడికి కనికరంలేదు. అనుమానం పెంచుకుని నిత్యం వేధింపులకు గురి చేస్తుండటంతో పోలీసులను ఆశ్రయించింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన జగదీష్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో ఉండే ఓ యువతి కొన్నేళ్ల కిందట మధురానగర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో పనిచేసేవారు. ఇరువురి మధ్య పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలం ప్రేమలో ఉన్న ఇరువురూ గతేడాది వివాహం చేసుకున్నారు. రెండు నెలలు గడవకముందే ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఇప్పుడు ఆమె ఏడునెలల గర్భవతి. ఆమె గర్భం దాల్చిన నాటి నుంచి డబ్బు కావాలంటూ తీవ్రంగా వేధిస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అతడి వేధింపులకు తాళలేక ఆమె గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

29,240 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

దుండిగల్: భారీ మొత్తంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు దుండిగల్, మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు గురువారం దుండిగల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్–5 వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ నుంచి దుండిగల్‌కు వస్తున్న లారీని ఆపి తనిఖీలు నిర్వహించగా, ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ దస్తగిరి, క్లీనర్ రిజ్వాన్‌లను విచారించగా నాందేడ్‌కు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తమను హైదరాబాద్ మలక్‌పేట్‌లోని అహ్మద్ హుస్సేన్‌ను కలవమని చెప్పాడని, అతను ఇచ్చే పీడీఎస్ బియ్యం లోడ్ తీసుకుని పటాన్ చెరువులో ఓ వ్యక్తిని కలవమని చెప్పినట్లు పేర్కొన్నారు. కాగా, లారీలో 29,240 కిలోల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు దుండిగల్ సీఐ శంకరయ్య తెలిపారు. ఈ మేరకు షేక్ దస్తగిరి, రిజ్వాన్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు మిగతా నిందితులను పట్టుకునే దిశగా దర్యాప్తు చేపడుతున్నారు.

చుక్కేసి నడిపారు... చుక్కలు చూశారు!

- పది రోజుల్లో చిక్కిన 1,614 మంది 'నిషా'చరులు
- ముగ్గురికి 15 రోజుల చొప్పున జైలుశిక్ష
- జైలుకు 55 మంది, 8 లైసెన్సుల సస్పెన్షన్
- నగర అదనపు సీపీ(ట్రాఫిక్) విశ్వప్రసాద్ వెల్లడి





సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే 'నిషా'చరులపై ట్రాఫిక్ విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పట్టుకున్నారు. ఈ నెల మొదటి పది రోజుల్లో చేపట్టిన తనిఖీల్లో మొత్తం 1,614 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కినట్లు అదనపు సీపీ (ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్ గురువారం వెల్లడించారు. ఇలా పట్టుబడిన వారిలో 1,346 మంది ద్విచక్ర వాహనచోదకులు ఉన్నారని చెప్పారు. వీరిలో 992 మందిపై కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశామన్నారు. ఈ ఉల్లంఘనను న్యాయస్థానం సైతం తీవ్రంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మొత్తం 55 మందికి జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. వీరితోపాటు మొత్తం 992 మందికి కలిపి కోర్టు రూ.21.36 లక్షలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. డ్రంక్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కిన వారు సేవించిన మద్యం మోతాదు తదితరాలను పరిశీలించిన కోర్టు ఎనిమిది మంది డ్రైవింగ్ లైసెన్సుల్ని సస్పెండ్ చేసినట్లు విశ్వప్రసాద్ తెలిపారు. జైలుకు వెళ్లిన 55 మంది మందుబాబుల్లో ముగ్గురికి 15 రోజులు, ఇద్దరికి ఆరురోజులు, 30 మందికి నాలుగు రోజులు, ఐదుగురికి మూడు రోజులు, 14 మందికి రెండు రోజులు, ఒకరికి ఒక రోజు శిక్ష పడింది. వీరిలో ఐదుగురి డ్రైవింగ్ లైసెన్సులను ఆరు నెలలు, ఒకరిది నాలుగు నెలలు, ఇద్దరివి రెండు నెలల చొప్పున సస్పెండ్ చేసింది. నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి 100 ఎంఎల్(మిల్లీ లీటర్లు) రక్తంలో 30 ఎంజీ (మిల్లీ గ్రాములు) ఆల్కహాల్ ఉంటే అది ఉల్లంఘన కిందికి వస్తుంది. దీన్ని బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ (బీఏసీ)గా వ్యవహరిస్తారు.

79 మందిలో 200 ఎంజీ ఆల్కహాల్

ఈ పది రోజుల్లో చిక్కిన 1,346 మంది ద్విచక్ర వాహనచోదకుల్లో 79 మందికి బీఏసీ కౌంట్ 200 ఎంజీ కంటే ఎక్కువ ఉందని తేలింది. అంటే వీరి 100 ఎంఎల్ రక్తంలో 200 ఎంజీ ఆల్కహాల్ ఉన్నట్లు తేలింది. ఈ ఉల్లంఘనులకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కౌన్సెలింగ్‌ఇస్తున్నామని, మద్యం తాగి వాహనాలు నడపటం చోదకుడితోపాటు ఎదుటి వారికీ ప్రమాదహేతువని విశ్వప్రసాద్ వివరించారు.

దేశానికి తలమానికంగా హైదరాబాద్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం నేడు దేశానికే తలమానికంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నగరాలను అభివృద్ధిపథంలో దూసుకుపోయేలా ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వం చూపొందిస్తోందన్నారు. గురువారం ఎర్రగడ్డ డివిజన్‌లోని వాసవి బృందావన్ కమ్యూనిటీవాసులతో సమావేశమయ్యారు. కమ్యూనిటీలు, కాలనీల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, వాటర్, రోడ్ల సమస్యలను స్థానికులు కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. అన్ని సమస్యలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. వాసవిబృందావన్‌తో పాటు నియోజకవర్గంలోని పలు చోట్ల అభివృద్ధిపనులను ప్రారంభించారు. తాను అవినీతికి పాల్పడనని, దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని తెలియజేశారు. వాసవి బృందావన్ ప్రెసిడెంట్ వీరయ్యగుప్తా, వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, జనరల్ సెక్రటరీ రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ శ్యాంసుందర్, నేతలు గౌతంరావు, లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కీర్తిరెడి జూటూరి, డాక్టర్ పద్మ వీరపనేని, గంగరాజు, ఈదులగంటి రాజేష్, అనంతలక్ష్మిచ, విజయ్‌కుమార్, రూప పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా...

వెంగళరావునగర్: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యలపై పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ ఎల్ఎన్ నగర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు తెలియజేశారు. స్పందించిన మంత్రి త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్నన్ని రోజులూ అన్ని డివిజన్లలో పర్యటిస్తూ ఉంటానన్నారు. పలు ప్రాంతాల్లో మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలపై యుద్ధానికి విద్యార్థులు!

- దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన
- ప్రతి పాఠశాలలోనూ వలంటీర్లు
- ఇళ్లల్లో కూడా దోమల నిర్మూలనపై విద్యార్థులు దృష్టి పెట్టాలి


దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: దోమలపై యుద్ధానికి జీహెచ్ఎంసీ విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తోంది. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు వలంటీర్లుగా ఏర్పడి తమ పాఠశాల పరిసరాలతో పాటు సమీప బస్తీల్లో దోమల నిర్మూలనపై అవగాహన కలిగించేలా వారిని ఇందులో భాగస్వాములను చేసే దిశలో జీహెచ్ఎంసీ అధికారులు సరికొత్త ప్రణాళిక రూపొందించారు. దీనిని అమలుచేసే దిశలో ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దోమల నిర్మూలనపై, అవి పెరిగే ప్రాంతాలపై అవగాహన కలిగిస్తున్నారు. దోమలు ఎలా కుడతాయి.. లార్వా దశలోనే ఎలా అరికట్టాలి.. అనే విషయాలను జీహెచ్ఎంసీ ఎంటమాలజిస్ట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్‌లతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ తదితర డివిజన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో దోమల నివారణ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీ రోజూ దోమల నియంత్రణపై కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.
- ముఖ్యంగా లార్వా దశలోనే నిర్మూలిస్తే దోమ పెరిగే అవకాశాలు లేవని, విద్యార్థులు ఇక్కడి నుంచే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. లార్వా దశలోనే దోమలను అరికడితే ఇక అవి పెరగవని పేర్కొంటున్నారు. విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకున్న అంశాలను తమ ఇళ్లల్లో కూడా అనుసరించాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పేర్కొన్నారు. ఇటు పాఠశాలలోనూ, అటు ఇంట్లోనూ దోమలను నివారిస్తే దోమకాటుకు ఎవరూ గురికారని సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీ తెలిపారు.
- 14-22 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థులను వలంటీర్లుగా తయారుచేసే కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామన్నారు. కేవలం అవగాహన కలిగించడమే కాకుండా దోమలను అరికట్టేందుకు ఎంటమాలజీ విభాగం ఎలా ఫాగింగ్ చేస్తుందో, పిచికారి చేస్తున్నదో కూడా తెలియజేస్తున్నామన్నారు. ఇంకోవైపు ప్రతి తరగతి గదిలోనూ గోడలపై ఇతరత్రా బల్లలు, బెంచీలపై దోమలు వాలకుండా పిచికారీ కూడా చేస్తున్నామని ఆమె తెలిపారు.
- ప్రతి విద్యార్థీ బాధ్యతాయుతంగా ఈ పని నిర్వహిస్తే దోమల నివారణ సులువు అవుతుందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ప్రతి పాఠశాలలోనూ, కళాశాలలోనూ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.
- 15 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మిగతా 15 రోజులు డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేస్తామని ఈ సందర్భంగా సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీ స్పష్టం చేస్తున్నారు.


దోమలు ఎలా పెరుగుతాయ్.. ఎలా నివారిస్తామో అవగాహన కలిగిస్తున్న దృశ్యం

దేశాన్ని ప్రపంచ ఆరోగ్య రాజధానిగా మార్చడమే లక్ష్యంగా హెల్త్ స్మార్ట్ సిటీ


డాక్టర్ రవిశంకర్ పోలిశెట్టి

బంజారాహిల్స్: దేశాన్ని ప్రపంచ ఆరోగ్య రాజధానిగా మార్చే లక్ష్యంలో భాగంగా దశలవారీగా హెల్త్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని పాలీ సైంటిఫిక్ ఆయుర్వేద (పీఎస్ఏ) మార్గదర్శకులు డాక్టర్ రవి శంకర్ పొలిశెట్టి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో స్మార్ట్ హెల్త్‌సిటీ ప్రాజెక్టును రూపొందించిన ఆయన బుధవారం బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమాలను ప్రాజెక్టు గురించి వివరించారు. ఆరోగ్య సంరక్షణ, వైద్య శాస్త్రంలో అధునాతన ఆవిష్కరణలను సులభతరం చేయడం, నగరం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఆలోచనలకు బీజం వేసే లక్ష్యంగా ప్రాజెక్టును రూపొందించడం జరిగిందన్నారు. ఆధునిక వైద్యంతో ఆయుర్వేదం వంటి సంప్రదాయ వ్యవస్థలను సమన్వయం చేయాలన్నారు. దీని ద్వారా కీలకమైన సమాచారాన్ని సేకరించి సమగ్ర పరిష్కారాలను అందించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకముందే వాటిని నివారించడానికి వ్యూహాలను రూపొందించేలా ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందన్నారు.

ప్రతిఒక్కరికీ న్యాయం దక్కాలి

బంజారాహిల్స్: సుల్తాన్ ఉల్ ఉలుమ్ కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో గురువారం లీగల్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. సుల్తాన్ ఉల్ ఉలుమ్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతిఒక్కరికీ న్యాయం దక్కాలనే ఉద్దేశంతో ఫ్రీ లీగల్ ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు, త్వరలోనే మరిన్ని సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. కొంతమంది ఆర్థిక భారంతో తమకు దక్కాల్సిన న్యాయానికి దూరమవుతున్నారని, ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని తాము ఈ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్, కార్పొరేటర్ సర్ఫరాజ్ సిద్ధిఖీ, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఆమేర్ జావిద్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీహెచ్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నాగ కార్తీక్


అవార్డు అందుకుంటున్న దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: జనాభా నియంత్రణలో ఉత్తమ సేవలు అందించడంతో పాటు సరైన అవగాహన కార్యక్రమాలు కల్పించినందుకు గాను బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ నాగ కార్తీక్‌ను బెస్ట్ మెడికల్ అవార్డు వరించింది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాతా శిశు ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి చేతుల మీదుగా ఆయన బెస్ట్ మెడికల్ ఆఫీసర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగ కార్తీక్ మాట్లాడుతూ గత మూడు పర్యాయాలు తనకు ఈ అవార్డు వరించిందని ఈ అవార్డు తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో పాటు బాధ్యతను పెంచిందని అన్నారు.

కేఎల్‌హెచ్‌లో ఉత్సాహంగా ఎఫ్‌డీపీ


ఎఫ్‌డీపీకి హాజరైన అధ్యాపకులు

బంజారాహిల్స్: ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలను మెరుగుపరచడం, సృజనాత్మక బోధనా పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)లను నిర్వహిస్తున్నట్లు కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ తెలిపారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ ప్రోగ్రామ్ 12వ తేదీ వరకు జరుగుతుందని వివరించారు. కేఎల్‌హెచ్‌లోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం, ఐఈఈఈ కేఎల్‌హెచ్ఎస్‌బీ భాగస్వామ్యంతో 'ఎంపవరింగ్ ఎడ్యుకేటర్స్ విత్ ఏఐ అండ్ ఎంఎల్: స్ట్రాటజీస్ అండ్ అప్లికేషన్స్' శీర్షికన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో అత్యాధునిక ఏఐ, మిషన్ లెర్నింగ్ వ్యూహాలను ఏకీకృతం చేయడం ద్వారా అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే సైబర్ సెక్యూరిటీలో అత్యాధునిక మార్పులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అధ్యాపకులు నిరంతర అభ్యాసం చేసేలా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: వైద్యం చేయించుకోవడానికి సరైన ఆర్థిక స్థోమత లేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. యూసుఫ్‌గూడకు చెందిన కూరగాయల వ్యాపారి రాజు అయిదేళ్ల కూతురు సుచిత్ర గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా సర్జరీ కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం అయ్యాయి. పరిస్థితిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేత సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరించాలి


ఎమ్మెల్యే దానంకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ చైర్మన్ సతీష్

బంజారాహిల్స్: గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతుల్లో వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసిందని వీఆర్‌వో వ్యవస్థ రద్దు వల్ల గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వీఆర్‌వో వ్యవస్థను తిరిగి ప్రవేశ పెట్టాలంటూ తెలంగాణ వీఆర్‌వో జేఏసీ కమిటీ చైర్మన్ గోల్కొండ సతీష్‌తో పాటు పలువురు వీఆర్‌వోలు గురువారం ఎమ్మెల్యే దానంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రవేశ పెట్టి ప్రతీ సంక్షేమ పథకాన్ని గడపగడపకు తీసుకెళ్ళే విషయంలో వీఆర్‌వోలు కీలకంగా వ్యవహరించేవారని ఇప్పుడు ఆ వ్యవస్థ లేకపోవడంతో సంక్షేమ పథకాలు అర్హులకు చేరడం లేదని అన్నారు. వీఆర్‌వోలు లేనందున ఖరీదైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతుల్లో వ్యవస్థను రద్దు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఇటు వీఆర్‌వోలతో పాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అదనపు సెక్రటరీ పల్లెపాటి నరేష్, వైస్ చైర్మన్ చింతల మురళి, జేఏసీ నాయకులు రాము, ట్రెజరర్ శేఖర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనుల పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలో రూ. 81 లక్షల వ్యయంతో చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పర్యవేక్షించారు. త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఈ మణిపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కున్వర్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

23న శ్రీఎల్లమ్మ మారెమ్మ బోనాలు


పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లో కొలువుదీరిన శ్రీఎల్లమ్మ మారెమ్మ అమ్మవారి బోనాల పండుగ వేడుకలు ఈ నెల 23న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మందిరంలో గురువారం సమావేశమయ్యారు. దుర్గాభవానీనగర్, గౌతమ్‌నగర్, దీన్‌దయాళ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్ బస్తీ పెద్దలు, యూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్


రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

వెంగళరావునగర్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రముఖ రెజ్లర్ బొద్దం మహేష్ యాదవ్ జ్ఞాపకార్థం ఇంటర్నేషనల్ రెజ్లర్ కిరణ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో అండర్-23 హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యువతలో దాగిన నైపుణ్యాన్ని శిక్షణ తీసుకోవడం ద్వారా వెలికితీయవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నేతలు మనోజ్ యాదవ్, భవానీ శంకర్, కిరణ్ యాదవ్, ల్యాండ్‌మార్క్ శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, రఘు యాదవ్, కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి

రహమత్‌నగర్: అంటు వ్యాధులు ప్రబలకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్ పలు ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి అక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బస్తీల్లో ఫాగింగ్ చేయాలని శేరిలింగపల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్టు సంధ్యకు సూచించారు. అపరిశుభ్రంగా మారిన సున్నం చెరువులోని గుర్రపు డెక్క తొలగించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్ గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలుకొలుపుదాం అనే నినాదంతో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ అభివృద్ధిలో పాల్పంచుకోవాల్సిన యువత నేడు డ్రగ్స్ మత్తులో ఊగుతున్నారని ఇది అంత మంచి పరిణామం కాదని ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే డగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ఉంటే వాటి జోలికి పోరని ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. కళ్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌ను నిర్మూలించే అంశంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కార్యదర్శి నాగటి మారన్న, మహారాజ్, నగర ఉపాధ్యక్షుడు బిఆర్. నాయుడు, పి.మల్లేష్ గౌరి నాయుడు, రవి నాయక్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీకి శుభాకాంక్షలు



బంజారాహిల్స్: రాష్ట్ర నూతన డీజీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు జూబ్లీహిల్స్‌కు వచ్చిన జితేందర్‌ను వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్'పై అవగాహన అవసరం

హిమాయత్‌నగర్: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని తీసుకువచ్చారని, కానీ అందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల వద్ద అవగాహ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై ప్రధాని మోడీ పీఎంవో గ్రీవియన్స్‌కు సందేశం పంపించానని, వెంటనే స్పందించిన అధికారులు రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో పాటు, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని అన్ని స్థాయిలలో అన్ని ఆస్పత్రులలో ప్రవేశపెట్టాలని శ్రీధర్ పీఎంఓ కార్యాలయానికి లేఖ రాశారు. దీంతో పీఎంఓ ఆ సలహాకు స్పందించడం ఆనందంగా ఉందని కేశబోయిన శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. అధికారులు ఆయుష్మాన్ భారత్‌పై మరింత అవగాహన కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజావాణిలో వచ్చిన సమస్యకు జీహెచ్ఎంసీ పరిష్కారం

ఫిలింనగర్: బల్కాపూర్ చెరువులో కలుషితమైన నీరు వల్ల కౌసర్ కాలనీ దాని చుట్టుపక్కల కాలనీల బోర్లు కూడా కలుషితం అవుతున్నాయని ప్రజావాణిలో కౌసర్ కాలనీకి చెందిన వారు విన్నవించారు. జూబ్లీహిల్స్ నాలా మురుగు నీరు బల్కాపూర్ నాలా వెళుతుంది. తద్వారా కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నట్లు విన్నవించారు. కౌసర్ కాలనీ వాసులు విన్నపాన్ని అత్యవసరమని గుర్తించి బల్కాపూర్ నాలా కొత్త చెరువు వద్ద పూడికతీత పనులు జరుగుతున్నాయి. కొత్త చెరువు సర్ ప్లస్ వాటర్‌ను పునరుద్ధరణ చర్యలు కోసం కొత్తచెరువు నుంచి బల్కాపూర్ నాలా ఔట్ లెట్ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయనున్నారు. దీంతో వర్ష కాలంలో వరద ముంపు ఉండదని జీహెచ్ఎంసీ ప్రకటనలో తెలిపింది.

మరదలు కనిపించడం లేదని బావ ఫిర్యాదు

వెంగళరావునగర్: హాస్టల్‌లో ఉంటున్న తన మరదలు కనిపించడంలేదని ఆమె బావ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... మాధవరావు, పావని దంపతులు ఉప్పల్‌లో నివసిస్తుంటారు. పావని చెల్లెలు పల్లవి అమీర్‌పేటలోని మాంగళ్య షాపింగ్‌మాల్‌లో పని చేస్తూ హాస్టల్‌లో ఉంటుంది. ఈ నెల 10వ తేదీ పావనికి తన చెల్లెలు హాస్టల్ రూం మేట్స్ ఫోన్ చేసి పల్లవి కనిపించడం లేదని చెప్పారు. దాంతో మాధవరావు, పావనిలు హాస్టల్‌కు వచ్చి విచారించగా వార్డెన్ ఉదయం 5.30కు పల్లవి బ్యాగ్‌తో వెళ్లిపోయిందని, తన స్వగ్రామం వెళుతున్నట్టు చెప్పిందని తెలియజేసింది. ఆమె పని చేసే షాపింగ్‌మాల్‌కు వెళ్లి విచారించగా విధులకు రాలేదని చెప్పారు. తనతో పాటుగా జీవన్ అనే వ్యక్తి చనువుగా ఉంటాడని తెలియజేశారు. పల్లవికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుంది. గురువారం వరకు కూడా గ్రామానికి చేరలేదు. అనుమానం వచ్చి జీవన్‌కు ఫోన్ చేయగా అతను కూడా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దాంతో మాధవరావు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యవర్గం.. ఏకగ్రీవం


నూతన కార్యవర్గ సభ్యులు

ఫిలింనగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. 2024-26 సంవత్సరానికి గాను అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ బీ ధర్మానాయక్, ఉపాధ్యక్షుడిగా డి.వసంతరావు, జనరల్ సెక్రటరీగా పీ రజనీకాంత్, జాయింట్ సెక్రటరీగా ఎం.బుద్ధా, కోశాధికారిగా రెడ్యానాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బీ శ్రీవల్లి, ఎస్.లక్ష్మయ్య, సలహాదారులుగా ప్రొఫెసర్ చంద్రకళ, డాక్టర్ బీ శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

శుభాకాంక్షలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ స్టేట్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ని గురువారం ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. గ్రేటర్ జనరల్‌సెక్రటరీ రవిగౌడ్, మోసిన్ ఖురేషి, రమేష్‌నాయక్, ఎర్ర కృష్ణకుమార్, సత్యనారాయణ, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎర్రగడ్డ నేతలు

వీధికుక్కల బెడదను అరికట్టండి

శ్రీనగర్‌కాలనీ: నగరంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలుచోట్ల చిన్నారులు, వృద్ధులు, మహిళలు వీధికుక్కల బారిన పడి గాయాలపాయ్యారని, వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాటి కట్టడికి చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ కుర్రా సూర్యనారాయణ అన్నారు. గురువారం అమీర్‌పేటలోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... వీధికుక్కలు అధికమయ్యాయని, రాత్రివేళల్లో దాడులకు పాల్పడుతున్నాయన్నారు. వాటి నిర్మూలనకు సిబ్బందిని నియమించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఈ వర్షాకాలంలో దోమల నిర్మూలన, డ్రైనేజీ పునరుద్ధరణకు పనులను ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేతలు కుర్రా రమణయ్య, గంగా రవిచంద్రారెడ్డి, కోడిపల్లి కృష్ణ, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన.. నిలదీసిన భర్తపై దాడి

వెంగళరావునగర్: భార్య చేయి పట్టుకున్న వాడిని ప్రశ్నించినందుకు భర్తపై కొందరు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యాదగిరినగర్‌లో నివసించే ఎం.రాజు సినీ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నాడు. ఈ నెల 9న రాజు స్నానం చేస్తుండగా ఇంట్లో ఉన్న తన భార్య అరుపులు వినిపించాయి. బాత్రూం నుంచి వచ్చి చూడగా ఒక యువకుడు తన భార్య చేయి పట్టుకుని అత్యంత హీనంగా మాట్లాడుతూ లాగుతున్నాడు. ఆమె విసిరికొట్టింది. అనంతరం పారిపోతున్న యువకుడిని పట్టుకుని చూడగా తనకు తెలిసిన రాజా అనే వ్యక్తి అల్లునిగా గుర్తించాడు. అతనిని జవహర్‌నగర్‌కు తీసుకెళ్లి వారి బంధువులకు జరిగిన విషయాన్ని తెలియజేస్తుండగా రాజా, సునీల్, కిశోర్, సుమిత్‌లు కలిసి రాజును కొట్టి గాయపరిచారు. బాధితుడు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాగుపాము కలకలం



వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలో పాము పిల్ల కలకలం సృష్టించింది. గురువారం మధ్యాహ్నం జీ-బ్లాక్‌లోని ఓ ఇంట్లోకి ఎక్కడ నుంచి వచ్చిందో ఒక పాము పిల్ల వచ్చింది. సమాచారం అందుకొని అక్కడికొచ్చిన స్నేక్ సొసైటీ సభ్యులు థామస్ హనీ దానిని పట్టుకుని సీసాలో బంధించి తీసుకెళ్లారు. పామును పట్టుకోవడంతో స్థానిక మహిళలు ఊపిరి పీల్చుకున్నారు.

పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని, జీవో 51ని రద్దు చేసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలిన తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు బైఠాయించి కార్మికులతో కలిసి యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వేలాది 'మల్టీపర్పస్ వర్కర్స్' అతి తక్కువ వేతనాలు నెలకు రూ.9,500లతో దీనస్థితిలో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చిన్న గ్రామ పంచాయతీలలో సంవత్సర కాలంగా జీతాలు అందని దుస్థితి నెలకొందన్నారు.

సాక్షి
శుక్రవారం । 12 । జూలై । 2024

బీబీ ఆలంలను దర్శించుకున్న కేంద్రమంత్రి


ఆలంలను దర్శించుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని పాతబస్తీలోని డబీర్‌పురా బీబీకా అలావాను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయనకు ముస్లింలు దట్టీ కట్టారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి మొహర్రం ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ పవిత్ర సంతాప దినాలు రాష్ట్రంలో మత సామరస్యాన్ని, సమైక్యతను ప్రతిబింబిస్తాయన్నారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని ఇలా స్మరించుకుంటామన్నారు. సమాజ సుఖసంతోషాల కోసం త్యాగం చేయడం మనకు గుర్తు చేసే సందర్భమిదన్నారు. వారి ఆశయ సాధనకు అందరూ ముందుకు సాగడంతో పాటు ప్రతి ఒక్కరూ నివాళులర్పించాల్సిన సమయమిదన్నారు. హైదరాబాద్‌లో మొహర్రంను త్యాగానికి ప్రతీకగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఈ ప్రాంతాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బీజేపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, అలావా ముతవల్లీ పాల్గొన్నారు.

అంకుర ఆస్పత్రి ప్రారంభం


అంకుర ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అల్విన్‌కాలనీ: అత్యాధునిక పరిజ్ఞానంతో, మహిళా శిశు సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కోసం అంకుర ఆస్పత్రి డిజిటలైజేషన్ సెంటర్‌గా అందరికీ అందుబాటులో ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కూకట్‌పల్లి, వివేకానందనగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అంకుర ఆస్పత్రిని మంత్రి దామోదర రాజనర్సింహ, అంకుర హాస్పిటల్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రసాద్ ఉన్నంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ కూకట్‌పల్లిలో 120 పడకలతో అంకుర ఆస్పత్రిని ఏర్పాటు చేయటం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తోందని, ప్రపంచ దేశాలు సైతం హైదరాబాద్ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కొత్త ప్రభాకర్‌రెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, బ్రహ్మానందరెడ్డి, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా డీఎంటీ రఘునాథ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్కాన్ రథయాత్ర


రథయాత్ర కరపత్రం ఆవిష్కరిస్తూ..

పంజగుట్ట: ఇస్కాన్ మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగన్నథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ మియాపూర్ అధ్యక్షుడు శ్రీరాందాస్ ప్రభూజీ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రథయాత్ర కరపత్రాన్ని మను మహరాజ్, శ్యామ్‌దాస్, శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రథయాత్ర 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయం వద్ద నుంచి ప్రారంభమై మదీనాగూడ, ఆల్విన్‌కాలనీ, మియాపూర్ క్రాస్‌రోడ్డు మీదుగా విశ్వనాథ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. గ్రౌండ్స్‌లో సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, భగవద్గీత, భాగవత సంకీర్తనలు, హరినామ సంకీర్తనా యజ్ఞం నిర్వహిస్తామన్నారు. రథయాత్ర వెంట కూడా కోలాటం, హరినామ సంకీర్తనలు, నృత్యాలు ఉంటాయని, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ముకుంద జ్యువెలర్స్ ప్రారంభం


ముకుంద జ్యువెలర్స్ షోరూం ప్రారంభిస్తున్న కార్పొరేటర్

పంజగుట్ట: ఇప్పటికే కేపీహెచ్‌బీ, ఖమ్మం, కొత్తపేటలో వినియోగదారుల నుంచి ఎన్నో మన్ననలు అందుకుంటున్న ముకుంద జ్యువెలర్స్ గురువారం సోమాజిగూడలో నూతన బ్రాంచ్ ప్రారంభమైంది. సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత, సంస్థ ఎండీ నరసింహారెడ్డి, నిఖితారెడ్డి, జబర్దస్త్ దీవెనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆషాఢం బంపర్ సేల్‌లో భాగంగా మేకింగ్ చార్జీలు లేవని, పలు ఆభరణాలపై ఆఫర్లు ఉన్నాయని తెలిపారు. లాభాపేక్ష లేకుండా వినియోగదారులు సంతోషమే ధ్యేయంగా వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. తక్కువ కాలంలోనే నాలుగు బ్రాంచ్‌లు ప్రారంభించామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బ్రాంచ్‌లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఎస్‌ఈజీ గ్లోబల్ వైస్ చైర్‌గా డా.సుభాష్‌చంద్ర



ఉప్పల్: జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుభాష్ చంద్ర సొసైటీ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియో ఫిజిక్స్(ఎస్‌ఈజీ) గ్లోబల్ వైస్ చైర్‌గా ఎన్నికైనట్లు ఆ సంస్థ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. రెండు సంవత్సరాల పాటు ఆయన వైస్ చైర్‌గా ఉంటాడని తెలిపింది. భౌగర్భ జల పరిశోధనలో డా.సుభాష్ నిపుణులని పేర్కొన్నారు. ఎయిర్ బోర్న్ ఎలక్ట్రో మాగ్నెటిక్ అక్విఫర్ మ్యాపింగ్‌కు చేసిన కృషికి నేషనల్ జియో సైన్స్ అవార్డు 2017లో అందుకున్నట్లు వెల్లడించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయండి

హిమాయత్‌నగర్: తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని టూరిజం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి బృందం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు.

సింప్లిసిటీ.. న్యూ లైఫ్‌స్టైల్

ఆయన ఓ కంపెనీ సీఈఓ.. కానీ ఎంత సింపుల్‌గా, డౌన్ టు ఎర్త్ ఉంటారో తెలుసా? ప్రతిరోజూ ఆయన సైకిల్ మీద తన ఆఫీస్‌కి వెళతారు.. ఆమె రాయల్ ఫ్యామిలీకి చెందిన మహిళ.. కానీ ఎంత సాదాసీదాగా కనిపిస్తారో.. ఖాదీ, కాటన్ చీరలు తప్ప మరేవీ వాడరు.. నగరంలో ఇప్పుడు ఇలాంటి సంభాషణలు చాలా వరకూ మనం వింటున్నాం.. అలాంటి వ్యక్తుల్ని అడపాదడపా కంటున్నాం కూడా.. సింప్లిసిటీ అనేది ఇప్పుడు ఒక సరికొత్త జీవనశైలిగా నగరవాసుల్ని ఆకర్షిస్తోంది. భవిష్యత్తుపై కొత్త అంచనాలు రేకెత్తిస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో




ఆర్.నారాయణమూర్తి


మేకల శివారెడ్డి

హిట్స్ ఉన్నా.. సింప్లిసిటీయే మిన్న..

ఆయన బోలెడు సినిమాలు తీసిన నిర్మాత, దర్శకుడు, నటుడు.. కానీ ఆయన్ని అపరిచితులు ఎవరైనా చూస్తే.. ఆయన బ్యాక్ గ్రౌండ్ గురించి చెబితే అసలు నమ్మరు.. అలాంటి అసాధారణ వ్యక్తి ఆర్.నారాయణమూర్తి. కనీసం కారు కూడా లేకుండా ఆటోల్లో తిరుగుతూ అంతగా ఖరీదు కాని సెల్‌ఫోన్ వాడుతూ.. సగటు మధ్య తరగతి జీవితం కన్నా కూడా కాస్త తక్కువే అనిపించేంత సాదాసీదాగా ఉండే ఆర్.నారాయణమూర్తి లాంటి జీవితం అందరికీ సాధ్యం కాదనేది నిస్సందేహం. రిచ్ పీపుల్‌కి కేరాఫ్ అన్నట్లుగా ఉండే టాలీవుడ్‌లో సింప్లిసిటీ ద్వారా ఆయన తనదైన ముద్ర వేశారు.

పుట్టిన రోజు పండగే.. అవసరార్థులకీ..

నగరానికి చెందిన పలువురు సెలబ్రిటీలు, ప్రముఖులు, సంపన్నులు తమ పుట్టిన రోజు వేడుకల్ని నిరాడంబరంగా జరుపుకుంటున్నారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో కేక్స్ కట్ చేస్తూ.. అక్కడి వారికి అవసరమైనవి అందిస్తూ.. అనవసర వ్యయాన్ని తగ్గించుకోవడం మాత్రమే కాకుండా చేసిన ఖర్చును కూడా అత్యంత ఉపయుక్తంగా, సమాజహితంగా చేస్తున్నారు. అవసరాలకు మించి ఉన్న డబ్బును ఆర్భాటాలకు ఖర్చు చేయడం అనేది ఇప్పటికీ అత్యధిక సంపన్నులు పంథా అయినప్పటికీ.. ఇప్పుడిప్పుడే మారుతున్న కొందరి జీవనశైలి భవిష్యత్తు మీద ఆశలు రేకెత్తిస్తోంది. సంపాదించిన దాంతో ఎంత దాబుగా బతికాం అనేది మాత్రమే కాకుండా సంపాదించినది ఎంత బాగా సద్వినియోగం చేశామనేది ముఖ్యంగా మారినప్పుడు.. సింప్లిసిటీని మించిన క్వాలిటీ లేదని అర్థమవుతుంది.

..పెళ్లిళ్లూ అదే బాటలో

నగరానికి చెందిన స్ఫూర్తి కొలిపాక అనే సంపన్న యువతి అత్యంత సాదాసీదాగా తన వివాహం జరుపుకుని అందర్నీ ఆకర్షించారు. పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో గ్రీన్ వెడ్డింగ్‌గా నిర్వహించిన ఈ వేడుకకు అతి తక్కువ మంది బంధుమిత్రులను ఆహ్వానించారు. అలాగే అలంకరణలు కూడా చాలా స్వల్పంగా.. అదే సమయంలో అన్నీ పర్యావరణ హితంగా ఏర్పాటు చేశారు. వధువు పెళ్లి చీరను కేవలం రూ.1000లోపే కొనడం ఈ పెళ్లి వేడుకలోని నిరాడంబరతకు నిదర్శనం. వాటర్ బాటిల్స్ సైతం పెళ్లి విందుకు హాజరయ్యే వారే తెచ్చుకోవాలని కోరడం వంటి వాటి ద్వారా సింప్లిసిటీకి కొత్త నిర్వచనం ఇచ్చిందీ యువతి.



అదేవిధంగా నగరానికి చెందిన మరో దర్శకుడు శేఖర్ కమ్ముల కూడా సింప్లిసిటీకి మరో చిరునామా అనే ఇమేజ్ సొంతం చేసుకున్నారు. 'శేఖర్ కమ్ములతో నేను కలిసి పనిచేశాను. ఆనంద్, గోదావరి, హ్యాపీ డేస్ లాంటి సినిమాల తర్వాత కూడా ఒక దిగువ మధ్యతరగతి తరహా కారు మాత్రమే వాడేవారు' అంటూ గుర్తు చేసుకున్నారు నగరానికి చెందిన డిజైనర్ అరవింద్ జాషువా. పర్యావరణ ప్రియత్వం కూడా మెండుగా ఉన్న శేఖర్ కమ్ముల ఎయిర్ కండిషనర్ వినియోగానికి కూడా దూరంగా ఉంటారని ఆయన పలుమార్లు చెప్పారు.

ఇప్పటికీ పాత బంగ్లాలోనే..

ఉప్పల్: ఎన్ని సిరిసంపదలున్నా.. కొందరు వ్యక్తుల జీవన శైలి సాదాసీదాగానే ఉంటుంది. ఆధునికతకు దూరంగా.. అనవసరమైన ఒత్తిడికి గురికాకుండా హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటారు. సింప్లిసిటీ అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పెద్ద మనిషి ఉప్పల్‌కు చెందిన మేకల శివారెడ్డి. గ్రామీణ ఉప్పల్‌ను ఆధునిక ఉప్పల్‌గా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని చెప్పవచ్చు. 1978 నుంచి 81 వరకు గ్రామ అధికారిగా, 81 నుంచి 87 వరకు మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా, 88 నుంచి 92 వరకు మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తించి నిజాయతీపరుడిగా పేరు గడించారు. రూ.కోట్లు ఉన్నా.. లెక్క చేయకుండా ఇప్పటికీ మారుతీ ఆల్టో కారు, స్కూటీపైనే తిరుగుతుంటారు. ఇప్పటికీ తన తాత, తండ్రి కట్టించిన కవెలు బంగ్లా(పెంకుటిళ్లు)లోనే నివాసముంటున్నారు. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే పల్లెటూరు వాతావరణాన్ని తలపిస్తుంటుంది.



14న లష్కర్‌గూడకు సీఎం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడకు ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలు నాటనున్నారు. అనంతరం కల్లుగీత కిట్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ శశాంక గురువారం లష్కర్‌గూడను సందర్శించారు. గీత కార్మికులకు పంపిణీ చేయనున్న కిట్ల పనితీరును ఆయన పరిశీలించారు. సీఎం రాక నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

21న కార్టూనింగ్‌పై వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక కార్టూనిస్టుల కోసం ఈ నెల 21న హైటెక్ సిటీలోని శిల్పారామంలో 'కార్టూనింగ్'పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ, రాజకీయేతర కార్టూన్లు వేయాలనే ఉత్సాహం కలిగి, 15 సంవత్సరాలు పైబడిన వారు వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల వారు 93988 04284 నంబర్‌కు ఫోన్ చేసి ఈ నెల 16వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

రన్ ఫర్ ఎస్‌ఎమ్‌ఏ పోస్టర్ లాంచ్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా క్యూర్ ఎస్‌ఎమ్‌ఏ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో స్పైనల్ మస్కులార్ ఎట్రోఫీపైన అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా రన్‌ను నిర్వహించనున్నారు. రన్/రైడ్ ఫర్ ఎస్‌ఎమ్‌ఏ పేరుతో ఆగస్టులో జరగనున్న ఈ రన్‌కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎర్రమంజిల్ వేదికగా మీడియా మానియా పీఆర్ కార్యాలయంలో జరుపనున్నారు. కార్యక్రమంలో క్యూర్ ఎస్‌ఎమ్‌ఏ ఫౌండేషన్ ఇండియాకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొంటారని యాజమాన్యం తెలిపింది.

నగరంలో చిరుజల్లులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం ఒకేసారి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రధాన రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సోమాజిగూడ, అమీర్‌పేట్, ఫిలింనగర్, నాంపల్లి, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, సికింద్రాబాద్, బేగంపేట, ప్యాట్నీ, రసూల్‌పురలలో భారీగా వర్షం కురిసింది.

ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో 'సౌరవ్ గంగూలీ'

- హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల జట్లతో రేస్
- ఆగస్టు నుంచి నవంబర్ వరకు రేసింగ్ లీగ్..
- సీజన్‌కు ముందే కోల్‌కతా రాయల్ టైగర్స్ యజమానిగా గంగూలీ జోష్



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో ప్రముఖ మోటార్‌స్పోర్ట్ ఈవెంట్ 'ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్' (ఐఆర్‌ఎఫ్) మూడో సీజన్‌కు సిద్ధం అవుతోంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ వరకు హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, గోవా, కొచ్చి, అహ్మదాబాద్ నగరాల ఆధారిత జట్లతో కొత్త సీజన్ నిర్వహించనున్నారు. ఈ సీజన్ ప్రారంభానికి ముందే భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కోల్‌కతా రాయల్ టైగర్స్ రేసింగ్ టీమ్ యజమానిగా మారి రేసింగ్‌కు మరింత ఆకర్షణను తీసుకువచ్చారు. రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో 'ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్), ఫార్ములా 4 ఇండియన్ ఛాంపియన్‌షిప్(ఎఫ్4ఐసీ)' అనే రెండు ప్రధాన ఛాంపియన్‌షిప్‌లు జరగనున్నాయి. ఈ సందర్భంగా సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు వంటి పలు నగరాల్లో పెరుగుతున్న మోటార్ స్పోర్ట్ అభిమానులను అలరించడానికి ఐఆర్‌ఎఫ్ వంటి రేసులు మంచి వేదికలుగా మారుతున్నాయని అన్నారు. ఈ తరం మోటార్ స్పోర్ట్ ఔత్సాహికులకు ప్రోత్సాహం అందించడానికి ఈ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగం కావడం కొత్త అనుభూతిని అందిస్తుందని అన్నారు. సౌరవ్ గంగూలీని కోల్‌కతా ఫ్రాంచైజీ యజమానిగా మారడం అన్ని నగరాల్లో ఐఆర్‌ఎఫ్‌కు మరింత ఆదరణ పెంచుతుందని రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అఖిలేష్‌రెడ్డి పేర్కొన్నారు.

'పవర్ విథిన్' పుస్తకావిష్కరణ


పుస్తకంతో రచయిత డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం

రాయదుర్గం: పాశ్చాత్య నమూనాలతో భారతీయ తత్వశాస్త్రాన్ని మిళితం చేసేలా పుస్తకాన్ని రచించారని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ప్రముఖ పరిశోధకులు, రచయిత డాక్టర్ రామస్వామి బాలసుబ్రహ్మణ్యం రచించిన 'పవర్ విథిన్' పేరిట రాసిన పుస్తకాన్ని ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం రాసిన పుస్తకం ప్రజలను ప్రజా నాయకత్వం, ప్రజాసేవ వైపు ప్రేరేపిస్తుందని ఆయన పేర్కొన్నారు. రచయిత బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ జీవితం ఆదర్శప్రాయమని, పట్టుదల, నిరంతర శ్రమతోనే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం రాయడానికి తాను ప్రధాని అనుమతిని కోరినప్పుడు, ఆయన ఒక షరతు పెట్టారన్నారు. ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా వెయ్యి మంది నాయకులు ఉద్భవించాలన్నారు. భారతదేశం ప్రపంచానికి విశ్వగురువుగా భావించాలన్నారు. ఈ పుస్తకం ప్రస్తుతం ఉన్న ప్రధాన మంత్రి నాయకత్వం, పనితీరుకు సంబంధించినదని తెలిపారు. ఇదిలాఉండగా జూన్ 28వ తేదీన నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ సమక్షంలో పిరమల్ గ్రూప్ చైర్మన్ అజయ్ పిరమల్ ఆవిష్కరించారని గుర్తు చేశారు. ప్యానల్ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రముఖ మేధావులు తెలంగాణ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహాశర్మ, ఇండికా అకాడమీ డీన్ నాగరాజ్ పాతూరి మాట్లాడగా కార్యక్రమానికి మోడరేటర్‌గా రాఘవకృష్ణ వ్యవహరించారు.

ఫ్రైడేని.. డ్రై డేగా పాటించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో డెంగీ, చికెన్ గున్యా, డయేరియా, విష జ్వరాలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో జపనీస్ ఎన్సెఫలిటీస్ వ్యాక్సిన్‌పై డీఈఓ, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 15 వరకు ప్రభుత్వ పాఠశాలలు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెదడు వాపు వ్యాధి నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా వ్యాధి రాకుండా వేడి చేసి చల్లారిన నీరు తాగాలన్నారు. ప్రతి ఇంట్లో ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వసతి గృహాల్లోని పిల్లలకు వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాల్లోని పరిసరాలు, అన్నం తినే టప్పుడు చేతులు కడుక్కోవడం తదితర అంశాలపై విద్యార్థులను డెమో ద్వారా చైతన్యవంతం చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీ కళ, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు పెరిక యాదయ్య, ఆశన్న, ఇలియాస్ అహ్మద్ పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి..



- త్వరగా కోకాపేట్ చెరువును సుందరీకరించండి
- హెచ్‌ఎండీఏ ప్రాజెక్టులను సందర్శించిన కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, కోకాపేట్ లేక్ (కొత్త చెరువు) సుందరీకరణను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, లే అవుట్లను, చెరువుల సుందరీకరణ పనులను ఆయన ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ ఎండీ గౌతమి, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ పరంజ్యోతి, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ శెట్టి తదితరులు ఈ పర్యటనలో ఉన్నారు. కోకాపేట్ వద్ద వాటర్ బోర్డు నిర్మించిన ఎస్టీపీ నిర్వహణను ఆయన పరిశీలించారు. అనంతరం కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అవుటర్ రింగ్ రోడ్డు ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ వద్ద పచ్చదనాన్ని పెంచాలని, నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కోకాపేట్ లేక్ చుట్టూ వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, పచ్చదనం, ఎలక్ట్రిసిటీ తదితర సదుపాయాలను అందుబాటులోకి తేవాలని చెప్పారు. దుర్గం చెరువు వద్ద ఏర్పాటు చేయనున్న పార్కు స్థలాన్ని సందర్శించారు. పర్యావరణహితంగా పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే రాయదుర్గం, కోకాపేట్, కొత్వాల్‌గూడ తదితర ప్రాంతాల్లోని హెచ్‌ఎండీఏ పార్కులను కూడా కమిషనర్ సందర్శించారు. కొత్వాల్‌గూడలో 85 ఎకరాల్లో నిర్మిస్తున్న బటర్‌ఫ్లై పార్కు, ఏవేరీ, బోర్డ్ వాకింగ్ పనులను పరిశీలించారు. ఓఆర్‌ఆర్ మార్గంలో గ్రీనరీని కూడా ఆయన పరిశీలించారు.

గర్భిణులకు హెచ్‌బీఏజెడ్ పరీక్ష తప్పనిసరి చేయాలి



సాక్షి, సిటీబ్యూరో: తలసేమియా నివారణలో భాగంగా గర్భిణులకు వారి మొదటి త్రైమాసికంలో హెచ్‌బిఏజెడ్ పరీక్షను తప్పనిసరి చేయాలనే ఆలోచనకు నగరానికి చెందిన తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ(టీఎస్‌సీఎస్) మద్దతు తెలిపింది. అందుకు అనుగుణంగా జీవో రూపకల్పనలో సహకారం అందించనుంది. తలసేమియా నివారణ చికిత్సకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు శోభాతులి నేతృత్వంలోని తలస్సెమిక్స్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టీఎస్‌సీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా తలసేమియా రహితంగా ఉన్న విషయాన్ని వీరు వెల్లడించారు.

కండక్టర్ అనూపరాణిని సన్మానించిన ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికులను కుటుంబ సభ్యుల్లా భావించి విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలను అందజేస్తున్న ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఫ్రెండ్లీ కండక్టర్ అనూపరాణికి ఆర్టీసీ ఎండీ సజ్జనర్ గురువారం బస్‌భవన్‌లో సన్మానించారు. ఆమె సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆయుష్ ఉద్యోగుల ఆందోళన



సనత్‌నగర్: ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల విషయంలో ఉన్నతాధికారుల వైఖరిని నిరసిస్తూ సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వెనుక ఉన్న ఆయుష్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జీఓ 178 రద్దు చేయాలని, పాత పద్ధతుల్లోనే ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియ చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌జీఓస్ ఆయుష్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.నరసింహచారి మాట్లాడుతూ 2021 సంవత్సరంలో నాటి ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కోసం 178 జీవోను తీసుకువచ్చిందన్నారు. ఉద్యోగులకు సమాచారం లేకుండా ఉన్నతాధికారులు రాత్రికి రాత్రే ఆ జీఓ ప్రకారం ప్రమోషన్లు చేపడుతున్నామని, జాబితాలను విడుదల చేయడం అన్యాయమన్నారు. కమిషనర్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి, ఉన్నతాధికారులకు లబ్ధి చేకూరేలా మాత్రమే ప్రమోషన్ల ప్రక్రియ జరిగిందని ఆరోపించారు. జీఓ విడుదల అయ్యిందన్న విషయాన్ని తొక్కిపెట్టి జాబితా తయారు చేయడంతో పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జోనల్ స్థాయి, రాష్ట్ర స్థాయిగా విభజించి కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగులకు లబ్ధి చేకూర్చే విధంగా బదిలీల జాబితా తయారు చేశారన్నారు. జీఓ రద్దు చేసి పాత పద్ధతిలోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ మేరకు డీడీకి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆయుర్వేద, యునానీ, హోమియో ఆస్పత్రులు, కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

మరో 15 రోజులు మాత్రమే..

- అమ్మ ఆదర్శ పాఠశాల పనులన్నీ పూర్తిచేయాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మైనర్ రిపేర్, ఎలక్ట్రిఫికేషన్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, రెనోవేషన్ 80 శాతం పూర్తయిన వాటిని వారం రోజుల్లోగా, మిగతా పాఠశాలలో పనులను 15 రోజులలోగా అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు వర్క్ కంప్లిషన్ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు. గతంలో పాఠశాలల్లో ఉన్న పరిస్థితులను అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టిన తర్వాత పాఠశాలల పరిస్థితిపై డాక్యుమెంటేషన్ రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, టీజీఈడబ్ల్యూఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీ, టీజీఎమ్మెస్ ఐడీసీ ఎగ్జిట్ ఇంజినీర్లు చలపతిరావు, డిప్యూటీ ఐఓఎస్‌లు, డిప్యూటీ ఐఓఎస్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 12, జూలై, 2024

పబ్‌లో.. ఫస్ట్ టైమ్

సాధారణంగా సిటీలో పబ్స్, క్లబ్స్‌లో కని/వినపడే డీజేలు, బ్యాండ్స్, సింగర్స్... ఎక్కువగా పాశ్చాత్య పోకడలకు ప్రతీకగా ఉంటారు. వెస్టర్న్ మ్యూజిక్‌ని ఇష్టపడే యువతను మెప్పించడం వీరి వల్లే సాధ్యమని ఈవెంట్ మేనేజర్లు భావిస్తుండడం వల్ల ఈ ట్రెండ్ కంటిన్యూ అవుతోంది. ఇటీవలే వీరి స్థానంలో హిందీ, తెలుగు సంగీతాన్ని అందించే బ్యాండ్స్‌కు ప్రాధాన్యత పెరుగుతోంది. ఆ ధోరణి మరింత బలపడి ఇప్పుడు ఏకంగా తెలుగు గాయనీ గాయకులకు కూడా పబ్స్ రెడ్ కార్పెట్ పరుస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలో వియ్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు ప్రేక్షకులకు చిరపరిచితురాలైన ప్రముఖ గాయని గీతా మాధురి తన సొంతంగా సమకూర్చుకున్న బ్యాండ్‌తో కలిసి తొలిసారి నగరంలోని ప్రిజ్మ్ పబ్‌లో శుక్రవారం సాయంత్రం సోలో ప్రదర్శన ఇవ్వనున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



ప్రపంచాన్నే మన పాట పాలిస్తోంది.. ఇక పబ్స్‌లో తెలుగు పాట వినిపించడంలో ఆశ్చర్యమేముంది? అంటున్నారు ప్రముఖ నేపథ్యగాయని గీతా మాధురి. 'సాక్షి'తో పంచుకున్న ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

సోలోగా...ఇదే తొలిసారి..

నగరంలో లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వడం అనేది పెళ్లిళ్ల నుంచి పార్టీల వరకూ చాలా రకాల కార్యక్రమాల్లో నాకు అనుభవమే. అయితే మోడ్రన్ కల్చర్‌కు కేరాఫ్‌గా ఉండే యూత్ సమక్షంలో ఒక పబ్‌లో సోలోగా పాడడం ఇదే తొలిసారి. అదీ సొంతంగా ఒక బ్యాండ్‌ను సమకూర్చుకుని, వారితో కలిసి రిహార్సిల్స్ చేసి పబ్ షోలో పాడడం కొత్త అనుభవమే.

అభిమానుల స్పందన తెలుస్తుంది...

అలాగే కార్పొరేట్, కాలేజ్ షోస్ వంటివి కొందరికి మాత్రమే పరిమితమయ్యేవి, అలా కాకుండా ఈ తరహా పబ్లిక్ ఈవెంట్స్ వల్ల ప్రయోజనం ఏమిటంటే.. అభిమాన గాయనీ గాయకుల పాటలు వినాలనుకునే ఎవరైనా షోకి హాజరుకావొచ్చు. అలా మాకు కూడా మా అభిమానుల స్పందనను దగ్గరగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

బ్యాండ్ స్టైల్ అంటే ఇదే...

సాధారణంగా లైవ్ పెర్ఫార్మెన్స్‌లో పూర్తి స్థాయి వాద్య బృందంతో కలిసి పాడతాం. అయితే పబ్‌లో మాత్రం ఇద్దరు గిటారిస్ట్, డ్రమ్మర్, కీబోర్డ్ ప్లేయర్.. ఇలా ఓ ముగ్గురు నలుగురు మాత్రమే ఉంటారు. ఆర్కెస్ట్రాతో పాడేటప్పుడు ఉన్నది ఉన్నట్టుగా పాడతాం.. అయితే ఇందులో 3, 4 పాటలు కలిపి బ్యాకింగ్ కొంచెం మార్చి.. ఇలా ఎక్స్‌పెరిమెంటల్ టైప్‌లో ఉంటుంది. ఓ రకంగా పాపులర్ సాంగ్‌ని కొత్త ఫ్లేవర్‌లో వినిపించడమే బ్యాండ్ స్టైల్ అనొచ్చు.

మన పాట ప్రపంచవ్యాప్తం...

మన తెలుగు పాటలు ప్రపంచం అంతా ఒక ఊపు ఊపుతున్నాయి. కాబట్టి సిటీలో కూడా పబ్ క్లబ్ అని తేడా లేకుండా అన్ని చోట్లా యూత్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌లో తెలుగు, హిందీ పాటలు పాడడానికి సిద్ధమవుతున్నా..అయితే అక్కడకు వచ్చే క్రౌడ్‌ని బట్టి వారి టేస్ట్‌ని బట్టి అప్పటికప్పుడు పాడాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఇలాంటి ఈవెంట్స్‌లో పూర్తి స్థాయిలో ఒక పాటల జాబితా ఇచ్చి, దాని ప్రకారం పాడాలనే ఆలోచన ఉంది. ఇక పర్సనల్ లైఫ్‌కి వస్తే..అడపాదడపా సినిమా పాటలు, రెగ్యులర్‌గా కొన్ని ప్రైవేట్ ఈవెంట్స్, ఇవి కాక... ఓటీటీ వేదికగా ఇండియన్ ఐడల్ కు వర్క్ చేస్తున్నాను.

బిర్యానీ.. అదో ఎమోషన్

– సినీ నటి నభా నటేశ్

'హైదరాబాద్ అనగానే అందరికీ గుర్తొచ్చేది బిర్యానీ. ఇక్కడ చాలా రకాల బిర్యానీలు ఉంటాయి. ధమ్ బిరియానీ, మొఘల్ స్టైల్, నాటుకోడి, పులావ్, అవకాయ్, ఉలవచారు బిర్యానీ.. ఇలా ఎన్నోరకాలు ఉంటాయి. హైదరాబాద్ బిర్యానీ అంటే కేవలం ఫుడ్ కాదు.. అదొక ఎమోషన్. నాకు ఇక్కడి హలీమ్ అంటే చాలా ఇష్టం. హలీమ్ సీజన్‌లో తప్పకుండా తింటాను' అని హీరోయిన్ నభా నటేశ్ అన్నారు. 'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'అదుగో', ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మాస్ట్రో' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. తాజాగా ఆమె నటించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి హీరోగా నటించారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నగరానికి వచ్చిన నభా హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని, బోనాల పండుగ గురించి 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

– సాక్షి, సినిమా డెస్క్

ఇదే నా ఫస్ట్ హోం..

భాగ్యనగరం నాకిప్పుడు ఫస్ట్ హోం అయిపోయింది. నా స్వస్థలం కర్నాటకలోని చిక్‌మంగళూర్. చిన్నప్పటి నుంచి వేర్వేరు ప్రదేశాల్లో పెరిగాను. కానీ, ఆరేళ్లుగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కాబట్టి ఇక్కడే ఉంటున్నాను. ఇక్కడి ప్రజలు చాలా మంచివారు. ఎంతో ప్రేమగా మాట్లాడతారు.. అభిమానిస్తారు. ఇక్కడి హాస్పిటాలిటీ చాలా బాగుంటుంది. ఫుడ్ అద్భుతంగా ఉంటుంది.. కావాల్సినంత పెడతారు(నవ్వుతూ). స్వీట్ చాలా ఎక్కువ తినిపిస్తారు. స్వీట్స్‌ని నేను ఎక్కువగా తినను. ఎందుకంటే డైట్‌లో ఉంటాను. ఏదైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు అయ్యయ్యో... ఇప్పుడు ఎలా? తప్పకుండా స్వీట్స్ తినాలనే ఫీలింగ్ వస్తుంది. ఏదేమైనా హైదరాబాద్‌లో ఉంటే చాలా హ్యాపీగా ఉంటుంది.

ప్రత్యేకించి ఈ నగర సంస్కృతి అంటే ఇష్టం. బాగా చూసుకుంటారు. నా మొదటి సినిమాకు మా అమ్మ తోడుగా వచ్చేది.

ఆ నమ్మకంతోనే...

కానీ, ఇక్కడివారు ఎంతో జాగ్రత్తగా చూసుకునే విధానం అమ్మకి నచ్చింది. నేను తోడు రాకున్నా ఎంతో కేరింగ్‌గా చూసుకుంటారని అమ్మకి రావడంతో ఇప్పుడు రావడం లేదు. సినిమా సెట్స్‌లో నటీనటులను బాధ్యతగా చూసుకుంటారు.. నాకు అది చాలా బాగా నచ్చుతుంది. మంచి సౌకర్యాలు కల్పిస్తారు.. గౌరవం ఇస్తారు.

బోనాలంటే ఇష్టం..

హైదరాబాద్‌లో జరిగే బోనాలంటే నాకు చాలా ఇష్టం. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో బోనాల పాటకి నేను డ్యాన్స్ కూడా చేశాను. ఆ పాట చాలా బాగా పాపులర్ అయ్యింది. నేను కూడా బోనం ఎత్తుకున్నాను. ప్రస్తుతం బోనాల సమయంలోనే మా 'డార్లింగ్' మూవీ విడుదల కావడం సంతోషంగా ఉంది. ఇప్పుడు జరుగుతున్న బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆత్రుతగా ఉంది. మా నిర్మాత చైతన్య మేడం గారు ప్లాన్ చేస్తామని చెప్పారు. తప్పకుండా పాల్గొంటాను.





'డిజైన్డ్' సంసారం

కలిసి జీవనం ప్రారంభించడం, బాధ్యతలు, వ్యయాలు సమానంగా పంచుకోవడం, పరస్పర వ్యక్తిగత ఇష్టాయిష్టాలను గౌరవించుకోవడం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించకపోవడం, ఇష్టమున్నంత కాలం కలిసి ఉండడం, ఇద్దరిలో ఎవరు వద్దనుకున్నా సింపుల్‌గా 'బై..బై' చెప్పేయడం.. ఇదే 'లివిన్'. సహజీవనంతో మరింత బలపడిన అనుబంధాన్ని పెళ్లితో చట్టబద్ధం చేసుకుంటున్నవారూ లేకపోలేదు.. అయితే కొంతకాలం అనుబంధం తర్వాత విడిపోయి కూడా ఫ్రెండ్స్‌గా కొనసాగే వారూ ఉన్నారు.

- కొన్ని లాభాలున్నా మరికొన్ని నష్టాలు
- వివిధ కారణాలతో సై అంటున్న యువత
- సెలబ్రిటీల జీవితాల్లో సర్వసాధారణ కల్చర్
- ఈ కల్చర్ ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన 'లివిన్' మోసాలు
- ఏడాదిలో 2వేలకు పైగా ఫిర్యాదులు

లివిన్ లైఫ్

సిటీలో స్థిరపడుతున్న సహజీవన సంస్కృతి

'లయన్స్ గేట్ ప్లే' అధ్యయనంలో వెల్లడి

ఇటీవల యువ అనుబంధాలపై లయన్స్ గేట్ ప్లే అనే సంస్థ స్వతంత్ర అధ్యయనం నిర్వహించింది. 'లయన్స్‌గేట్ ప్లే రిలేషన్ షిప్ మీటర్' పేరిట విడుదల చేసిన అధ్యయన ఫలితాల్లో అత్యధికులు లివిన్ రిలేషన్ షిప్స్‌కి జై కొడుతున్నారు. ఆ అధ్యయనం వెల్లడించిన విశేషాలను పరిశీలిస్తే...

- సాక్షి, సిటీబ్యూరో

శాశ్వత సంబంధాలను ఏర్పరచుకోవడానికి బదులు వారు లివిన్ రిలేషన్ షిప్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలనే ఆధునికులు ఎంచుకుంటున్నారు. భాగస్వామిని అర్థం చేసుకోవడానికి పెళ్లికన్నా లివిన్ రిలేషన్ షిప్‌లో ఉండటం మేలని 50 శాతం మంది అంటున్నారు. ఈ రిలేషన్ షిప్‌లో ఉండటానికి తల్లిదండ్రులు అంగీకరిస్తారని 34% మంది భావిస్తున్నారు.


భార్య, భర్త కాదు.. ఓన్లీ ఫ్రెండ్స్..

ప్రేమను కొనసాగించడానికి స్నేహమే మూలమని నవతరం నమ్ముతున్నారు. ఆ మధ్య ప్రేమ అంటే స్నేహం అని అర్థం చెప్పిన బాలీవుడ్ హీరో షారుఖ్‌ఖాన్ అభిప్రాయం సరైనదేనని 87 శాతం మంది పురుషులు 92 శాతం మహిళలు భావిస్తున్నారు. విడిపోయిన తర్వాత కూడా స్నేహితులుగా కొనసాగొచ్చు అంటూ ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు తమ మాజీ ప్రియుడితో స్నేహం చేయడం మంచిదంటున్నారు. కేవలం 30% మంది భారతీయులు మాత్రమే తమ భాగస్వామి అపోజిట్ సెక్స్‌కి చెందిన క్లోజ్ ఫ్రెండ్‌ని కలిగి ఉండటం పట్ల అసౌకర్యంగా ఉన్నారు.

ఎంపికలో కీలకం ఇవే..



భాగస్వామి ఎంపికలో భావోద్వేగ సంబంధం కన్నా అందానికే 50 శాతం మంది పురుషులు ప్రాధాన్యత ఇస్తుండగా మహిళలు 35 శాతం మంది మాత్రమే లుక్స్‌కి విలువ ఇస్తున్నారు. ఆర్థికంగా సురక్షితంగా ఉండే రిలేషన్ షిప్‌లోకి మాత్రమే ప్రవేశించాలని 72 శాతం మంది భావిస్తున్నారు. ఇంటి ఖర్చులను జంటగా పంచుకోవాలని 50 శాతం మంది మహిళలు అంటుంటే 37 మంది పురుషులు మాత్రమే దీనిని అంగీకరిస్తున్నారు.



అనుబంధాలు ముక్కలయ్యాక ఏమిటి పరిస్థితి? హృదయం ముక్కలైపోతుందేమోనని, ఒంటరిగా ఉండడం కష్టమని, మళ్లీ ప్రేమ దొరకదేమోననే భయాల్లో 60 శాతం మంది ఉన్నారు. అయితే ఈ విషయంలో పురుషులు ఎమోషనల్‌గా కనిపిస్తుండగా, మహిళలు ఆచరణాత్మకమైన విధానాన్ని ఎంచుకుంటున్నారు. 53% మంది మహిళలు 'మాజీని మరచిపోయి ముందుకు సాగుదాం' అనే వైఖరిని కలిగి ఉన్నారు. కానీ 66% మంది పురుషులు తమ మొదటి ప్రేమకు తిరిగి వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. అలాగే 37% మంది విడిపోయిన తర్వాత కూడా భాగస్వామితో కలిసి ఒకే ఇంట్లో నివసించడంలో తప్పు లేదని అభిప్రాయపడ్డారు. అయితే రిలేషన్‌ను తిరిగి నిర్మించుకోవడం కంటే ముగించుకోవడమే సులభమని 33 నుంచి 38 సంవత్సరాల వయస్సు గల వారిలో 72% మంది 27 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల వారిలో 67% మంది అంగీకరిస్తున్నారు. అలాగే అనుబంధం ముగిశాక ముందుకు సాగడానికి కొత్త బంధాన్ని ప్రారంభించడం ఉత్తమమని 48% మంది భావిస్తున్నారు.



'తారా' పథంలో..

ఫ్యాషన్ల నుంచి ఎమోషన్ల వరకూ దేనికైనా సరే అపరిమితమైన ఫాలోయింగ్ రావాలంటే.. దాన్ని సెలబ్రిటీ ఆదరించాలి. ఈ లివిన్ రిలేషన్‌షిప్ విషయంలో కూడా అదే జరిగింది. చాలామంది నటీనటులు ఇలా 'కలిసి జీవించడం' కనిపిస్తోంది. దాన్ని అనుసరిస్తూ కార్పొరేట్, ఐటీ కంపెనీలు అధికంగా ఉన్న బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో పెళ్లికి ప్రత్యామ్నాయంగా యువత ఈ అనుబంధం ఏర్పరచుకుంటున్నారు. అప్పట్లో హాలీవుడ్‌లో బ్రాడ్‌పిట్, ఏంజెలినా జోలి నుంచీ ప్రీతిజింతా, సుస్మితాసేన్, సంజయ్‌దత్‌లతో పాటు కరీనా–సైఫ్ అలీఖాన్ ఇంకా ఎందరెందరో ఈ కల్చర్‌ని కలర్‌ఫుల్‌గా మార్చారు.



'లివిన్'కు కారణాలెన్నో..

నగరం ఈ తరహా బంధాలకు నెలవుగా మారుతోంది. సినిమా, మోడలింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, టీవీ, మీడియా, ఐటీ, సాఫ్ట్‌వేర్.. రంగాలకు చెందిన యువతీ యువకులు ఈ అనుబంధంవైపు తేలికగా ఆకర్షితులవుతున్నారు.

- మహిళలు, పురుషులు ఎవరికి వారు వ్యక్తిగత కెరీర్‌ను, విజయాలను కోరుకోవడం, కెరీర్‌ను కొనసాగిస్తూనే భావోద్వేగపూరిత బలమైన అనుబంధాన్ని కోరుకుంటున్నారు.
- వ్యక్తిగత ఖర్చులు భరించలేక రూమ్ షేర్ చేసుకోవడంతో మొదలై 'లివిన్'గా మారుతోంది.
- పబ్స్ నుంచి క్లబ్స్ వరకూ 'స్టాగ్స్ నాట్ అలవ్డ్' అని బోర్డు పెడతారు. దీంతో రోజుకొకర్ని వెంటేసుకుని వెళ్లేకన్నా.. స్థిరంగా ఉండే బాయ్‌ఫ్రెండ్/గరల్ ఫ్రెండ్ మిన్న అని భావించడం.
- పెళ్లిద్వారా పరస్పరం సంక్రమించే హక్కుల పట్ల భయం.
- చట్టబద్ధమైన బంధంలోకి వెళ్లే ముందుగా తమ భాగస్వామిని అర్థం చేసుకోవాలనుకోవడం.

ఈ కొత్త తరహా జీవనశైలి మానసిక సంఘర్షణకు, తీవ్ర ఒత్తిడికీ దారి తీస్తాయి. అద్దె ఇంటి దగ్గర్నుంచి ఆఫీసు వ్యవహారాల వరకూ పెళ్లికాని కాపురం చేయాలనుకునే యువత చాలా సమస్యలే ఎదుర్కోవాల్సి వస్తుంది. 'వివాహం కంటే బలమైన అనుబంధం తమ మధ్య ఉందనుకున్నప్పుడు మిగిలిన విషయాలకు అంతగా ప్రాముఖ్యత ఇవ్వకూడదు. అలాగే ఆవేశంలోనో, ఫ్యాషన్‌గానో, సహజీవనంలోని లోతుపాతులు తెలియకుండా అడుగుపెట్టడం సహజీవనంలోకి అడుగుపెట్టడం మంచిది కాదు' అంటారు రచయిత్రి ఓల్గా.

పెరుగుతున్న మోసాలు..

గతంలో మహిళా కమిషన్ వర్గాలు వెల్లడించిన డేటా ప్రకారం.. లివ్ ఇన్‌కు సంబంధించిన మోసాలు తెలుగు రాష్ట్రాల్లో పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, తెలంగాణలోని రంగారెడ్డి ఈ విషయంలో పోటీ పడుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో అగ్రగామిగా హైదరాబాద్ నిలిచింది. లివిన్ చీటింగ్ కేసుల్లో 47 శాతం ఒక్క హైదరాబాద్ నగరంలోనే చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మహిళా కౌన్సిలింగ్ కేంద్రాలకు ఒక్క ఏడాదిలోనే 2వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయంటే అర్థం చేసుకోవచ్చు.

ఏదేమైనా తప్పుకాదనుకునో, తప్పనిసరిగానో ఈ అనుబంధంలోకి అడుగుపెడుతున్నవారు పలు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. భాగస్వామి మరణించినా, మరే కారణం చేత దూరమైనా చట్టపరమైన ఇబ్బందులు రాకుండా ఉండాలంటే.. 'లివిన్' కొనసాగుతున్నప్పుడు అర్జించిన ఉమ్మడి ఆదాయాలకి సంబంధించిన ఒప్పందాలు, స్థిర, చరాస్తుల పంపకాలకు సంబంధించిన ఒప్పందాలను ముందుగానే రాసుకోవడం మంచిదని



జాగ్రత్తలు తప్పనిసరి..

న్యాయనిపుణులు సూచిస్తున్నారు. పుట్టిన పిల్లలకు కూడా మున్ముందు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడాల్సి ఉంది. అనూహ్యమైన ప్రమాదాలతో భాగస్వామి ఆస్పత్రి పాలైతే అవసరమైన సేవలు అందించడానికి, చికిత్సకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి బాధితవ్యక్తి తల్లిదండ్రులు, బంధువుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాలి. మెడికల్ పవర్ ఆఫ్ అటార్నీని ముందుగా రాయడం ద్వారా అధిగమించవచ్చు.

నగరంలో స్థిరపడిన సంస్కృతి

వుయ్ ఆర్ మ్యారీడ్ అన్నంత సహజంగా వుయ్ ఆర్ ఇన్ రిలేషన్ షిప్ అంటున్నాయి జంటలు. ఆ అనుబంధం పేరే లివిన్. 'లివింగ్ టు గెదర్' తెలుగీకరిస్తే 'సహజీవనం'. వివాహంతో పని లేకుండా, జీవితాంతం కలిసి జీవిస్తామని ప్రమాణాలు చేసుకోకుండా, స్త్రీ–పురుషుడు కలిసి ఉండడమే 'లివిన్ రిలేషన్‌షిప్'. భిన్న సంస్కృతుల నిలయమైన నగర జీవనంలో వైవాహిక బంధానికి ప్రత్యామ్నాయంగా ఈ సరికొత్త సంస్కృతి స్థిరపడిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.



ఫిర్యాదులు ఇలా..

- నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఫిబ్రవరి 18న ఈవెంట్ ఆర్గనైజర్ సేవలు అందించే 30ఏళ్ల మహిళ తన భాగస్వామి ఖాలిద్ చిత్రహింసలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది.
- గత ఏప్రిల్ 1న గచ్చిబౌలిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న లివ్ ఇన్ కపుల్ మధ్య వ్యక్తిగత విబేధాలు తారాస్థాయికి చేరడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఆ అమ్మాయిది చత్తీస్‌గఢ్ కాగా అబ్బాయిది బీహార్ కావడం గమనార్హం.
- అనురాధారెడ్డి అనే మహిళ తనకన్నా వయసులో చిన్నవాడైన చంద్రమోహన్ అనే వ్యాపారితో రిలేషన్ షిప్‌లో ఉంటూ హత్యకు గురయ్యారు. ముక్కలైన ఈమె మృతదేహాన్ని గతేడాది మే 25న పోలీసులు కనుగొన్నారు.
- లివిన్ రిలేషన్ షిప్‌లో ఉంటూ తమ జల్సాలు తీర్చుకోవడం కోసం మ్యాట్రిమోనియల్ పేరిట అబ్బాయిలకు వలవేస్తున్న యువతిని, ఆమె లివిన్ పార్ట్‌నర్‌ని రాచకొండ పోలీసులు 2022 డిసెంబరు 18న అరెస్ట్ చేశారు.
- గతేడాది జూలై 23న ఫిలింనగర్‌కు చెందిన సెక్యూరిటీ గార్డ్ శివకుమార్ తన లివిన్ పార్ట్‌నర్‌తో వచ్చిన విబేధాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- మహిళల పక్షపాతిగా మారిన కొన్ని చట్టాలు అబ్బాయిల్ని పెళ్లికి విముఖులుగా మార్చి, ఈ బంధం వైపు ప్రేరేపిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆడవాళ్లకే నష్టం ఎక్కువ..

ఏదేమైనా, ఇందులో పార్ట్‌నర్స్ ఇద్దరికీ ఎటువంటి హక్కులూ ఉండవు. 'సహజీవనం' విఫలమై మా వద్దకు వస్తున్న మహిళలు కొంత కాలం కలిసి జీవించాక విడిపోతే మనోవర్తి వస్తుందా? అని అడుగుతున్నారు. ఈ బంధానికి చట్టపరమైన రక్షణ లేకపోవడం వల్ల ఆడవాళ్లకే నష్టం ఎక్కువ జరుగుతోంది.

– నిశ్చలసిద్ధారెడ్డి, హైకోర్టు అడ్వకేట్

క్లుప్తంగా...

ప్రైవేటు బీసీ బిల్లుకు ఒవైసీ హామీ

ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): మజ్లిస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో ప్రైవేటు బీసీ బిల్లు పెడతామని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ బిల్లు కోసం ఇతర పార్టీలను కూడగట్టాలని ఒవైసీ సూచించినట్లు ఆయన తెలిపారు. ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ నేతృత్వంలో బీసీ నేతలతో కూడిన ప్రతినిధి బృందం గురువారం ఒవైసీని కలిసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేకత అవలంబిస్తోందని, ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం బీసీలకు వాటా ఇవ్వడం లేదన్నారు. రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. ఇప్పటికైనా చట్టసభలలో బీసీలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విజయవాడ సీపీగా రాజశేఖర్‌బాబు



సాక్షి, అమరావతి: ఏపీలో తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న అంజనా సిన్హాకు ఏపీఎస్పీ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా ఐజీ రాజశేఖర్ బాబును నియమించింది. ఆయనతోపాటు మరో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవాది రవికుమార్‌పై దాడి హేయం

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఓ కేసులో ముందస్తు బెయిల్ తీర్పు కాపీతో సిద్దిపేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్ఐ ఉమారెడ్డి దాడి చేయడం హేయమని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. నిందితుడిపై దాడిని ప్రశ్నించిన న్యాయవాది ఫోన్‌ను లాక్కోవడమే కాకుండా తీవ్రంగా గాయపరిచారన్నారు. ఆయనపైనే దాడి చేసి తిరిగి తమ విధులను అడ్డుకున్నారంటూ న్యాయవాదిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ గురువారం హైకోర్టు అసోసియేషన్ హాల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, డీజీపీ జోక్యం చేసుకుని ఏఎస్ఐతో పాటు తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదులో పాల్గొన్న పోలీసులందరినీ సస్పెండ్ చేయాలన్నారు. అలాగే ఉమారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, న్యాయవాదిపై ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దీప్తి, సెక్రటరీలు శాంతిభూషణ్ ఉప్పల, సంజీవ్ జిల్లెల, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో నివేదిక అమలు నిలుపుదల

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు సంబంధించి ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసీసీ) ఇచ్చిన నివేదికల అమలును నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫిర్యాదు ప్రతులను, నివేదికను ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఎందుకు ఇవ్వలేదని ఐసీసీ చైర్మన్, డీఎంఈ, ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు వేధింపులకు గురైన విద్యార్థినిని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశించింది. ఓ పీజీ విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారంలో ఐసీసీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ ఆమె సహచరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు కాపీని, సాక్షుల వాంగ్మూలాలను పిటిషనర్లకు ఇవ్వలేదని వారి తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ పూసర్ల, న్యాయవాది శ్రేయాదేవికి వాదనలు వినిపించారు. ఐసీసీ విచారణ సరిగా సాగలేదని, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గత మేలో ఇచ్చిన రెండు నివేదికలను నిలుపుదల చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మళ్లీ ఆదేశాలు ఇచ్చేవరకు ఈ ఉత్తర్వులు కొనసాగుతాయని చెప్పారు. విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు.

ఒక్కరికే వందనం.. అందరికీ ఎగనామం!

'తల్లికి వందనం'పథకంపై కూటమి ప్రభుత్వం యూటర్న్


- ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ ఇస్తామని ఎన్నికల్లో హామీ
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటన
- జీవో నంబర్ 29లో ఒక్క తల్లికి మాత్రమే 'తల్లికి వందనం'అని స్పష్టీకరణ
- కోటి మంది పిల్లలను నిలువునా మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు
- అధికారంలోకి వచ్చి నెల రోజులైనా విద్యా రంగంపై స్పష్టత ఇవ్వని వైనం
- రాష్ట్ర ప్రభుత్వం వద్ద 82,29,858 మంది విద్యార్థుల డేటా
- అయినా లబ్ధిదారుల ఎంపిక పేరుతో తాత్సారం చేస్తున్న సర్కారు
- ఇన్నాళ్లకు కేవలం గైడ్‌లైన్స్ మాత్రమే జారీ.. అందులోనూ ప్లేటు ఫిరాయింపు

'నేను హామీ ఇస్తున్నాను.. తల్లికి వందనం కింద సంవత్సరానికి ప్రతి ఒక్క బిడ్డకూ (విద్యార్థిని, విద్యార్థులు) 15 వేల రూపాయలు ఇచ్చే బాధ్యత నాదీ... ఒక్కరికే అనే నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికీ ఇస్తా.. ముగ్గురుంటే ముగ్గురికీ ఇస్తా.. నలుగురుంటే నలుగురికీ ఇస్తా.. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తా. ఈ లెక్కన నలుగురుంటే రూ.60 వేలు ఇస్తా'అని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఊరూరా లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా మాట ఇచ్చారు. బాబుతో పాటు టీడీపీ నేతలంతా ఇంటింటా ఇవే మాటలు చెప్పారు. ఇలా మాయ మాటలు చెప్పి.. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కాక నిస్సిగ్గుగా ప్లేటు మార్చారు. మరీ ఇంత దుర్మార్గమా.. అని ఎవరైనా చంద్రబాబును ప్రశ్నిస్తే అదే మరి రాజకీయం అంటే అని చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడరు. ఒక్కసారి ఆయన గారి చరిత్ర తిరగేస్తే ఇంకా ఇలాంటి మోసాలు మునుముందు చాలానే కనిపిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

మేనిఫెస్టోలో..




అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

తల్లికి మాత్రమే రూ.15,000 అందిస్తామంటూ జీవో

సాక్షి, అమరావతి: మాట మార్చడంలో డబుల్ పీహెచ్‌డీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి తన నైజాన్ని చూపించారు. 'తల్లికి వందనం'పేరిట ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామన్న అంశంపై మాట తప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి.. ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు, నలుగురుంటే రూ.60 వేలు ఇస్తామని లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా ఇచ్చిన మాటను గాలికి వదిలేశారు. ఇప్పుడు ఈ పథకాన్ని చదువుకునే పిల్లల్లో ఒక ఇంట్లో ఒక్కరికే అమలు చేస్తామని ప్రకటించారు. ఆధార్ అనుసంధానం పేరుతో అనేక కొర్రీలు వేసి లబ్ధిదారులను తగ్గించే పనిలో ఉన్నారు. అందుకే ఏటా జూన్ నెలలో పాఠశాలలు తెరిచిన వెంటనే ఇవ్వాల్సిన పథకంపై కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. బుధవారం జీవో నం.29 విడుదల చేసి.. పిల్లలతో సంబంధం లేకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. అంటే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన 42.62 లక్షల మంది లబ్ధిదారుల కంటే తక్కువ మందికే ఇవ్వాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. 'ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం'అమలు చేస్తాం. ఆ మొత్తం నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తాం. ఇంకా పిల్లలను కనండి పథకాలు అందుకోండి'అంటూ ఎన్నికల్లో చంద్రబాబు ప్రకటిస్తే.. ఇప్పుడు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న నిమ్మల రామానాయుడు ఆ పథకం గురించి తనదైన శైలిలో 'నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు..'అంటూ చిన్న పిల్లలను చూపిస్తూ ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఇన్ని ఆధారాలు ఉన్నా ఇపుడు 'వందనం ఒక్కరికే'అనడంపై తల్లులు మండి పడుతున్నారు.



కోటి మంది పిల్లల్లో భారీగా కోత

రైతులకు రుణమాఫీ చేస్తామని టీడీపీ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి రాగానే అనేక కొర్రీలు వేసి లబ్ధి పొందే రైతులను తగ్గించడంతో పాటు రుణ మాఫీని సైతం భారీగా కుదించేశారు. ఇప్పుడు తల్లికి వందనం పైనా ఇలాగే ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ తలో రూ.15 వేలు చొప్పున ఇస్తూ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చేసిన ప్రకటనకు విరుద్ధంగా ముందుకెళుతోంది. అందుకు అనుగుణంగానే జీవో నం.29లో జారీ చేసింది. పిల్లలు అందరికీ ఇస్తామన్న పథకాన్ని 'తల్లికి మాత్రమే రూ.15000'అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అంటే రాష్ట్రంలో దాదాపు కోటి మందికి పైగా పిల్లలున్నారు. ఇందులోనూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు కసరత్తు చేస్తోంది. అందుకే ఆధార్‌తో లింక్ అయ్యి ఉన్న అన్ని ఆస్తుల వివరాలను తీసుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విధించిన నిబంధనలను కాకుండా మరింత కఠినంగా నిబంధనలు రూపొందిస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతి బిడ్డా చదువుకునేందుకు బడికి వెళ్లడమే లక్ష్యంగా జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. అన్ని మేనేజ్‌మెంట్ల స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలను ప్రోత్సహించేందుకు వారి తల్లులకు ఏటా రూ.15 వేలు జమ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కాలేజీల్లో చదివే పిల్లలకు మాత్రమే అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

మూడుసార్లు మాట మార్చిన కూటమి

చదువుతో సంబంధం లేకుండా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు బహిరంగంగా ప్రజలకు మాట ఇచ్చారు. 'స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సాయం'అంటూ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చారు. ఇప్పుడు తాజాగా ఇచ్చిన ఆదేశాల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలున్న తల్లికి మాత్రమే ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. అంటే ఒకే అంశంపై మూడుసార్లు మాట మార్చారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కాలేజీలు, ప్రయివేట్ ఎయిడెడ్, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలు గల తల్లులకు అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. కానీ ఇప్పుడు ఇచ్చిన ఆదేశాల్లో ఎక్కడా స్కూళ్లు, కాలేజీల ప్రస్తావన చేయలేదు.

నూరు శాతం పిల్లల డేటా ఉన్నా కాలయాపన

2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి ఇంటర్ వరకు మొత్తం 82,29,858 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్నారు. కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య కూడా దీనికి జత చేయాలి. ఈ వివరాలు ప్రభుత్వం వద్ద నూరు శాతం ఉన్నాయి. కానీ ఎన్‌డీఏ కూటమి విద్యార్థుల సంఖ్యను సర్వే చేసి తేల్చాలని నిర్ణయించింది. తద్వారా ఈ విద్యా సంవత్సరంలో పథకం అమలు చేయకుండా దాటవేయడానికి మార్గాలు అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆ ప్రభుత్వమే ఉండి ఉంటే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కొనసాగుతూ ఉండింటే ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా పథకాలు అమలై ఉండేవి. గత ఐదేళ్లలో ఈ పథకాలన్నీ చెప్పిన రోజు చెప్పినట్లు అర్హత గల లబ్ధిదారులందరికీ అందాయి. అర్హత ఉండీ కూడా ఏ కారణం వల్లనైనా లబ్ధి పొందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి మరీ మేలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి నిజంగా పిల్లలపై ప్రేమ ఉంటే జూన్ నెలలోనే తల్లికి వందనం (అమ్మ ఒడి) పథకాన్ని అమలు చేసి ఉండేది. ఈ పథకం లబ్ధిదారుల జాబితాలో ఎలా కోత పెట్టాలా.. అని నెల రోజులకు పైగా ఆలోచించి ఇప్పుడు తీరిగ్గా గైడ్‌లైన్స్ మాత్రమే జారీ చేసింది. పిల్లలందరికీ అని చెప్పి ఇప్పుడు ఒక్కరికే అంటూ ప్లేటు ఫిరాయించింది. అది కూడా ఎప్పుడిస్తారో చెప్పక పోవడం గమనార్హం.

వివరణ ఇవ్వండి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేతపై స్పందించిన ఏపీ హైకోర్టు

- సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కు నోటీసులు
- వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలన్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తమ పార్టీ కేంద్ర కార్యాలయ భవనం కూల్చివేతకు పాల్పడిన అధికారులపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు స్పందించింది. కూల్చివేతలకు బాధ్యులైన సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లకు వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసేందుకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. చట్ట ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. వైఎస్సార్‌సీపీ భవనం కూల్చివేత విషయంలో తదుపరి చర్యలు చేపట్టే ముందు చట్టప్రకారం నడుచుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లను ఆదేశిస్తూ గత నెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి లిఖితపూర్వకంగా సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కానీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ మరుసటి రోజు తెల్లవారుజామున వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేశారు. దీంతో సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మునిసిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌లపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది నన్నపనేని శ్రీహరి అధికారుల వ్యవహారశైలిని.. కోర్టు ధిక్కారాన్ని న్యాయమూర్తికి వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులుగా ఉన్న అధికారులిద్దరికీ నోటీసులు జారీ చేశారు.

తిరుమల క్యూలో ప్రాంక్ వీడియో

- తమిళనాడుకు చెందిన వివాదాస్పద యూట్యూబర్ నిర్వాకం
- సోషల్ మీడియాలో ఆకతాయిలపై మండిపడ్డ శ్రీవారి భక్తులు



తిరుమలలోని క్యూ కంపార్ట్‌మెంట్‌లో శ్రీవారి భక్తులను ప్రాంక్ చేస్తున్న యూట్యూబర్

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భద్రతలోని డొల్లతనం, సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైంది. శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లేందుకు అనుమతి లేనప్పటికీ తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి అక్కడి సిబ్బంది కళ్లుగప్పి ఏకంగా మొబైల్‌ఫోన్ తీసుకెళ్లాడు. అంతటితో ఆగకుండా ఏకంగా ఓ ప్రాంక్ వీడియోని చిత్రీకరించడం.. ఆ తర్వాత దానిని తన ఇన్‌స్టాగ్రాం పేజీలో పోస్టు చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. వివరాలివీ..

తమిళనాడుకు చెందిన ఓ వివాదాస్పద యూట్యూబర్ టీటీఎఫ్ వాసన్ ఇటీవల తన మిత్రులతో కలిసి మొబైల్‌ఫోన్‌తో దర్శన క్యూలోకి ప్రవేశించాడు. నారాయణగిరి షెడ్లలో వేచి ఉన్న భక్తులతో తాళాలు తీస్తున్నట్లు నటించాడు. వాసన్‌ను చూసిన కంపార్టుమెంటులోని భక్తులు టీటీడీ ఉద్యోగిగా భావించి గేట్లు తీస్తారేమోనన్న భావనతో ఒక్కసారిగా పైకిలేవడంతో టీటీఎఫ్ వాసన్ వెకిలి నవ్వులు నవ్వుతూ పరిగెడుతూ రావడాన్ని తన మిత్రులు ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియోలను టీటీఎఫ్ ఫ్యామిలీ అనే తన ఇన్‌స్టాగ్రాం పేజీలో వాసన్ పోస్ట్‌చేయడంతో తమిళనాడులో ఇది వైరల్ అయింది. దర్శన క్యూల్లో భక్తులపై ప్రాంక్ వీడియోల చిత్రీకరణపై తమిళనాడులో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆకతాయి చేష్టలు చేసిన వాసన్‌ను అరెస్టుచేయాలని సామాజిక మాధ్యమాల్లో భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు టీటీడీ విజిలెన్స్ ఆదేశాలు..

ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీయడం హేయమైన చర్య అని ఒక ప్రకటనలో ఖండించింది. ప్రాంక్ వీడియోలు చిత్రీకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. సాధారణంగా నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించక ముందే భక్తుల నుండి మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేసుకుంటారని టీటీడీ తెలిపింది. కానీ, ఒకరిద్దరు ఆకతాయిల చేష్టలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని టీటీడీ ఆ ప్రకటనలో పేర్కొంది. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది.

హీరో రాజ్‌తరుణ్‌పై కేసు నమోదు

- హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో పాటు ఆమె సోదరునిపై సైతం కేసు
- పోలీసులకు ఆధారాలు ఇచ్చిన లావణ్య



మాల్వీ మల్హోత్ర, రాజ్‌తరుణ్

మణికొండ (హైదరాబాద్): హీరో రాజ్‌తరుణ్‌పై అతని ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనితో పాటు హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలపై పోలీసులు సెక్షన్ 420, 493, 506ల కింద కేసు నమోదు చేశారు. గత 11 సంవత్సరాలుగా తనతో లివింగ్ రిలేషన్‌లో ఉండటం, పెళ్లి చేసుకుని సమాజానికి తెలియకుండా ఉంచటం, ప్రస్తుతం తనను పట్టించుకోకుండా మరొకరితో కలసి ఉంటున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. 2016లో తనకు గర్భం వస్తే రెండు నెలలకే అబార్షన్ చేయించాడని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం రాజ్ తరుణ్‌తో కలసి ఉంటున్న హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలు తనను జైలుకు పంపిస్తామని, చంపేసి శవం కూడా దొరకకుండా చేస్తామని బెదిరించారని ఆమె పేర్కొన్నారు. వారు చెప్పినట్టుగానే తనకు ఏమాత్రం సంబంధం లేని డ్రగ్స్ కేసులో తనను ఇరికించి జైలుకు పంపారని ఆమె ఫిర్యాదులో వివరించారు. వాట్సాప్ చాట్‌లు, ఫొటోలు, వీడియోలను తన ఫిర్యాదుకు ఆధారాలుగా పోలీసులకు అందించారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కాగా, హీరోయిన్ మాల్వీ మల్హోత్ర సైతం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో లావణ్యపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు, ఆమె ఇచ్చిన ఆధారాలను పరిశీలించి ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని నార్సింగి పోలీసులు ఎఫ్ఐఆర్ రూపంలో రాజేంద్రనగర్ కోర్టుకు తెలిపారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

- కన్నతండ్రే చంపాడని బంధువుల అనుమానం..

చిల్పూరు: కూతురు ఆత్మహత్య చేసుకోగా, కన్నతండ్రే చంపాడని బంధువులు ఆందోళనకు దిగారు. చిల్పూరు మండలం పల్లగుట్ట జీపీ పరిధిలోని మారేపల్లిగూడేనికి చెందిన సందెళ దివ్యను ఉనికిచర్లకు చెందిన శివ వివాహం చేసుకున్నాడు. వీరికి కూతురు శైలజ(16) ఉంది. కొన్నేళ్ల క్రితం దివ్య మృతి చెందగా, శివ వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి చెందిన రేణుకను రెండోపెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రేణుకకు ఇద్దరు కూతుళ్లు. శైలజ చిన్నప్పటి నుంచే పల్లగుట్టలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. 15 రోజుల క్రితం శైలజకు జ్వరం రాగా, అదే గ్రామంలోని తన బంధువుల ఇంట్లో ఉంచి హైదరాబాద్‌కు వచ్చాడు. శైలజ విషయంలో రెండో భార్యతో 10 రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మంగళవారం శివ కూతురిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. బుధవారం ఉదయం శివ డ్యూటీకి వెళ్లగా.. ఆ సమయంలో శైలజ 'నాన్న నాపై అనుమానం పెట్టుకున్నావు.. నేను భరించలేను.. నేను కూడా అమ్మ దగ్గరికి వెళుతున్నాను' అంటూ లెటర్ రాసి పెట్టి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన శివ తలుపుకొట్టగా తీయలేదు. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా, అప్పటికే శైలజ మృతి చెందింది. గురువారం మారేపల్లిగూడెంలోని బంధువులకు విషయం చెప్పగా, దహన సంస్కారాల ఏర్పాట్లు చేసి ఉంచారు. సాయంత్రం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగానే 'శైలజను నీవే ఉరివేసి చంపావంటూ' అంబులెన్స్‌లో ఉన్న శివను కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో తప్పించుకొని చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.




శైలజ (ఫైల్)

మెడికల్ బదిలీల్లో గందరగోళం

స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వని యంత్రాంగం

- నేడే దరఖాస్తుకు చివరి రోజు కావడంతో హడావుడి
- ఎవరు దరఖాస్తు చేసుకోవాలో స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద వైద్యుల ఆందోళన
- పదేళ్లకు పైగా ఒకే చోట పని చేస్తున్న 69 మంది డాక్టర్లు
- ఓ వైద్యాధికారి ఏకంగా 25 ఏళ్లుగా ఒకేచోట ఉద్యోగం



సాక్షి, హైదరాబాద్: వైద్య సిబ్బంది బదిలీల్లో గందరగోళం నెలకొంది. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారమే గడువు కావడంతో వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది హడావుడి పడుతున్నారు. మరోవైపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారే కానీ, స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదని కొందరు ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్ కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం, డీఎంఈ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయాల వద్ద డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన బదిలీల వ్యవహారం అస్తవ్యస్తంగా ఉందనీ.. సీనియార్టీ జాబితాలు తప్పుల తడకగా తయారు చేశారని వారు మండిపడ్డారు. అలాగే నర్సింగ్ ఆఫీసర్లు, ఎంపీహెచ్ఎస్‌లు కూడా తమ బదిలీలపై గందరగోళం నెలకొందని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ముందు ప్రమోషన్లు ఇస్తారా? లేదా బదిలీలు చేస్తారా? ఏవి ముందు జరుగుతాయని తెలంగాణ బోధన ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల నిలదీశారు. బదిలీలపై యంత్రాంగం గందరగోళాన్ని సృష్టించిందని ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు డాక్టర్ నరహరి, డాక్టర్ బొంగు రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకేచోట 25 ఏళ్లుగా పాతుకుపోయి..

ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో నాలుగేళ్లు దాటిన 188 మంది డాక్టర్ల జాబితాను ప్రకటించినప్పటికీ వారు దరఖాస్తు చేసుకోవాలా? లేదా? అన్న దానిపై స్పష్టత ఇవ్వలేదని అంటున్నారు. నాలుగేళ్లు దాటిన వారంతా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన కూడా పెట్టలేదు. పైగా మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మందిని బదిలీ చేస్తామని అన్నారు. కానీ ఇది ఆప్షనా? లేక తప్పనిసరా? అన్న దానిపైనా స్పష్టత లేదు. ఆప్షన్ అయితే లాంగ్ స్టాండింగ్ వారు ఎందుకు దరఖాస్తు చేసుకుంటారు? నగరాలు, పట్టణాల్లో ఉండే వారెందుకు గ్రామాలకు వెళ్తారు? వాళ్లు వెళ్లకుంటే గ్రామాల్లో నుంచి పట్టణాలకు రావాలనుకునే వారికి అవకాశం ఎలా దక్కుతుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజారోగ్య విభాగంలో ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో నాలుగేళ్లు నిండిన వారి జాబితాను తయారు చేశారు. ఆ ప్రకారం 188 మంది డాక్టర్లు బదిలీకి అర్హత కలిగి ఉన్నారు. విచిత్రమేమంటంటే వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏకంగా 25 ఏళ్ల నుంచీ బదిలీ కాకుండా ఒకేచోట పనిచేస్తుండటం గమనార్హం. అదే జిల్లాకు చెందిన ఓ డాక్టర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో డాక్టర్ 20 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారు. 10 ఏళ్లు.. అంతకుమించి ఒకేచోట పనిచేస్తున్నవారు 69 మంది ఉండటం విస్మయం కలిగిస్తోంది. వీరిని ఇప్పుడైనా కదిలించే పరిస్థితి ఉంటుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

పైరవీలు షురూ...

మరోవైపు, తమకు ఇష్టమైన చోటకు బదిలీ చేయించుకునేందుకు పలువురు వైద్య సిబ్బంది పైరవీలు మొదలుపెట్టారు. ఈ విషయంలో కొందరు అధికారులు పనిచేసి పెడతామంటూ అడ్వాన్సులు పుచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలు, పట్టణాలకు బదిలీ కావాలంటే రూ. 5 లక్షలు, తమకు ఇష్టమైన చోటకు కావాలంటే ఆరేడు లక్షలు, ఉన్నచోటనే కదలకుండా ఉండాలంటే అంతకు మించి డిమాండ్ చేస్తున్నారన్న వాదనలున్నాయి. ఇక బోధనాసుపత్రుల డాక్టర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి రూ. 10 లక్షలకు పైనే వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సూపరింటెండెంట్ కేడర్‌లోనైతే ఇంకా ఎక్కువే డిమాండ్ ఉందని చెబుతున్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు కూడా డాక్టర్ల వెనుక ఉండి పైరవీలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

సర్టిఫికెట్లపై పేరు మార్చి ఇస్తే నష్టమేంటి ?

- ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులు, వర్సిటీలు ఉన్నది అందుకే కదా..
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఎడ్యుకేషన్ బోర్డులు, యూనివర్సిటీలు ఉన్నది విద్యార్థుల సంక్షేమం కోసమే కదా.. పేరు మార్చి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ రెండువారాలు వాయిదా వేసింది. తన పేరు మార్చుకున్నట్టు ప్రభుత్వ గెజిట్ జారీ అయినా..ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులు, ఉస్మానియా యూనివర్సిటీ ఆ మేరకు సర్టిఫికెట్లు మార్చి ఇవ్వడం లేదంటూ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వి.మధుసూదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1961లో జారీ చేసిన జీవో 1263 సెక్షన్ సీ లోని రూల్ 1, 2, 3 చట్టవిరుద్ధమని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సర్టిఫికెట్లలో పేరు మార్చేందుకు బోర్డులు నిరాకరించడం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాది కారుకొండ అరవింద్‌రావు వాదించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒకసారి పేరు మారుస్తూ గెజిట్ జారీ అయ్యాక.. ఇక సర్టిఫికెట్ మార్పు అవసరం లేదని, గెజిట్‌లోని పేరే చెల్లుబాటు అవుతుందన్నారు. రూల్ 1, 2, 3 అదే చెబుతోందని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. 'పిటిషనర్ విజ్ఞప్తి న్యాయబద్ధమైనది. ఇలాంటి వారు పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పేరు మారింది రాస్తారు.. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్‌లో పాతపేరు అలాగే ఉంటుంది. ఆ కారణంతో వారు పరీక్షకు రాయడానికి అనర్హులుగా మారే ప్రమాదం ఉంది కదా. అప్పుడు ఆ నష్టాన్ని ఎవరు పూడ్చుతారు? విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తున్న బోర్డులు, వర్సిటీలు గెజిట్ ప్రకారం పేరు మార్చి సర్టిఫికెట్ ఇస్తే నష్టమేంటి? ఇక్కడ పిటిషనర్ రూల్‌ను కూడా చాలెంజ్ చేస్తున్నారు'అని పేర్కొంది. దీనిపై తమ వివరాలు తెలియజేసేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా పిటిషనర్‌కు సర్టిఫికెట్లలో పేరు మార్చి ఇస్తారని భావిస్తున్నామని వ్యాఖ్యానించింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
12-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	27	79,897
నిఫ్టీ ▽	8	24,316

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	18,312	▲ 336
డోజోన్స్	39,764	▲ 43
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,223	▲ 30
డాక్స్	18,535	▲ 127
షాంఘై	2,970	▲ 31
నికాయ్	42,224	▲ 392

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,563 ▽	53
బంగారం (99.5 స్వచ్ఛత)	72,273 ▽	52
వెండి (కిలో)	92,204 ▽	411

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.69	108.26
€	యూరో	ఎస్‌బీఐ	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

బ్రూక్‌ఫీల్డ్ చేతికి లీప్ గ్రీన్ ఎనర్జీ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన సంస్థ లీప్ గ్రీన్ ఎనర్జీలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు కెనడియన్ అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్రూక్‌ఫీల్డ్ పేర్కొంది. ఇందుకు ముందస్తుగా 20 కోట్ల డాలర్లు(రూ. 1,670 కోట్లు) చెల్లించనున్నట్లు వెల్లడించింది. భవిష్యత్‌లో మరో 35 కోట్ల డాలర్లు(రూ. 2,920 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలియజేసింది. రెండు కంపెనీలు వ్యూహాత్మక తప్పనిసరి పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ ఒక ప్రకటనలో వివరించింది. తద్వారా లీప్ గ్రీన్ ఎనర్జీలో మెజారిటీ వాటా సొంతం చేసుకున్నట్లు తెలియజేసింది. ఒప్పందంలో భాగంగా తొలుత 20 కోట్ల డాలర్లను కొత్త షేర్లతో పాటు, ప్రస్తుత వాటాదారుల వద్ద గల షేర్ల కొనుగోలుకి వెచ్చించనుంది. కంపెనీ భవిష్యత్ వృద్ధికి మద్దతుగా మరో 35 కోట్ల డాలర్ల పెట్టుబడులు సమకూర్చనుంది. కాగా.. లీప్ గ్రీన్‌లో ఎంతమేర వాటాను కొనుగోలు చేస్తున్నదీ నిర్దిష్టంగా వెల్లడించకపోవడం గమనార్హం! ప్రస్తుతం లీప్ గ్రీన్ 775 మెగావాట్ల ఎనర్జీ సౌర, పవన విద్యుత్ ఆస్తులను కలిగి ఉంది. వీటిలో నిర్మాణం, నిర్వహణలోని ఆస్తులు కలసి ఉన్నాయి.

- ముందస్తుగా రూ. 1,670 కోట్ల చెల్లింపు
- మరో రూ. 2,920 కోట్ల పెట్టుబడులకు సై

• చమురు రంగంలో అవకాశాలు

100 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి (ఈ అండ్ పీ) రంగంలో 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఈ రంగంలో స్వీయ సమృద్ధి సాధిస్తే దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, అలాగే ఇంధనాల ధరలు తగ్గడానికి కూడా ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. సుస్థిర ఆర్థికాభివృద్ధికి కీలకమైన ఇంధన రంగం స్వీయ సమృద్ధి సాధించడంలో 'ఈ అండ్ పీ' ముఖ్య పాత్ర పోషించగలదని 'ఊర్జా వర్తా' సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. భారత్‌లో వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ చమురు కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుండటం ఆశ్చర్యకరమైన అంశమన్నారు. దేశీయంగా చమురు, గ్యాస్ వెలికితీయడానికి సంబంధించి ఇంకా బైటపడని వనరులను అన్వేషించడంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పురి చెప్పారు. ఈఅండ్‌పీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని ఆయన తెలిపారు. 2015లో ప్రవేశపెట్టిన డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ (డీఎస్‌ఎఫ్) పాలసీతో ఇప్పటివరకు 29 కొత్త సంస్థలు, 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఈ రంగంలో వ్యాపారాలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఉన్న సమస్యల అధ్యయనానికి, తగు సిఫార్సులు చేయడానికి సంయుక్త వర్కింగ్ గ్రూప్ (జేడబ్ల్యూజీ)ని ఏర్పాటు చేసినట్లు పురి తెలిపారు. ఇందులో ప్రైవేట్ ఈఅండ్‌పీ ఆపరేటర్లు, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు, డీజీహెచ్, పెట్రోల్.. సహజవాయువు శాఖ నుంచి ప్రతినిధులు ఉంటారన్నారు.



- దిగుమతులు తగ్గించుకునే ఆస్కారం
- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి వెల్లడి

టీసీఎస్ బోణీ భేష్!



ముంబై: ఐటీ సేవలకు దేశీయంగా నంబర్ వన్‌గా నిలుస్తున్న టీసీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్ (క్యూ1)లో నికర లాభం 8.7% ఎగసి రూ. 12,040 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 11,074 కోట్లు ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం 5.4% వృద్ధితో రూ. 62,613 కోట్లకు చేరింది. అయితే త్రైమాసికవారీగా అంటే క్యూ4 (జనవరి-మార్చి)తో పోలిస్తే నికర లాభం 3.1%, ఆదాయం 2.2% చొప్పున నీరసించాయి.

మార్జిన్లు గుడ్

వార్షిక వేతన పెంపు నేపథ్యంలోనూ తాజా త్రైమాసికంలో కంపెనీ మెరుగైన నిర్వహణ మార్జిన్లను సాధించినట్లు సీఎఫ్‌వో సమీర్ సేక్సారియా వెల్లడించారు. పటిష్ట నిర్వహణ సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తున్నదని పేర్కొన్నారు. వార్షిక వేతన పెంపును విజయవంతంగా అమలు చేసినట్లు కంపెనీ చీఫ్ హెచ్‌ఆర్ అధికారి మిలింద్ లక్కడ్ తెలియజేశారు. పరిశ్రమలో అగ్రస్థానం, పటిష్ట బిజినెస్ పనితీరు, నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడంపై నిరంతర దృష్టి సంతృప్తినిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ నేతృత్వంలో వర్ధమాన మార్కెట్లలో 62 శాతం వృద్ధిని సాధించింది. ప్రధానంగా బీఎస్‌ఎన్‌ఎల్ డీల్ ఇందుకు సహకరించింది. త్రైమాసికవారీగా మాత్రం అన్ని ప్రధాన మార్కెట్లలోనూ వృద్ధి నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. కంపెనీకి అత్యంత కీలకమైన బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) విభాగం 1% తగ్గగా.. కన్జూమర్ బిజినెస్, టెక్నాలజీ, సర్వీసులు, కమ్యూనికేషన్స్, మీడియా రంగాలు 7.4% వెనకడుగు వేశాయి. తయారీ 9.4% ఎగసింది.

క్యూ1 రిపోర్ట్ కార్డ్
- లాభం రూ. 12,040 కోట్లు
- ఆదాయం రూ. 62,613 కోట్లు
- డివిడెండ్ రూ. 10
- కొత్త ఉద్యోగులు 5452
- మొత్తం సిబ్బంది 6,06,998
- వలసల రేటు 12.1%

కొత్త ఏడాది ఉత్సాహంగా..



కొత్త ఆర్థిక సంవత్సరాన్ని పటిష్టంగా ప్రారంభించామని చెప్పేందుకు ఉత్సాహపడుతున్నాను. విభిన్న రంగాలు, మార్కెట్లలో అన్ని అంశాలలోనూ వృద్ధిని అందుకున్నాం. క్లయింట్ సంబంధాల విస్తరణ, కొత్త సామర్థ్యాల సృష్టి, సాంకేతికతల మెరుగు, ఆవిష్కరణలపై పెట్టుబడులు కొనసాగిస్తున్నాం. వీటిలో ఫ్రాన్స్‌లో ఏఐ కేంద్రం, యూఎస్‌లో ఐవోటీ ల్యాబ్, లాటిన్ అమెరికా, కెనడా, యూరప్‌లలో డెలివరీ సెంటర్ల విస్తరణ తదితరాలున్నాయి.

-కె.కృతివాసన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

ఇతర విశేషాలు
- మార్జిన్లు 1.5 శాతం మెరుగుపడి 24.7 శాతానికి చేరాయి.
- 13.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను పొందింది.
- మూడు త్రైమాసికాల తర్వాత క్యూ1లో 5,452 మంది ఉద్యోగులు జతయ్యారు.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,06,998కి చేరింది.
- ఐటీ సర్వీసుల్లో ఉద్యోగ వలసల రేటు 12.1%గా ఉంది.
- ఒక్కో షేరుపై రూ. 10 డివిడెండ్ చెల్లించనుంది.

టీసీఎస్ షేరు ధర గురువారం స్వల్పంగా పెరిగి రూ. 3,923 వద్ద ముగిసింది.

మార్కెట్‌కు స్వల్ప నష్టాలు




ముంబై: కార్పొరేట్ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాల ప్రారంభం, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అధిక వెయిటేజీ షేర్లలో లాభాలు స్వీకరించారు. ఉదయం లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 706 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 27 పాయింట్లు నష్టపోయి 79,897 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,194 – 24,403 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 8 పాయింట్ల నష్టంతో 24,316 వద్ద ముగిసింది. రియల్టీ, ఆటో, యుటిలిటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణం తగ్గొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా కన్జూమర్ షేర్లు 1% నుంచి అరశాతం నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
- ఆహార ధరలు ఇంకా తీవ్రమే: దాస్
- హైదరాబాద్‌లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

• రియల్టీ కింగ్..

డీఎల్‌ఎఫ్ 'సింగ్'



ముంబై: రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్‌ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ .. రియల్టీ రంగ కుబేరుడిగా నిల్చారు. రూ. 1,24,420 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం దక్కించుకున్నారు. మాక్రోటెక్ డెవలపర్స్ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోధా, ఆయన కుటుంబం రూ. 91,700 కోట్ల సంపదతో రెండో ర్యాంకు దక్కించుకుంది. దేశీయంగా టాప్ 100 రియల్టీ దిగ్గజాలతో గ్రోహె-హురున్ రూపొందించిన జాబితాలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ దేశంలోనే అత్యంత సంపన్నుల్లో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, రియల్టీ విభాగానికి సంబంధించి రూ. 56,500 కోట్ల సంపదతో అదానీ, ఆయన కుటుంబానికి మూడో స్థానం దక్కింది. గౌతమ్ అదానీకి చెందిన అదానీ రియల్టీ ఈ ఏడాది టాప్ 10లోకి చేరినట్లు హురున్ ఒక ప్రకటనలో తెలిపింది. 2024 మే 31 నాటికి రియల్టీ సంస్థల వేల్యుయేషన్, బడా రియల్టర్ల సంపద గణాంకాలను ఈ లిస్టుకు ప్రాతిపదికగా తీసుకున్నట్లు పేర్కొంది. కంపెనీలపరంగా చూస్తే డీఎల్‌ఎఫ్ వేల్యుయేషన్ 72% పెరిగి రూ. 2 లక్షల కోట్లకు, మ్యాక్రోటెక్ డెవలపర్స్ వేల్యుయేషన్ 160% వృద్ధితో రూ. 1.4 లక్షల కోట్లకు చేరింది. అన్‌లిస్టెడ్ సంస్థ అదానీ రియల్టీ రూ. 56,500 కోట్ల వేల్యుయేషన్‌తో ఏడో స్థానంలో ఉంది.

- రూ. 1.24 లక్షల కోట్ల సంపద; గ్రోహె-హురున్ లిస్ట్‌లో అగ్రస్థానం
- మూడో స్థానంలో అదానీ

టాప్ 20లో అపర్ణ, ఎన్‌సీసీ..

వేల్యుయేషన్‌పరంగా టాప్ 20 రియల్టీ దిగ్గజాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్, ఎన్‌సీసీ చోటు దక్కించుకున్నాయి. రూ. 33,130 కోట్ల వేల్యుయేషన్‌తో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ 11వ స్థానంలో, రూ. 18,040 కోట్ల విలువతో ఎన్‌సీసీ 20వ స్థానంలో నిల్చాయి. నగరాలవారీగా చూస్తే 6 కంపెనీలతో హైదరాబాద్ అయిదో స్థానంలో ఉంది. మహిళలు నేతృత్వం వహిస్తున్న రెండు సంస్థల్లో ఒకటిగా జి. ఇందిరా కృష్ణారెడ్డి సారథ్యంలోని తాజ్ జీవీకే నిల్చింది.

టీవీఎస్ జూపిటర్ సీఎన్‌జీ!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ జూపిటర్ సీఎన్‌జీ స్కూటర్‌ను తీసుకొచ్చే పనిలో నిమగ్నమైంది. అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాదే ఈ స్కూటర్ భారత రోడ్లపై పరుగు తీయనుంది. బజాజ్ ఆటో ఇటీవలే ప్రపంచంలో తొలి సీఎన్‌జీ బైక్ 'ఫ్రీడమ్ 125' విడుదల చేసిన నేపథ్యంలో.. పోటీ కంపెనీ అయిన టీవీఎస్ ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్‌ను పరిచయం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు సమాచారం. యూ740 కోడ్ నేమ్‌తో సీఎన్‌జీ వర్షన్‌పై టీవీఎస్ పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక టీవీఎస్ నుంచి 2024లో కొత్తగా ఎలక్ట్రిక్ టూవీలర్, పెట్రోల్ ఇంజన్‌తో ద్విచక్ర వాహనంతోపాటు ఎలక్ట్రిక్ త్రీవీలర్ రోడ్డెక్కనుంది.

సైయంట్ 'సెమికండక్టర్స్' అనుబంధ సంస్థ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ కంపెనీ సైయంట్ తాజాగా అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసింది. ఏఎస్ఐసీ సెమికండక్టర్ వ్యాపారంలో పూర్తి స్థాయి టర్న్‌కీ పరిష్కారాల కోసం ప్రత్యేక విభాగం ఉండాలని సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార పునర్‌వ్యవస్థీకరణ కోసం ఈ మేరకు బోర్డు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఏఎస్ఐసీ టర్న్‌కీ డిజైన్, చిప్ విక్రయాల్లో దశాబ్దంపైగా అనుభవం ఉందని సైయంట్ వెల్లడించింది.



ఇన్నింగ్స్ విజయం దిశగా ఇంగ్లండ్

లండన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం దిశగా సాగుతోంది. మ్యాచ్ రెండో రోజు 250 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులు సాధించింది. అండర్సన్, అట్కిన్సన్, స్టోక్స్ రెండు వికెట్ల చొప్పున తీశారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే వెస్టిండీస్ మరో 171 పరుగులు చేయాలి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 189/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 90 ఓవర్లలో 371 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (68 : 7 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (50 : 5 ఫోర్లు, 1 సిక్స్), తొలి టెస్టు ఆడుతున్న జేమీ స్మిత్ (70 : 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ 4 వికెట్లు పడగొట్టగా... హోల్డర్, గుడకేశ్ మోతీ 2 వికెట్లు చొప్పున తీశారు.

జాస్మిన్ జయహో

- రెండు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని ఫైనల్ చేరిన ఇటలీ ప్లేయర్
- 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్ పోరులో డోనా వెకిచ్‌పై విజయం
- రేపు క్రిచికోవాతో వింబుల్డన్ టైటిల్ కోసం అమీతుమీ


జాస్మిన్

లండన్: గత మూడేళ్లు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన ఇటలీ క్రీడాకారిణి జాస్మిన్ పావోలిని... ఈసారి మాత్రం విన్నర్స్ ట్రోఫీని ఇంటికి తీసుకెళ్లేందుకు విజయం దూరంలో ఉంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ వింబుల్డన్ టోర్నీలోనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో 28 ఏళ్ల జాస్మిన్ 2 గంటల 51 నిమిషాల్లో 2-6, 6-4, 7-6 (10/8)తో ప్రపంచ 37వ ర్యాంకర్ డోనా వెకిచ్ (క్రొయేషియా)పై గెలిచింది. రెండో సెమీఫైనల్లో ప్రపంచ 32వ ర్యాంకర్, 2021 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ బర్బొరా క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) 2 గంటల 7 నిమిషాల్లో 3-6, 6-3, 6-4తో 2022 విజేత, ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది. తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. రేపు జరిగే తుది పోరులో జాస్మిన్‌తో క్రిచికోవా తలపడుతుంది. ఎవరు నెగ్గినా వారికి తొలి వింబుల్డన్ టైటిల్ అవుతుంది.

వెకిచ్‌తో జరిగిన సెమీఫైనల్లో తొలి సెట్‌ను కోల్పోయిన జాస్మిన్ రెండో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో స్కోరు 4-5 వద్ద... టైబ్రేక్‌లో 5-6 వద్ద జాస్మిన్ రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో వింబుల్డన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఫైనల్ చేరిన తొలి ఇటలీ క్రీడాకారిణిగా జాస్మిన్ రికార్డు నెలకొల్పింది. 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్ వింబుల్డన్ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన మహిళల సెమీఫైనల్‌గా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. 2009లో సెరెనా విలియమ్స్ (అమెరికా), ఎలీనా దెమెంతియెవా (రష్యా) మధ్య సెమీఫైనల్ 2 గంటల 49 నిమిషాలు సాగింది. కెరీర్‌లో తొలిసారి సెమీఫైనల్ ఆడిన వెకిచ్ అందివచ్చిన అవకాశాలను చేజార్చుకొని మూల్యం చెల్లించుకుంది. జాస్మిన్ సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు వెకిచ్‌కు 14 సార్లు అవకాశం లభించగా ఆమె నాలుగుసార్లు మాత్రమే సద్వినియోగం చేసుకుంది. 42 విన్నర్స్ కొట్టిన వెకిచ్ ఏకంగా 57 అనవసర తప్పిదాలు చేసింది.

నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో మెద్వెదెవ్ (రష్యా); ముసెట్టి (ఇటలీ)తో జొకోవిచ్ (సెర్బియా) ఆడతారు. సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.


క్రిచికోవా

శ్రీలంకతో 3 టి20లు, 3 వన్డేలు ఆడనున్న భారత్

- ఈనెల 26 నుంచి సిరీస్
- రెండు జట్లకు కొత్త కోచ్‌లు





న్యూఢిల్లీ: ఈనెల చివర్లో శ్రీలంకలో పర్యటించే భారత క్రికెట్ జట్టు షెడ్యూల్‌ను విడుదల చేశారు. రెండు వేదికల్లో 13 రోజులపాటు జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంకతో భారత జట్టు మూడు టి20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడుతుంది. పల్లెకెలె మైదానంలో జూలై 26, 27, 29వ తేదీల్లో వరుసగా మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం ఆగస్టు 1, 4, 7 తేదీల్లో కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో మూడు వన్డేలు జరుగుతాయి. కొత్త హెడ్ కోచ్‌ల పర్యవేక్షణలో రెండు జట్లు ఈ సిరీస్‌లో పోటీపడనున్నాయి. టీమిండియాకు గౌతమ్ గంభీర్... శ్రీలంకకు సనత్ జయసూర్య హెడ్ కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఇంకా ప్రకటించలేదు. సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఈ పర్యటనకు దూరంగా ఉండే అవకాశముంది.

శ్రీలంక కెప్టెన్సీకి హసరంగ రాజీనామా



కొలంబో: శ్రీలంక టి20 క్రికెట్ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు లెగ్ స్పిన్నర్ హసరంగ ప్రకటించాడు. శ్రీలంక క్రికెట్ మేలు కోరే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు, జట్టులో సభ్యుడిగా కొనసాగుతానని హసరంగ వివరించాడు. హసరంగ రాజీనామా నేపథ్యంలో ఈ నెలాఖరులో స్వదేశంలో భారత జట్టుతో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో శ్రీలంక కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో ఆడుతుంది. గత నెలలో వెస్టిండీస్-అమెరికాలలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో హసరంగ నేతృత్వంలో ఆడిన శ్రీలంక లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. జట్టు పేలవ ప్రదర్శన కారణంగా హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ తన పదవికి రాజీనామా చేయగా, కోచ్ బాటనే కెప్టెన్ అనుసరించాడు.

23 ఏళ్ల తర్వాత...

కోపా అమెరికా కప్ ఫైనల్లో కొలంబియా


లెర్మా

చార్లోటి (నార్త్ కరోలినా): రెండోసారి కోపా అమెరికా కప్ చాంపియన్‌గా నిలిచేందుకు కొలంబియా జట్టు విజయం దూరంలో నిలిచింది. గతంలో 15 సార్లు చాంపియన్‌గా నిలిచిన ఉరుగ్వే జట్టుతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో కొలంబియా 1-0 గోల్ తేడాతో గెలిచింది. 39వ నిమిషంలో జెఫర్సన్ లెర్మా సొలిస్ గోల్ చేసి కొలంబియాకు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కొలంబియా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. తొలి అర్ధభాగం చివర్లో కొలంబియా ప్లేయర్ మునోజ్ రెడ్ కార్డుకు గురై మైదానం వీడాడు. దాంతో రెండో అర్ధభాగం మొత్తం కొలంబియా పది మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. మ్యాచ్ మొత్తంలో ఉరుగ్వే 62 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్నా కొలంబియా రక్షణ శ్రేణిని ఛేదించి గోల్ చేయడంలో విఫలమైంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో కొలంబియా ఆడుతుంది. 1975లో తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్ చేరిన కొలంబియా రన్నరప్‌గా నిలువగా... 2001లో రెండోసారి ఫైనల్ ఆడి తొలి టైటిల్ సొంతం చేసుకుంది.


వాట్కిన్స్

ఇంగ్లండ్ ఫినిషింగ్ టచ్

సబ్‌స్టిట్యూట్ వాట్కిన్స్ గెలుపు గోల్

సెమీస్‌లో నెదర్లాండ్స్‌పై విజయంతో వరుసగా రెండోసారి 'యూరో' ఫైనల్లోకి ఇంగ్లండ్

డార్ట్‌మండ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 58 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెర దించేందుకు ఇంగ్లండ్ జట్టుకు మరో అవకాశం లభించింది. ప్రతిష్టాత్మక 'యూరో' టోర్నీలో ఇంగ్లండ్ వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్‌తో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. ఇంగ్లండ్ తరఫున కెప్టెన్ హ్యారీ కేన్ (18వ ని.లో), ఓలీ వాట్కిన్స్ (90+1వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... నెదర్లాండ్స్ జట్టుకు సిమోన్స్ (7వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది. 1966లో ఏకైక ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన ఇంగ్లండ్ ఆ తర్వాత అంతర్జాతీయ వేదికపై మరో టైటిల్ గెలవలేకపోయింది. 2020 యూరో టోర్నీలో ఇంగ్లండ్ ఫైనల్‌కు చేరినా ఇటలీ జట్టు చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. నెదర్లాండ్స్‌తో సెమీఫైనల్ మ్యాచ్ అదనపు సమయానికి దారి తీయడం ఖాయమనిపించిన దశలో... స్టాపేజ్ ఇంజ్యూరీ టైమ్‌లో (90+1వ నిమిషంలో) సబ్‌స్టిట్యూట్ ఓలీ వాట్కిన్స్ గోల్ సాధించి ఇంగ్లండ్‌ను 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు నెదర్లాండ్స్‌ను నిలువరించిన ఇంగ్లండ్ విజయాన్ని ఖరారు చేసుకుంది. నిర్ణీత సమయంలో పలు కారణాలతో రిఫరీ ఆటను నిలిపివేయాల్సి వచ్చినపుడు అలా వృథా అయిన సమయాన్ని 90 నిమిషాల తర్వాత స్టాపేజ్ ఇంజ్యూరీ టైమ్‌గా జత చేస్తారు. ఇంగ్లండ్, నెదర్లాండ్స్ మ్యాచ్‌కు అదనంగా నాలుగు నిమిషాలు జోడించారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ హెడ్ కోచ్ గ్యారెత్ సౌత్‌గేట్ తీసుకున్న సమయోచిత నిర్ణయం విజయవంతమైంది. తొలి గోల్ చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్‌ను 81వ నిమిషంలో వెనక్కి రప్పించి అతని స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా ఓలీ వాట్కిన్స్‌ను... మిడ్‌ఫీల్డర్ ఫిల్ ఫోడెన్ స్థానంలో కోల్ పాల్మెర్‌ను సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి పంపించారు. పది నిమిషాల తర్వాత సౌత్‌గేట్ నిర్ణయం సరైనదేనని తేలింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పాల్మెర్, వాట్కిన్స్ అద్భుత సమన్వయంతో రెండో గోల్ సాధించి పెట్టారు. కుడివైపు నుంచి పాల్మెర్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో వాట్కిన్స్ అందుకొని కళ్లు చెదిరే కిక్‌తో నెదర్లాండ్స్ గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి బంతిని లక్ష్యానికి చేర్చడంతో ఇంగ్లండ్ శిబిరం సంబరాలు చేసుకుంది.


వాట్కిన్స్‌తో హ్యారీ కేన్ సంబరం

క్లుప్తంగా...

ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో మొక్కనాటాలి: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటి, అమ్మ గౌరవాన్ని పెంచడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించి పచ్చదనాన్ని పెంచాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రముఖులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలు అమ్మ పేరుతో మొక్క నాటాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో తన మాతృమూర్తి పేరుతో మొక్కను నాటాక ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు అమ్మ ప్రేరణ కావాలనీ అమ్మే ఒక స్ఫూర్తి కావాలన్న మోదీ ఆకాంక్షకు అనుగుణంగా అందరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తిచేశారు. అమ్మ మనల్ని ఎలా పెంచి పెద్ద చేసిందో అదే తరహాలో నాటిన మొక్కను కూడా సంరక్షించి పెద్దగా చేసే వరకు బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను అందరమూ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

నేడు శంషాబాద్‌లో బీజేపీ విస్తృత కార్యవర్గ భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం బీజేపీ విస్తృత కార్యవర్గ సమావేశం శంషాబాద్‌లో జరగనుంది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యచరణతోపాటు పార్టీపరంగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల తేదీలను ప్రకటించనున్నారు. స్థానికసంస్థల ఎన్నికలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలుపై ఒత్తిడి తెచ్చేలా పోరుబాట, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సమీక్ష, రాష్ట్రంలోని తాజా రాజకీయపరిస్థితులు, పార్టీగా నిర్వహించాల్సిన భూమిక తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. దీంతోపాటుగా పలు తీర్మానాలను ఆమోదించనున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తోపాటు కేంద్రమంత్రి బండి సంజయ్, పార్టీ ముఖ్యనేతలు, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకరరెడ్డి, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి,వివిధ మోర్చాల అధ్యక్షులు హాజరుకానున్నారు.

ఉన్నత విద్యలో దివ్యాంగులకు రిజర్వేషన్లు!

- నేడో, రేపో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు: ముత్తినేని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు, ఎయిడెడ్ కాలేజీల్లో దివ్యాంగులకు 5% రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఐదేళ్ల వయోపరిమితి సడలింపునకు సంబంధించి ఉత్తర్వులు నేడో, రేపో విడుదల కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం మీడియాకు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

యూట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్

- పరారీలో ఏ–2 నాగేశ్వర్‌రావు, ఏ–3, యువరాజ్, ఏ–4 సాయి



సిటీ కోర్టు: యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు నాంపల్లి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తండ్రీ, కూతురు సంబంధాన్ని మంటగలిపేలా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అశ్లీల చిత్రాలు జోడించిన హనుమంతుకు నాంపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ప్రణీత్ హనుమంతుపై పోలీసులు ఐటీ, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, గురువారం నాంపల్లి కోర్టులో హాజరు ప ర్చారు. దీనిపై విచారించిన మెజిస్ట్రేట్ ఏ–1గా ఉన్న యూట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అతన్ని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏ–2 డల్లాస్ నాగేశ్వర్‌రావు, ఏ–3 బాజ్రా యువరాజ్, ఏ–4 సాయి ఆదినారాయణ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్టుకునేందుకు సైబర్ బ్యూరో టీం ప్రయత్నిస్తోందని తెలిపారు.

డీజీపీ జితేందర్‌ను కలిసిన పోలీస్ అధికారుల సంఘం

సాక్షి, హైదరాబాద్: డీజీపీగా జితేందర్‌ను తెలంగాణ పోలీసు అధికారుల సంఘం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపీరెడ్డి ఆధ్వర్యంలో డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇంకా ఆయనను కలిసిన వారిలో తెలంగాణ పోలీసు అధికారుల సంఘం హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు నల్ల శంకర్ రెడ్డి, రాచకొండ అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, నాగర్ కర్నూల్ అధ్యక్షుడు గుణవర్ధన్, నిజామాబాద్ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, మహబూబ్ నగర్ అధ్యక్షుడు వెంకటయ్య, వరంగల్ అధ్యక్షుడు శోభన్, నల్లగొండ అధ్యక్షుడు బి.జయరాజు, సీఐడీ విభాగం అధ్యక్షుడు మల్లికార్జున్, పీటీఓ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు మసూద్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

70 ఏళ్ల మర్రి చెట్టుతో 'ఆటలు'

పరకాల ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ ఘనకార్యం



పరకాల(హన్మకొండ): వందల ఏళ్ల మర్రి వృక్షాలను సెలైన్‌లు పెట్టి మరీ బతికించుకుంటుంటే మరోవైపు పచ్చని చెట్లను పాత శాలలకు కొత్త భవనాలు, మైదానాల పేరిట నరికేస్తున్నారు. రెండు రోజుల క్రితం హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు ఆడుకోవటానికి ఇబ్బందిగా ఉందంటూ వార్డెన్ అమృత్‌రావు 70 ఏళ్ల మర్రి వృక్షంతోపాటు మరికొన్ని చెట్లను నరికివేయించారు. వృక్షాల ప్రయోజనాలను నేర్పాల్సిన ఉపాధ్యాయులే చెట్లను నరికి వేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. చెట్లను నరికేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులకు మర్రి వృక్షంతో ఇబ్బందులున్నాయని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాతనే నరికివేయించామని అమృత్‌రావు చెప్పారు.



ఆషాఢం వచ్చేను... గోరింట పండేను

ఆషాఢ మాసం సందర్భంగా గురువారం నల్లగొండలోని బందారు గార్డెన్స్‌లో మహిళలు గోరింటాకు పండుగను జరుపుకున్నారు. గోరింటాకు తెచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం గోరింటాకు పెట్టుకుని ఆనందంగా ఆడి పాడారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

గృహజ్యోతి పథకం అర్హులకు మరో అవకాశం

సాక్షి, హైదరాబాద్: గృహాలకు ప్రతినెలా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద వివిధ కారణాలతో లబ్ధిపొందలేకపోతున్న వారికి సైతం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అవకాశం కల్పించనుంది. ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ గురువారం వెల్లడించారు. లబ్ధిదారులు ఇళ్లు మారినప్పుడు, రేషన్‌కార్డు–సర్వీస్ కనెక్షన్ అనుసంధానం కాకపోవడం వంటి కారణాలతో లబ్ధిపొందలేకపోతున్న వారు ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. నల్లగొండ రూరల్ మండల ప్రజాపరిషత్ లోని ప్రజాసేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు.

ఇంజనీరింగ్ సీట్లు పెరగవా?

- కొత్త సీట్లపై అధికారుల అభ్యంతరం
- కంప్యూటర్ కోర్సులకు ఫ్యాకల్టీ ఎక్కడన్న ప్రశ్నలు.. సీట్ల పెంపు సరికాదంటూ ప్రభుత్వానికి నివేదిక
- ఇప్పటికే మేనేజ్‌మెంట్ సీట్ల అమ్మకం
- డబ్బులు కట్టిన విద్యార్థుల్లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో కొత్త సీట్లపై నెలకొన్న పేచీ ఇప్పట్లో తేలేట్టు లేదు. తొలి దశ కౌన్సెలింగ్ ముగిసే నాటికి దీనిపై స్పష్టత రావడం కష్టమని అధికార వర్గాలే అంటున్నాయి. దీంతో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం డొనేషన్ కట్టిన విద్యార్థుల్లో ఆందోళన కన్పిస్తోంది. సీట్లు వస్తాయో? రావో? తెలియని అయోమయ స్థితిలో పలువురు తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యాల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్రంలోని దాదాపు వంద కాలేజీలు ఈ ఏడాది సీట్ల పెంపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇతర బ్రాంచీలు తగ్గించుకుని కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచాలని కోరాయి. కొత్తగా వచ్చేవి 10 వేలు, బ్రాంచీ మార్పుతో వచ్చే సీట్లు మరో పది వేలు... మొత్తంగా 20 వేల సీట్లు పెరుగుతాయని కాలేజీలు ఆశించాయి. ఇవన్నీ కంప్యూటర్ సైన్స్, అనుబంధ కోర్సులే.

ఇప్పట్లో అనుమతి లేనట్టేనా?

బ్రాంచీల మార్పు, కొత్త సెక్షన్లకు ప్రైవేటు కాలేజీలు చేసిన దరఖాస్తులను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతించింది. కానీ రాష్ట్రంలోని వర్సిటీలు మాత్రం అనుమతించేందుకు వెనుకాడుతున్నాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో 173 కాలేజీల్లోని 98,296 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కన్వీనర్ కోటా కింద 70,307 సీట్లు భర్తీ చేయాల్సి ఉంటుంది. వీటిల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్ గ్రూపుతో పాటు, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహా పలు కంప్యూటర్ కోర్సుల్లోని సీట్లే 48 వేలున్నాయి. ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్‌లో 9618, ఎలక్ట్రికల్‌లో 3602, మెకానికల్‌లో 2499 సీట్లు ఉన్నాయి. గత ఐదేళ్లతో పోలిస్తే ఈ బ్రాంచీల్లో సగటున 50 శాతం సీట్లు తగ్గాయి. ఇప్పుడు మొత్తం కంప్యూటర్ కోర్సులనే అనుమతిస్తే భవిష్యత్‌లో సంప్రదాయ కోర్సులే ఉండే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వానికి పంపిన నివేదికలోనూ ఇదే అంశాన్ని అధికారులు ప్రస్తావించినట్టు తెలిసింది. మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సివిల్ కోర్సులు చేసినప్పటికీ సాఫ్ట్‌వేర్ అనుబంధ అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు వెళ్లే అవకాశం ఉందని వర్సిటీలు భావిస్తున్నాయి. ఈ కారణంగానే ఆ బ్రాంచీల రద్దును అంగీకరించేందుకు వర్సిటీ అధికారులు ఏమాత్రం ఇష్టపడటం లేదు. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు. ఈ కారణంగానే కొత్తగా రావాల్సిన 20 వేల సీట్లు తొలి కౌన్సెలింగ్‌లో ఇప్పటికీ చేర్చలేదని చెబుతున్నారు.

ఫ్యాకల్టీ ఎక్కడ...?

సీఎస్ఈని సమర్థవంతంగా బోధించే ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా ఉందని అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఉన్న సెక్షన్లకు బోధకులు సరిపోవడం లేదని, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచీలు బోధించే వారితో క్లాసులు చెప్పిస్తున్నారని తనిఖీ బృందాలు పేర్కొంటున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ కోర్సులకు ఇప్పటికీ ప్రత్యేక శిక్షణ పొందిన వాళ్లు లేరని అధికారులు అంటున్నారు. వివిధ రంగాల్లో నిపుణులైన సాఫ్ట్‌వేర్ నేపథ్యం ఉన్న ఉద్యోగుల చేత, లేదా కొన్ని చాప్టర్స్‌ను ఆన్‌లైన్ విధానంలో ఎన్ఆర్ఐల చేత బోధించే వెసులుబాటు కల్పించినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త సెక్షన్లు, కంప్యూటర్ సీట్ల పెంపునకు అనుమతించడం సరైన విధానం కాదని అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించినట్టు ఓ అధికారి చెప్పారు.

ముగిసిన స్లాట్ బుకింగ్... ఆప్షన్లే తరువాయి

తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు గురువారంతో స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఇప్పటి వరకూ 97,309 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 33,922 మంది 16,74,506 ఆప్షన్లు ఇచ్చారు. కొంత మంది అత్యధికంగా 942 ఆప్షన్లు ఇచ్చారు. ఈ నెల 15వ తేదీతో ఆప్షన్లు ఇచ్చే గడువు ముగుస్తుంది. ఈ తేదీనాటికి మరికొన్ని ఆప్షన్లు వచ్చే వీలుందని తెలుస్తోంది. ఆప్షన్లు ఇచ్చిన వాళ్లలో 78 శాతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ బ్రాంచీకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికీ కంప్యూటర్ సైన్స్ సీట్లు పెరుగుతాయనే విద్యార్థులు భావిస్తున్నారు. పెరిగే సీట్లపై అధికారులు స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని, అప్పుడే ర్యాంకును బట్టి ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సాక్షి సిబ్బంది కె.రాహుల్, అనిల్‌సింగ్ ఠాకూర్, అరుణ, ఎల్.వెంకటేశ్, హనుమాద్రి శ్రీకాంత్. చిత్రంలో హైబిజ్ టీవీ ఎండీ రాజగోపాల్, భారతి సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్‌రెడ్డి, సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి తదితరులు

ప్రజాస్వామ్యంలో మీడియా కీలకం

హైబిజ్ టీవీ మీడియా అవార్డుల కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ రంగాల్లో 70కిపైగా అవార్డుల ప్రదానం

మాదాపూర్ (హైదరాబాద్): ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియారంగం కీలక ప్రభావం చూపిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం హైబిజ్ టీవీ మీడియా అవార్డుల 4వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ, మీడియా రంగానికి ప్రభుత్వం అన్నివేళలా సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. బాధ్యతకలిగిన జర్నలిస్టులను అవార్డులతో సత్కరించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ రంగంలో పారదర్శకత అవసరమని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం జర్నలిస్టులకు స్వేచ్ఛ, ప్రాధాన్యతను ఇస్తుందని హామీ ఇచ్చారు. ఉత్తమ జర్నలిస్టులను గుర్తించి అవార్డులను అందిస్తున్నందుకు అభినందించారు.

కష్టపడిన ప్రతివారిని ప్రోత్సహించేలా..

కష్టపడ్డ ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తామని హైబిజ్‌టీవీ ఎండీ రాజగోపాల్ అన్నారు. ఐదుగురికి లెజెండ్ పురస్కారాలతోపాటు 3 విజనరీ అవార్డులను ప్రదానం చేసినట్టు తెలిపారు. మీడియా రంగంలో ప్రింట్, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ విభాగాల్లో జర్నలిజం, అడ్వర్టైజ్‌మెంట్, సర్క్యులేషన్ కేటగిరిలలో విశేష సేవలు అందిస్తున్న వారికి అవార్డులను అందజేసినట్టు తెలిపారు. ఇంగ్లిష్- ప్రింట్-రబింద్రనాథ్, ప్రింట్–తెలుగు–తాడిప్రకాశ్, ప్రింట్–ఉర్దూ–అమీర్ అలీఖాన్, ఎలక్ట్రానిక్–కె.విక్రమ్ తదితరులు లెజెండ్ అవార్డులను అందుకున్నారు. బెస్ట్ పొలిటికల్ రిపోర్టర్‌గా కె.రాహుల్, బెస్ట్ లైఫ్‌స్టైల్ రిపోర్టర్‌గా హనుమాద్రి శ్రీకాంత్, బెస్ట్ రిటైల్ వర్టికల్‌గా ఎల్.వెంకటేశ్, బెస్ట్ ఆటోమొబైల్ వర్టికల్‌గా అనిల్‌సింగ్ ఠాకూర్ అందుకున్నారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వి.రాజశేఖర్‌రెడ్డి, పల్సస్ గ్రూప్ సీఈఓ గేదెల శ్రీనుబాబు, మానెపల్లి రామారావు, హైబిజ్‌టీవీ సీఈవో డాక్టర్ జె.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ పెట్టుబడులు రూ.500 కోట్లు

- రాబోయే మూడేళ్లలో 700 మందికి ఉపాధి: మంత్రి శ్రీధర్‌బాబు
- మంత్రితో మైక్రోలింక్స్, పీఎస్ఆర్ బృందం భేటీ



మైక్రోలింక్స్, పీఎస్ఆర్ బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రానిక్, ఐటీ, ఇతర ఉత్పత్తుల రంగంలో పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ సంస్థ రూ.500 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. అమెరికా టెలికం దిగ్గజం మైక్రోలింక్ నెట్‌వర్క్స్ నుంచి సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఇటీవల ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో మైక్రోలింక్స్ అంతర్జాతీయ ప్రతినిధులు, పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావు తదితరులు గురువారం సచివాలయంలో శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ పెట్టుబడితో వచ్చే మూడేళ్లలో 700 మందికి ఉపాధి లభిస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇటీవలి తన అమెరికా పర్యటనలో మైక్రోలింక్ నెట్‌వర్క్స్, పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ నడుమ జరిగిన చర్చలు ఫలవంతమైనట్లు చెప్పారు. డేటా ట్రాన్స్‌మిషన్, నెట్‌వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్‌వర్క్స్ గ్లోబల్ లీడర్‌గా ఉందని చెప్పారు. తెలంగాణలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరతలేదన్నారు. శ్రీధర్‌బాబుతో జరిగిన భేటీలో పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావు, డైరెక్టర్ నమ్రత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు డా.డెనిస్ మొటావా, సియాన్ ఫిలిప్స్, జో జోగ్సి, సుమన్ వల్లపురెడ్డి పాల్గొన్నారు.

ఆదుకోండి.. లేదంటే | డెత్ ఇంజక్షన్‌కు అనుమతి ఇవ్వండి

కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న నల్లగొండ వాసి ఆవేదన

25 ఏళ్లుగా మంచానికే పరిమితమై నరకయాతన

నల్లగొండ టౌన్: 'కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతూ ఇరవై ఐదేళ్లుగా మంచానికే పరిమితమయ్యాను. ప్రభుత్వం చేయూతనిచ్చి నన్ను ఆదుకోవాలి.. లేదా డెత్ ఇంజక్షన్‌కు అనుమతిచ్చి ఈ నరకం నుంచి విముక్తి కల్పించాలి'అని నల్లగొండ పట్టణానికి చెందిన బాధితుడు జంపాల గోపాల్ వేడుకుంటున్నారు. బాధితుడు గోపాల్‌తో పాటు అతని తల్లి అంజమ్మ తెలిపిన వివరాలు.. నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు పరిధి సాగర్ రోడ్డు మారుతీనగర్‌కు చెందిన 44 ఏళ్ల గోపాల్ 25 సంవత్సరాలుగా మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) వ్యాధితో బాధపడుతున్నారు. గోపాల్ ఇంటర్, ఐటీఐ పూర్తి చేసి 2000 సంవత్సరంలో ఆర్టీసీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగం రావడంతో ఫిజికల్ టెస్టులో భాగంగా వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతనికి మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో ఆయన ఆర్టీసీలో ఉద్యోగం కోల్పోయాడు. తరువాత ఆరు నెలల కాలంలోనే వ్యాధి తీవ్రమై కండరాలు క్షీణించి జీవచ్ఛవంలా మారారు. కదలలేక, నడవలేక, కాళ్లు, చేతులు పనిచేయక మాటకే పరిమితమయ్యారు. 25 సంవత్సరాలుగా తాను అనుభవిస్తున్న నరకం నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అన్నీ తానైన కన్నతల్లి..

జీవచ్ఛవంలా మారి నడి వయసుకు వచ్చిన కుమారుడికి 70 ఏళ్ల వృద్ధురాలైన తల్లి అంజమ్మ ఒక్కతే దిక్కు. తల్లికి కుమారుడు చేదోడువాదోడుగా ఉండాల్సిన వయసులో తల్లే తన కుమారుడికి సపర్యలు చేస్తూ కంటికి రెప్పలా చూసుకుంటోంది. బిడ్డ అనుభవిస్తున్న నరకం చూడలేక తాను చనిపోతే బాగుండునని ఆ తల్లి కన్నీటి పర్యంతమైంది.



కొడుకు గోపాల్‌కు సపర్యలు చేస్తున్న అంజమ్మ

ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలి..

కేవలం ప్రభుత్వం ఇచ్చే వికలాంగుల పెన్షన్ 4 వేల రూపాయలే తమకు ఆధారమని ఆస్తిపాస్తులు లేని తమకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని, లేదంటే తనకు డెత్ ఇంజక్షన్ ఇచ్చి ఈ నరకం నుంచి విముక్తి కల్పించాలని బాధితుడు గోపాల్ వేడుకుంటున్నారు. అదే విధంగా తాను మరణిస్తే తన భౌతిక కాయాన్ని మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధి నయం చేసే మందును కనుగొనేందుకు పరిశోధనకు ఉపయోగించాలని కోరుతున్నారు. దాతలు ముందుకొచ్చి ఫోన్ నంబర్ 9182241141 (గూగుల్‌పే, ఫోన్‌పే)కు ఆర్థిక సాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.